fb/prajasakti, www.prajasakti.com

ప్రజాశక్తి

సిటీ◆

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajamahendravaram, Srikakulam, ongole and Ananthapuramu

సంపుటి : 38 సంచిక : 67 | విజయవాడ, శుక్రవారం 9 మార్చి 2018 | 12 + 12 పేజీలు వెల : 4.00

అంకెల్లో బడ్జెట్ (రూ. కోట్లలో)

మొత్తం బడ్జెట్	1,91,063.61
రెవిన్యూ వ్యయం	1,50,271.99
మూలధన వ్యయం	28,678.49
రెవిన్యూ ఆదాయం	1,55,507
రెవిన్యూ మిగులు (అంచనా)	5,235
ద్రవ్యలోటు	-24,205



జంబో బడ్జెట్

రూ. 1,91,063.61 కోట్లు



కేటాయింపులు ఘనం

ఆదాయం అయోమయం

అంకెల గారడీతో ఓట్లకు వల

అప్పుల కుప్పగా రాష్ట్రం

ప్రైవేటు దిశగా ఆరోగ్యం

సంక్షేమానికి పెద్ద పీట అంటూ రాష్ట్ర ప్రభుత్వం అంకెల గారడీ చేసింది. ఘనంగా కనిపించే ఒక లక్ష 91 వేల కోట్ల బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు నేలవిడిచి సాము చేశారన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. భారీ ప్రతిపాదనలకు తగ్గట్టుగా నిధుల సమీకరణ ప్రశ్నార్థకంగా ఉంది. 50 వేల కోట్ల రూపాయల కేంద్ర గ్రాంట్లపై రాష్ట్ర సర్కారు పెట్టుకున్న ఆశలు నెరవేరడం తాజా పరిణామాల నేపథ్యంలో అనుమానమే. ఇప్పటికే రాష్ట్రం అప్పుల కుప్పగా మారింది. మరిన్ని రుణాలు తెచ్చి నెట్టుకొద్దామన్నా ఎఫ్‌ఆర్‌బిఎం చట్టం ముందరి కాళ్లకు బంధం వేస్తుంది. ఆదాయాన్ని గణనీయంగా పెంచి చూపినా బడ్జెట్ రథం ముందుకు కదలని స్థితి. ఆదరణ, చంద్రన్న పెళ్లికానుక, డ్వాక్రా మహిళలకు శానిటరీ నాప్‌కిన్లు, విద్యార్థులకు కోడిగుడ్లు, హిజ్రాల సంక్షేమం అంటూ, వివిధ సామాజిక తరగతులను, నామమాత్రంగా ఉన్న, అసలు ఉనికిలో లేని కార్పొరేషన్లను పేరుపేరున ప్రస్తావిస్తూ సాగిన ప్రసంగం చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఓట్లకు వలవేయడమేనన్న అభిప్రాయం కలిగించింది. అట్టహాసంగా ప్రకటించిన ఈ పథకాలకు చేసిన కేటాయింపులు అరకొర కాగా, ఆ మాత్రపు నిధులకూ గ్యారంటీ లేని పరిస్థితి ఏర్పడింది. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు పెంచినట్టుగా కనిపించినా పోలవరంతో పాటు మిగిలిన ప్రాజెక్టులు నిర్దేశించిన కాలంలో పూర్తికావడం అనుమానమే! సర్వస్వం కోల్పోయే నిర్వాసితులను రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటిలాగే విస్మరించించింది. ఆరోగ్య రంగంలో ప్రైవేటు భాగస్వామ్యానికి పెద్దపీట వేయడంతో భవిష్యత్‌లో సామాన్యులకు వైద్య సేవలు ప్రశ్నార్థకంగా మారనున్నాయి. నాలుగేళ్లపాటు ఊరించిన నిరుద్యోగ భృతికి చివరి బడ్జెట్‌లోనూ అంతంత మాత్రపు కేటాయింపులే దక్కాయి. రైతు, డ్వాక్రా రుణాలు ఈ ఏడాది కూడా పూర్తిస్థాయిలో మాఫీ కావు. మొత్తం మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చివరి పూర్తిస్థాయి బడ్జెట్ క్షేత్రస్థాయి వాస్తవాలకు దూరంగా ఉంది.

కేంద్రం నిధులివ్వకున్నా సరే ..



కేంద్రం నిధులివ్వకున్నా 2022 నాటికి రాష్ట్రాన్ని దేశంలో ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. విభజన చట్ట ప్రకారం రావలసిన అన్ని బకాయిలు అందుతాయనే ఆకాంక్షతోనే బడ్జెట్ రూపొందించాం.

- యనమల రామకృష్ణుడు

అన్నీ తప్పుడు లెక్కలే



బడ్జెట్‌లో లెక్కలన్నీ అవాస్తవాలే. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉందని చంద్రబాబు చెబుతూనే.. బ్రహ్మాండంగా స్థూల ఉత్పత్తి ఉందని పేర్కొనడం ఎవరిని మోసం చేయడానికి?

- బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, ప్రజాపద్దుల కమిటీ ఛైర్మన్, వైసిపి ఎమ్మెల్యే

మభ్య పెట్టే బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజలను మభ్యపెట్టే విధంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా రూ.1.91 లక్షల కోట్ల బడ్జెట్లో రూ. 50 వేల కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద చూపించడమే రాష్ట్ర అత్యాశను వెల్లడిస్తోంది.

- పి మధు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి


అంతా బడాయే!



ఈ బడ్జెట్ ముమ్మాటికీ బడాయిదే. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పద్దులు రాశారంతే.

- కె రామకృష్ణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి

అటు ఇటు గుడ్‌బై



అశోక్



సుజనా



మాణిక్యాలరావు



కామినేని

కేంద్ర మంత్రులుగా అశోక్, సుజనా రాష్ట్ర మంత్రులుగా మాణిక్యాలరావు, కామినేని రాజీనామా

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌కు జరిగిన అన్యాయంపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ కేంద్ర మంత్రులు అశోక్ గజపతి రాజు, సుజనా చౌదరి రాజీనామా చేశారు. గురువారం ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీకి సమర్పించారు. బుధవారం సాయంత్రం కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి అరుణ్ జైట్లీ ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వడం సాధ్యం కాదని తేల్చి చెప్పిన నేపథ్యంలో కీలక పరిణామాలు చోటుచేసుకున్నాయి. వెనువెంటనే సిఎం చంద్రబాబు ఎంపిలతో టెలికాన్ఫరెన్స్, మంత్రులతో సుదీర్ఘ చర్చలు జరిపిన తర్వాత బుధవారం అర్ధరాత్రి కేంద్ర మంత్రులు రాజీనామా చేయాలని నిర్ణయించినట్లు విలేకరుల సమావేశంలో తెలిపారు. చంద్రబాబు ఆదేశాలు మేరకు గురువారం ఉదయం రాజీనామా చేస్తున్నట్లు ఇద్దరు కేంద్ర మంత్రులు వెల్లడించారు. అందుకు అనుగుణంగా సుజనా చౌదరి, అశోక్‌గజపతి రాజు ఇద్దరూ రాజీనామా లేఖలతో తమ నివాసం నుంచి పార్లమెంట్‌కు చేరుకున్నారు. ప్రధాన మంత్రిని కలిసి రాజీనామాలు సమర్పించాలని మంత్రులిద్దరు నిర్ణయించుకున్నారు. అయితే ప్రధాన మంత్రి మోడీ రాజస్థాన్‌లో "భేటీ పడావో..భేటీ బచావో" కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లారు. సాయంత్రం 4.00 గంటలకు ప్రధాని మోడీ ఢిల్లీకి వచ్చాక కలుస్తామని, 4.00 తరువాత రాజీనామాలు చేస్తామని అశోక్, సుజనా పార్లమెంట్‌లో మీడియా ప్రతినిధులకు తెలిపారు. ప్రధానిని కలిసి తాము రాజీనామా చేసేందుకు కారణమేంటి? ఎందుకు చేయాల్సి వచ్చిందనే వివరాలతో పాటు చంద్రబాబు ఇచ్చిన సందేశాన్ని కూడా ప్రధానికి వివరించేందుకు ఇద్దరు మంత్రులు వేచి చూశారు. అప్పటికే ప్రధాని కలిసేందుకు ఇద్దరు మంత్రులు అపాయింట్ మెంట్ తీసుకున్నారు. ప్రధాని మోడీ ఎట్టకేలకు ఢిల్లీకి చేరుకున్న తరువాత కొద్దిసేపటికే ఆయనను కలిసేందుకు

మిగతా 9లో

ఎన్డీయే నుంచీ వచ్చేయాలి

ప్రజాశక్తి -ఒంగోలు ప్రతినిధి

కేంద్ర క్యాబినెట్ నుండి ఇద్దరు మంత్రులను రాజీనామా చేయించడానికి పరిమితం కాక బిజెపి నేతృత్వంలోని ఎన్డీయే కూటమి నుండి వైదొలగాలని వైఎస్‌ఆర్‌సిపి అధినేత వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. ప్రత్యేక హోదాపై ప్రజల నుంచి వస్తున్న వత్తిళ్లు, వైసిపి అవిశ్వాస తీర్మానం నేపథ్యంలోనే చంద్రబాబు తలొగ్గారన్నారు. కేంద్ర మంత్రి అరుణ్‌జైట్లీ ప్రకటన, చంద్రబాబు స్పందన నేపథ్యంలో.... పాదయాత్రలో ఉన్న ఆయన ప్రకాశం జిల్లా సంతరావూరు వద్ద గురువారం ఉదయం మీడియా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికైనా ప్రజాకాంక్షకు తలొగ్గి కేంద్రం నుంచి తప్పుకున్నట్లు చంద్రబాబు ప్రకటిం చడం అభినందనీయమన్నారు. నెపాన్ని కేంద్రంపై నెట్టాలన్న దురాశతో కేంద్ర మంత్రి పదవులు వదులుకుంటున్నట్లు టిడిపి ప్రకటించిందని చెప్పారు. రాజీనామాలు చేయాలని నిర్ణయించుకున్నపుడు కేంద్రం పెద్దలతో మాట్లాడాల్సిన అవసరం ఏముంది?



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్ జగన్

కేంద్రం నుంచి వైదొలగినా ఎన్డీయేలో కొనసాగడంపై ఎలా అర్థం చేసుకోవాలని ఆయన ప్రశ్నించారు. రాజకీయాల్లో విలువలు, విశ్వసనీయత, నిజాయితీ చిత్తశుద్ధి చాలా ముఖ్యమన్నారు.

అవేవీ చంద్రబాబుకు లేవన్నారు. ఎన్నికలకు ముందు ప్రత్యేకహోదా సంజీవని అన్న చంద్రబాబు... తర్వాత దాని వల్ల ఏమీ ప్రయోజనం ఉండదని అసెంబ్లీలోనే వ్యాఖ్యానించారని జగన్ విమర్శించారు. జైట్లీ ఏడాదిన్నర క్రితం హోదా ఇవ్వడం కుదరదని చెప్పిన రోజునే చంద్రబాబు ఈ పని చేసి ఉంటే హోదా ఈపాటికే వచ్చి ఉండేదన్నారు. చంద్రబాబుకు తగిన సమయం ఇచ్చేందుకే ఈనెల 21 వరకూ అవిశ్వాసం కోసం ఆగామనీ, ఆయన కోరితే ముందు గానే పెడతామనీ వివరించారు. ఒక వేళ తెలుగుదేశం తీర్మానం పెట్టినా బలపరిచేందుకు తాము సిద్ధమేనన్నారు. 21న రాష్ట్రంలోని 25 మంది ఎంపీలు రాజీనామాల చేత అవిశ్వాసం తీర్మానం పెట్టిద్దామనీ, అపుడు దేశం మొత్తం చర్చనీయాంశమై కేంద్రం దిగిరాకతప్పదనీ అన్నారు. హోదా ఇవ్వొద్దని తాము ఎప్పుడూ సిఫార్సు చేయలేదని 14వ ఆర్థిక సంఘం సభ్యుడు చెప్పిన విషయాన్ని ఆయన చదివి వినిపించారు. సమావేశంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు బాలినేని శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

అతిసార కేసులో 8 మంది సస్పెన్షన్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు కార్పొరేషన్ పరిధిలో మంచినీటి పైపులైన్లు లీకై మురికి నీటితో కలిసిపోయి పది మంది మృతిచెందిన నేపథ్యంలో కార్పొరేషన్‌కు చెందిన ఎనిమిది మంది ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ చల్లా అనూరాధ తెలిపారు. అందులో ఇద్దరు నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు, డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్లను ఇంజనీరింగ్ ఇన్ చీఫ్‌కు సరెండర్ చేశామని చెప్పారు. సస్పెండ్ అయిన వారిలో సాయి కిరణ్, మదన్ మోహన్ (ఎఇలు), ఆయూబ్‌ఖాన్, భవానీబాబు (శానిటరీ ఇన్‌స్పెక్టర్లు), కె.సాంబశివరావు, చల్లా శీను (ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు), మరో ఇద్దరు ఫిట్టర్లు ఉన్నారు. డయేరియా విజృంభణకు వీరు కారణమని భావిస్తూ మున్సిపల్ పరిపాలన శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు చెప్పారు. పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి కరికాల వలనన్, డిఎంఎ కన్నబాబు, కమిషనర్ అనురాధ బాధిత ప్రాంతాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా నగరంలోని 19 వాటర్ ప్లాంట్లనూ సీజ్ చేశారు. ఇదిలా ఉండగా గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి గురువారమూ డయేరియా వ్యాధిగ్రస్తుల తాకిడి కొనసాగింది. ప్రస్తుతం 100 మందికిపైగా చికిత్సలు పొందుతున్నారు. పరిస్థితి విషమంగా ఉంటే వారిని ప్రయివేటు ఆస్పత్రులకు తరలిస్తున్నారు.



విజయవాడలో ఆశాలు నిర్వహించిన భారీ ర్యాలీ

ఐదు గంటలు రోడ్డు పైనే..

నెట్టేసిన పోలీసులు

ఆశా వర్కర్ల నిరసన

దిగొచ్చిన అధికారులు

ఆశా వర్కర్ల 'చలో విజయవాడ' విజయవంతమైంది. దీన్ని అడ్డుకునేందుకు విజయవాడ రైల్వే స్టేషన్, గాంధీనగర్, ధర్నా చౌక్ ప్రాంతాల్లో పోలీసులు పెద్దఎత్తున మొహరించారు. ఐదు గంటల పాటు ఏకధాటిగా మహిళలు నిరసన వ్యక్తం చేయడంతో వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ అధికారులు ఇక్కడికి వచ్చి స్పందించాల్సి వచ్చింది. దీంతో కార్యకర్తలు ఆందోళనను విరమించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను అరెస్టు చేశారు. ఎండవేడిమితో పలువురు స్పృహ కోల్పోయ్యారు. ఛలో విజయవాడను అడ్డుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా బుధవారం రాత్రి నుండే పోలీసులు అడగడుగునా అడ్డుకున్నారు. విశాఖ, రాజమండ్రి, పాలకోడేరు, భీమవరం, ఏలూరు, మండపేట, ద్వారపూడి, గుడివాడ, కృష్ణాజిల్లా వత్సవాయి, గుంటూరు జిల్లా మేడికొండూరుల్లో పలువురు నాయకులను నిర్బంధించారు.

హదియా కేసులో మరో మలుపు

కేరళ హైకోర్టు తీర్పును కొట్టేసిన సుప్రీం

న్యూఢిల్లీ : కేరళ యువతి హదియా వివాహ కేసులో కేరళ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీం కోర్టు కొట్టివేసింది. ముస్లింను వివాహం చేసుకునేందుకు హదియా ఇస్లామ్‌లోకి మారింది. తన భర్తతో కలిసి జీవించే హక్కు హదియాకు వుందని సుప్రీం కోర్టు పేర్కొంది. హైకోర్టు ఈ విషయంలో జోక్యం చేసుకోరాదని స్పష్టం చేసింది. ఈ కేసులో ఇంకా ఏమైనా క్రిమినల్ కోణం వుంటే దానిపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) దర్యాప్తు కొనసాగుతుందని ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని బెంచ్ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. హదియా వివాహాన్ని కొట్టివేస్తూ గతేడాది కేరళ హైకోర్టు తీర్పు ఇచ్చింది. తమ కుమార్తెను



బలవంతంగా ఇస్లామ్‌లోకి మార్చారంటూ ఆమె తల్లిదండ్రులు ఆరోపిస్తూ కేసు దాఖలు చేయడంతో దానిపై విచారించిన హైకోర్టు తీర్పు చెప్పింది.

రాజస్థాన్ స్థానిక ఉప ఎన్నికల్లో బిజెపికి ఎదురు దెబ్బ


జైపూర్ : రాజస్తాన్‌లో జరిగిన స్థానిక సంస్థల ఉప ఎన్నికల్లో అధికార బిజెపికి ఎదురుదెబ్బ తగిలింది. ఆరు జిల్లా పరిషత్ సీట్లలో నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకోగా, 20 పంచాయతీ సమితి స్థానాలకు గాను 12 స్థానాలను, అలాగే ఆరు మున్సిపల్ స్థానాల్లో నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. కొద్ది రోజుల క్రితం రెండు లోక్‌సభ స్థానాలను, ఒక అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రానుందని కాంగ్రెస్ వర్గాలు ఆశాభావంతో వున్నాయి. ఇది పార్టీ కార్యకర్తల కృషికి లభించిన మరో విజయని, గత నాలుగేళ్ల పాలనా కాలంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ రాష్ట్ర ప్రజలపై భారాలు మోపిందని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో జరుగుతున్న వివిధ స్థాయి ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటింగ్ శాతం పెరుగుతోందని, భవిష్యత్‌లో కూడా ఇదే ధోరణి కొనసాగుతుందని ఆయన విశ్వాసాన్ని వ్యక్తం చేశారు.



BUDGET 2018 బడ్జెట్ 2018



ఎన్నికలే లక్ష్యంగా..



- ద్వాక్రా, రైతు రుణమాఫీ ప్రశ్నార్థకం
- కేటాయింపుల్లో కనిపించని రాజధాని
- నిరుద్యోగ భృతికి అరకొర నిధులు
- పునరావాసానికి మొండిచేయి



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర బడ్జెట్ రానున్న ఎన్నికలను తలపిస్తోంది. తెలుగుదేశం పార్టీ అయిదేళ్ల పాలనకు ఇదే పూర్తిస్థాయి చివరి బడ్జెట్. దీంతో సంక్షేమానికి పెద్ద ఎత్తున నిధులు కేటాయింపులుల చూపారు. కావాల్సిన రంగాలకు కేటాయింపులు తగ్గించారు. ఇది ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని రూపొందించిన బడ్జెట్టేనని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. అయితే రుణమాఫీకి కేటాయించిన నిధులు సరిపోవంటున్నారు. డ్వాక్రా రుణమాఫీకి ఇప్పటికే సుమారు రూ.2400 కోట్ల చెల్లింపుల బకాయి ఉంది. తాజాగా అందుకు రూ.1460 కోట్లే కేటాయించారు. రైతు రుణమాఫీకి సుమారు రూ.10 వేల కోట్లు అవసరం కాగా రూ.4100 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే ఈ ఏడాదీ రుణమాఫీ హామీలు నెరవేరేటట్లు కనిపించడం లేదు. అధికారంలోకొచ్చిన సమయంలో మొత్తం రూ. 82 వేల కోట్ల రుణాలు మాఫీ చేస్తామని, అనంతరం దాన్ని రూ.24 వేల కోట్లకు కుదించారు. ఇటీవల చెల్లించినవి పోను ఇంకా రూ.17 వేల కోట్ల రుణాలున్నాయి. ప్రస్తుత బడ్జెట్లో రూ.4100 కోట్లు మాత్రమే కేటాయించారు. మిగిలిన బకాయిల మాట ప్రస్తావన లేదు. డ్వాక్రా రుణమాఫీ కూడా సుమారు రూ.12 వేల కోట్ల వరకు ఉంది. వడ్డీలేని రుణాలకు రూ.1700 కోట్లు కేటాయించారు. ఇవి ఏ మూలకూ సరిపోవు. రోడ్లకూ రూ.1400 కోట్లు కేటాయించి చేతులు దులుపుకొన్నారు. పట్టణాభివృద్ధికి శాఖకు రూ.7741 కోట్లు కేటాయించామని చెప్పినా అందులో రాజధానికి నిధులెన్ని అనేది స్పష్టంగా పేర్కొనలేదు. మొత్తం రూ. 1,91,063 కోట్ల అంచనాగల తాజా బడ్జెట్లో పలు కీలక రంగాలకు నిధుల కేటాయింపుల్లో స్పష్టత కనిపించడం లేదు.

నిరుద్యోగులు ఎదురు చూస్తున్న భృతికి నిధుల కేటాయింపులో తగినంత ప్రాధాన్యత లేకుండా రూ.1000 కోట్లే కేటాయించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ప్రతి ఇంటికీ ఉద్యోగం ఇస్తామని, లేకుంటే రూ. 2వేల చొప్పున నిరుద్యోగ భృతి ఇస్తామని ప్రకటించింది. ఈ ఏడాది చివరినాటికి తొమ్మిది లక్షల ఇళ్లను నిర్మిస్తామంటూ అందుకు రూ.3679 కోట్లు కేటాయించారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలంటే కనీసం రూ.20 వేల కోట్లకు పైగా నిధులు అవసరమవుతాయి. నీటిపారుదల రంగానికి రూ.14,000 కోట్లు కేటాయించారు. దీంట్లో ఒక్క పోలవరానికి రూ.9వేల కోట్లు చూపారు. మిగిలిన ప్రాజెక్టులన్నిటికీ కేవలం రూ.5వేల కోట్లు మాత్రమే కేటాయింపులున్నాయి. కాంక్రీటు నిర్మాణాలకేగాని, ప్రాజెక్టుల నిర్వాసితులకు పునరావాసం ప్రస్తావన చేయలేదు. పోలవరం పునరావాసానికి రూ.32 వేల కోట్ల వరకూ ఖర్చవుతుందని కేంద్రానికి నివేదిక పంపించారు. దానికి అనుమతి రాలేదు. కాంక్రీటు నిర్మాణాలన్నీ పూర్తి చేసే విధంగా నిధులు కేటాయింపు చేయడం పట్ల ప్రాజెక్టు ముంపు ప్రాంతాల్లో ఉన్న ప్రజలను తరిమేయడమే ధ్యేయంగా ఉందనే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు. నిజంగా ప్రాజెక్టు పూర్తి చేసే ముందే పునరావాసం కల్పించాల్సి ఉంటుంది. ఆ ఆలోచన ఎక్కడా బడ్జెట్లో కనిపించలేదు.

ఎన్టీఆర్ వైద్యసేవకు కేటాయించిన నిధులు కూడా సరిపోయే విధంగా లేవనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అన్న క్యాంటీన్లకు రూ.200 కోట్లు కేటాయించారు. రాజధానిలో నాలుగు అన్నా క్యాంటీన్లు, అక్కడక్కడ మినహా ఎక్కడా లేవు. అయినా రూ.200 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. వీటిని ఇస్కాన్ సంస్థ ద్వారా నిర్వహిస్తున్నారు. దీనికిగాను ఇస్కాన్‌కు కేంద్రం నుండి సబ్సిడీ వస్తోంది. మరి ఈ నిధులు దేనికి వెచ్చిస్తున్నారనే అంశంపైనా స్పష్టత ఇవ్వలేదు.

కేంద్రంపైనే ఆశలు

ఒకవైపు కేంద్రం నిధులు ఇవ్వడం లేదని, రాష్ట్రాన్ని ఇబ్బంది పెడుతోందని కేంద్ర మంత్రులతో రాజీనామా చేయించిన మరునాడే బడ్జెట్లో ప్రభుత్వం ప్రకటించిన తీరు హాస్యాస్పదంగా ఉందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఆర్థికంగా నలిగిపోతున్నామంటూనే 2018-19 బడ్జెట్‌ను మిగులు బడ్జెట్‌గా ప్రతిపాదించడం విశేషం. సాధ్యమైన ఆదాయాలను మదింపు చేసిన తరువాత కేంద్ర ప్రభుత్వం నుండి విభజన చట్ట ప్రకారం రావాల్సిన అన్ని బకాయిలు అందుతాయనే ఆకాంక్షతోనే ఇది సాధ్యపడిందని పదో పేరాలో పేర్కొన్నారు. కేంద్రం నుండి నిధులు వస్తాయనే ఆశాభావాన్ని బడ్జెట్లో వ్యక్తం చేశారు. ఇఎపి ప్రాజెక్టులకు రూ.50 వేల కోట్ల వరకూ వస్తాయని అంచనాలు వేశారు.

రంగాల వారీ కేటాయింపులు

నెం	రంగం	2017-18	2018-19	పెరుగుదల శాతం
1	ఎకనామిక్ సర్వీసెస్	56575.53	67830.19	19.89
	• వ్యవసాయం అనుబంధరంగాలు	9090.91	12355.32	35.91
	• గ్రామీణాభివృద్ధి	19565.44	20815.98	6.39
	• ఇరిగేషన్ వరద కంట్రోలు	12770.26	16978.23	32.95
	• విద్యుత్	4274.75	5052.54	18.19
	• పరిశ్రమలు, ఖనిజాభివృద్ధి	2085.96	3074.87	47.41
	• రవాణా	3946.19	4653.74	17.93
	• జనరల్ ఎకో సర్వీసెస్	4842.02	4899.51	1.19
2	సామాజికసేవారంగం	51268.91	67120.25	30.92
	• సాధారణ విద్య	20384.72	24185.75	18.65
	• క్రీడలు, యువజన సర్వీసులు	1005.20	1635.44	62.70
	• సాంకేతిక విద్య	765.00	818.02	6.93
	• కళలు, సాంస్కృతికం	78.27	94.98	21.36
	• వైద్యం	7020.63	8463.51	20.55
	• తాగునీటి సరఫరా, శానిటేషన్	1575.34	2623.22	66.52
	• గృహ నిర్మాణం	1456.55	3679.53	152.62
	• పట్టణాభివృద్ధి	5207.45	7740.80	48.65
	• సమాచార,పౌర సంబంధాలు	155.97	224.81	44.14
	• సంక్షేమం	11361.52	13722.98	20.78
	• కార్మిక ఉపాధి కల్పన	468.80	902.19	92.45
	• సాంఘికభద్రత, సంక్షేమం	1789.46	3029.02	69.27
	• సాధారణ సేవలు	49154.96	56113.17	14.16
	మొత్తం	156999.40	191063.61	21.70

కేంద్రం నిధులివ్వకున్నా.. ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దుతాం

- రెవెన్యూ మిగులు 5,235 కోట్లు
- బడ్జెట్ ప్రతిపాదిస్తూ మంత్రి యనమల




ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్రం నిధులివ్వకున్నా 2022 నాటికి రాష్ట్రాన్ని దేశంలో ఉత్తమ రాష్ట్రంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు తెలిపారు. ఈ ఏడాది బడ్జెట్‌ను రెవెన్యూ మిగులుతో ప్రతిపాదించడం గమనించాల్సిన అంశమని ఆయన పేర్కొన్నారు. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.1,91,063.61 కోట్ల అంచనా బడ్జెట్‌ను ఆయన గురువారం శాసనసభలో ప్రవేశపెట్టారు. శాసన మండలిలో ఈ బడ్జెట్‌ను పురపాలక శాఖ మంత్రి నారాయణ ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా శాసనసభలో మంత్రి యనమల ప్రసంగిస్తూ సాధ్యమైన ఆదాయ వనరులను మదింపు చేసి, కేంద్ర ప్రభుత్వం నుంచి విభజన చట్ట ప్రకారం రావలసిన అన్ని బకాయిలు అందుతాయనే ఆకాంక్షతో ఈ బడ్జెట్‌కు రూపకల్పన చేసినట్లు చెప్పారు. ఈ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం రూ.1,50,270.99 కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ.28,678.49 కోట్లుగా అంచనా వేసినట్లు చెప్పారు. 2017-18 బడ్జెట్ అంచనాల కంటే 2018-19 బడ్జెట్ అంచనాలు 21.69 శాతం పెరుగుదలను చూపిస్తున్నాయని తెలిపారు. గత ఏడాది కంటే రెవెన్యూ వ్యయం సుమారు 19.35 శాతం, క్యాపిటల్ వ్యయం 30.60 శాతం అధికంగా ఉన్నాయన్నారు. రెవెన్యూ మిగులు రూ. 5,2,35.24 కోట్ల మేర ఉంటుందని అంచనా వేశామన్నారు. ఆర్థిక లోటు సుమారు రూ. 24,205.21 కోట్లు ఉంటుందని, రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో ఇది 2.78 శాతం, రెవెన్యూ మిగులు 0.60 శాతం ఉండే అవకాశముందన్నారు. 2017-18 బడ్జెట్ సవరణ అంచనాల ప్రకారం రెవెన్యూ వ్యయం రూ.1,27,272.02 కోట్లు, క్యాపిటల్ వ్యయం రూ.22,875.28 కోట్లు, రెవెన్యూ లోటు దాదాపు రూ. 4,018 కోట్లు, ఆర్థిక లోటు 27,603.27 కోట్లు ఉంటుందని వివరించారు. అకౌంటెంట్ జనరల్ పరిష్కరించిన ఆర్థిక ఖాతాల ప్రకారం 2016-17కి రెవెన్యూ లోటు రూ.17,193.72 కోట్లు, ఆర్థిక లోటు రూ.30,908.82 కోట్లు కనిపిస్తుందని చెప్పారు.

మభ్య పెట్టే బడ్జెట్



- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి మధు
- హోదాకై ఉమ్మడి పోరుకు
- సిఎం వైఖరికి స్పష్టం చేయాలి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ మభ్యపెట్టే విధంగా ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి పి.మధు విమర్శించారు. సిపిఎం రాష్ట్ర కార్యాలయంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన మాట్లాడారు. ఎన్నడూ లేని విధంగా రూ.1.91 లక్షల కోట్ల బడ్జెట్లో రూ. 50 వేల కోట్లను గ్రాంట్ ఇన్ ఎయిడ్ కింద చూపించడమే రాష్ట్ర అత్యాశను వెల్లడిస్తోందని తెలిపారు. 2019 మార్చి నాటికి పది లక్షల ఇళ్లను కట్టిస్తామని చెప్పారని, ఇప్పటికి రెండు లక్ష ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయిందని పేర్కొన్నారు. ఇంకా ఎనిమిది లక్షల ఇళ్లను కట్టాల్సి ఉందని, దీనికి రూ.24 వేల కోట్ల వరకూ అవసరం ఉండగా, బడ్జెట్లో మాత్రం రూ. 3679 కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. రైతు రుణమాఫీకి రూ.4100 కోట్లు కేటాయించడం ఏ మూలకూ చాలదన్నారు. డ్వాక్రా గ్రూపులకు రూ.2400 కోట్లు రుణమాఫీ బకాయి ఉండగా రూ.1460 కోట్లు కేటాయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పేదల ఇళ్లస్థలాల కొనుగోలు, సేకరణకు రూ.4750 కోట్లు అవసరం ఉండగా రూ.575 కోట్లు మాత్రమే కేటాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంక్షేమం పేరు చెబుతూ గత బడ్జెట్ కేటాయింపులకే భారీగా కోత పెట్టారని తెలిపారు. గ్రామీణాభివృద్ధి కేటాయింపుల్లోనూ కుదింపులు చేశారని పేర్కొన్నారు. వైద్య రంగానికి నిధులను తగ్గించారని పేర్కొన్నారు. గత బడ్జెట్లో కేటాయించిన రంగాలకు నిధులు తగ్గించి మళ్లీ సంక్షేమం గురించి చెప్పడం ప్రజలను మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదని వివరించారు. రాష్ట్రంలో పరిణామాలు వేగంగా మారుతున్నాయన్నారు.

ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి మొండిచేయి చూపించడం పూర్తయిందనే బుధవారం నాటితో తేలిపోయిందన్నారు. గతంలో రాష్ట్రానికి ఇచ్చిన హామీలను అమలు చేయలేదని పేర్కొన్నారు. పోలవరంలో 70 వేల కుటుంబాలకు ముంపునకు గురవుతాయని ప్రకటించారని, వారికి ఇంతవరకు నిధులు కేటాయింపు లేదని పేర్కొన్నారు. రైల్వేజోన్, ఉత్తరాంధ్ర, రాయలసీమ అభివృద్ధికి నిధుల కేటాయింపు లేదని తెలిపారు. బిజెపి చర్యలను సిపిఎం ఖండిస్తోందన్నారు. రాష్ట్రానికి అన్యాయం చేశారని, మంత్రివర్గం నుండి బయటకు వచ్చిన టిడిపి ఎన్‌డిఎలో భాగస్వామిగా ఉంటున్నట్లు ప్రకటించిందని, దీనిపై పార్టీ వైఖరి ఏమిటో చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం అంతా ఉమ్మడిగా పోరాటం చేయాలని, దీనిపై సిఎం వైఖరి ఏమిటో స్పష్టం చేయాలని కోరారు. హోదాపై ఢిల్లీలో జరిగిన పోరుకు మంచి స్పందన వచ్చిందన్నారు. దీనిపై వెంటనే ప్రభుత్వమే అఖిలపక్ష సమావేశానికి పిలవాలన్నారు. తాము నాలుగైదు రోజుల్లో భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామని తెలిపారు.

మోసపూరిత బడ్జెట్ : సిఐటియు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం గురువారం శాసనసభలో ప్రవేశపెట్టిన బడ్జెట్ మోసపూరిత బడ్జెట్‌గా ఉందని , ఎన్నికల సంవత్సరంలో ఓటర్లకు గాలం వేసే విదంగా ఉందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్.నర్సింగరావు, ఎం.ఎ. గఫూర్‌లు అన్నారు.కేంద్రం నుంచి నిధులు రాక ఇబ్బందులు పడుతున్నామని చెబుతున్న ప్రభుత్వం బడ్జెట్ ప్రతిపాదనలు ఎలా అమలు చేస్తుందో చెప్పలేదన్నారు. కేవలం 15శాతం పెట్టుబడి ఖర్చుతో 2022 నాటికీ రాష్ట్రాన్ని దేశంలో మొదటి స్థానానికి ఎలా తీసుకెళుతుందో ప్రభుత్వం వివరించాల్సి ఉంటుందన్నారు. స్కీం వర్కర్లు, గ్రామ రెవెన్యూ సహాయకులు, విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు బడ్జెట్‌లో మొండి చెయ్యి చూపారని పేర్కొన్నారు. మద్యాహ్న భోజన పథకానికి 2017-18లో కేటాయించిన రూ.462 కోట్లు నుండి నామమాత్రంగా రూ.471 కోట్లకు పెంచారని అన్నారు. సర్వశిక్షాఅభియాన్‌కు గత ఏడాది కంటే ఈ సంవత్సరం కేటాయింపులు తగ్గాయని పేర్కొన్నారు. మహిళాశిశు సంక్షేమానికి కేటాయింపులు రూ.1657 కోట్ల నుండి రూ.2839 కోట్లు పెంచారని వారు తెలిపారు. ఎంత ఖర్చు పెట్టారో తెలియకుండా ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తోందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి. హెచ్ నర్సింగరావు, ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. గఫూర్‌లు పేర్కొన్నారు.

బడాయి బడ్జెట్ : రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ముమ్మాటికీ బడాయిదేనని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ వ్యాఖ్యానించారు. కేవలం ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పద్దులు రాశారని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది లక్షన్నర కోట్ల బడ్జెట్ ప్రవేశపెట్టి ఖర్చు చేసే సమయంలో కోతలు విధించినట్లే ఇప్పుడూ రూ.1.91లక్షల కోట్ల బడ్జెట్‌ను ప్రజల ముందు ఉంచారని పేర్కొన్నారు. గ్రామీణాభివృద్ధి, సంక్షేమం పేరిట భారీ కేటాయింపులు చూపించారని, ఖర్చు చేసేందుకు నిధులు ఎక్కడి నుంచి తెస్తారో వివరించలేదని పేర్కొన్నారు. రైతుల రుణమాఫీకి కేవలం రూ.4100 కోట్లు కేటాయించారని, రైతుల రుణాలు ఈ ఏడాది తీరవని స్పష్టమవుతోందని తెలిపారు.

పోలవరం కష్టమే!

- రెండేళ్లలో సాధ్యమయ్యేనా?
- పునరావాసం ప్రశ్నార్థకం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

జల వనరుల శాఖకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన కేటాయింపులను బట్టి ఆ రంగానికి ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. రాబోయే రెండేళ్లలో పోలవరాన్ని పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తున్నా ఆచరణలో అమలు సాధ్యమయ్యేలా లేదు. మరోపక్క సాగునీటి రంగంలో పెట్టుబడుల ప్రాధాన్యత కొనసాగుతూనే ఉంది. రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పోలవరానికి రూ. 9,994 కోట్లు కేటాయించినట్లు పేర్కొంది. ఈ నిధులు పోలవరం పూర్తయ్యేందుకు ఏ మాత్రమూ సరిపోయే పరిస్థితి లేదు. ఈ నిధుల్లోనే పుష్కర, తాడిపూడి ఎత్తిపోతల పథకాలను కలిపారు. పుష్కర పథకానికి రూ. 48 కోట్లు, తాడిపూడి పథకానికి రూ.70 కోట్లు ఈ నిధుల నుంచే కేటాయింపు చూపారు. పోలవరానికి గత నాలుగేళ్లలో కేవలం రూ. 8 వేల కోట్లు కేటాయించిన ప్రభుత్వం అంతమేర ఖర్చు పెట్టలేదనే వాదన ఉంది. ఇప్పుడు ఒక్క ఏడాదిలో కేటాయించిన రూ. 9 వేల కోట్లు ఎలా ఖర్చు చేస్తుందనేదీ ప్రశ్నార్థకమే. ప్రాజెక్టు అంచనా వ్యయం పెరిగిందని ప్రభుత్వం ఇప్పటికే ప్రకటించినందున ఈనిధులు సరిపోవు కూడా. అందువల్ల అనుకున్న సమయానికి ప్రాజెక్టు పూర్తి కాదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తం అవుతోంది.

పునరావాసంపై పిల్లిమొగ్గలు

ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి పునరావాసం ప్రధాన సమస్యగా మారింది. నిర్వాసితులకు భూమికి భూమితో పాటు పునరావాసం కల్పించాలంటే దాదాపు రూ. 33 వేల కోట్లు కావాల్సి ఉంది. ఈ నిధులను కేంద్రం ఇవ్వాలని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబే కేంద్రానికి లేఖ రాశారు. ప్రస్తుతం కేటాయించిన రూ. 9 వేల కోట్లతో పునరావాసానికి ఎంత అనేది బడ్జెట్‌లో ప్రస్తావించలేదు. ఇందువల్ల పునరావాసమే ప్రాజెక్టు నిర్మాణానికి ప్రధాన అడ్డంకిగా మారినా ఆశ్చర్యంలేదు. రెండు సంవత్సరాల్లో ఈ ప్రాజెక్టు పూర్తవ్వాలంటే దాదాపు రూ. 20 వేల కోట్లకుపైనే ఖర్చు చేయాల్సి ఉంది. గత బడ్జెట్‌లోనే రాష్ట్ర ప్రభుత్వం పోలవరానికి



రూ.7,250 కోట్లు కేటాయించింది. అందులో రూ. 4 వేల కోట్లు మేర ఖర్చు చేసింది. ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. కేంద్ర నిధుల పైనా, అప్పులుపైనా ఆధారపడాల్సిందే. టిడిపి అధికారం చేపట్టిన తర్వాత 2014-15లో రూ.245 కోట్లు, 2015-16లో 590 కోట్లు 2016-17లో 2081 కోట్లను కేంద్రం విడుదల చేసింది. ఈ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ. 9 వేల కోట్లను రాష్ట్ర ప్రభుత్వం ఇతర వనరుల నుంచి ఎలా సమీకరిస్తుందో అంతుపట్టడం లేదు.

పోలవరానికి బడ్జెట్‌లో నిధుల కేటాయింపు

2016-17	రూ.3659 కోట్లు
2017-18	రూ.7250 కోట్లు
2018-19	రూ.9,994 కోట్లు

అన్నీ తప్పుడు లెక్కలే...

పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఏపీ బడ్జెట్‌లో లెక్కలన్నీ అవాస్తవాలేనని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. గతంలో మాదిరిగానే గొప్పలు చెప్పడం తప్ప, లెక్కలు వాస్తవానికి దూరం ఉన్నాయని పేర్కొంది. గురువారం హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆ పార్టీ ఎమ్మెల్యే, పీఏసీ ఛైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎప్పటిలాగే 2022వ సంవత్సరం కల్లా రాష్ట్రం దేశంలో మొదటి 3వ స్థానంలో ఉంటుందని, 2029లో దేశంలోనే ఉన్నత స్థానంలో ఉంటుందని, 2050కి ప్రపంచంలోనే ఉన్నతంగా ఉంటుందని ప్రభుత్వం చెబుతుందన్నారు. ఇవే అబద్ధాలు మొన్న గవర్నర్ ప్రసంగంలో చెప్పించారని విమర్శించారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉందని చంద్రబాబు చెబుతూనే...బ్రహ్మాండంగా స్థూల ఉత్పత్తి ఉందని పేర్కొనడం ఎవరిని మోసం చేయడానికి అని ప్రశ్నించారు. రాష్ట్రంలో బ్రహ్మాండంగా ఆదాయం ఉంటే ఎందుకు రెవెన్యూ లోటు తీరడం లేదని నిలదీశారు.

ఆరోగ్యానికి 8463.5 కోట్లు

- జిఎస్‌డిపిలో ఒక్క శాతమూలేని కేటాయింపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్య ఆరోగ్య శాఖకు రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో రూ 8463.5 కోట్లు కేటాయించింది. ప్రజారోగ్య పరిరక్షణ బాధ్యత ప్రభుత్వమే చేపట్టాలి. ఈ మేరకు జిఎస్‌డిపిలో 4 శాతం వైద్య ఆరోగ్య శాఖకు నిధులు కేటాయించాలని ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచించింది. కాని రాష్ట్ర బడ్జెట్‌లో కనీసం ఒక్క శాతం కూడా వైద్య ఆరోగ్య రంగానికి కేటాయించలేదు. ఈ ఏడాది జిఎస్‌డిపి రూ 8,70,330 కోట్లు కాగా వైద్య ఆరోగ్య రంగానికి 8463.5 కోట్లు కేటాయించారు. అంటే ఈ కేటాయింపులు జిఎస్‌డిపిలో కేవలం 0.9 శాతం మాత్రమే. గతేడాది కూడా జిఎస్‌డిపి రూ 7,68,546 కోట్లు. 2017-18లో వైద్యఆరోగ్య రంగానికి బడ్జెట్ అంచనాలు రూ 7020.6 కోట్లు కాగా రూ 6541.5 కోట్లకు సవరించారు. అప్పుడూ జిఎస్‌డిపిలో ఒక్క శాతం కూడా కేటాయింపులు లేవు. ఇక ఈ ఏడాది బడ్జెట్‌లో గతేడాది కేటాయించినట్లే ఎన్టీఆర్ వైద్య సేవకు రూ వెయ్యి కోట్లు, ఉద్యోగుల ఆరోగ్య పథకానికి రూ 200 కోట్లు కేటాయించారు. వాటిలో ఈ సారి నిధుల పెంపు జరగలేదు. వైద్య పరికరాల తయారీ కోసం విశాఖలో ప్రతిష్టాత్మకంగా నిర్మించతలపెట్టిన ఏపి మెడ్ టెక్ జోన్ కు ఈ ఏడాది కొత్తగా రూ 270 కోట్లు కేటాయించారు.

వైద్యఆరోగ్య శాఖలో వివిధ కార్యక్రమాలు, రంగాలకు కేటాయింపులు రూ కోట్లలో

కార్యక్రమం / పథకం / విభాగం	2017-18 కేటాయింపులు	2017-18 సవరించిన అంచనా	2018-19 అంచనాలు
ఏపివివిపి	500	450	600
ఆస్పత్రుల అప్‌గ్రేడేషన్ కోసం	60	130	85
బోధనాస్పత్రుల్లో మౌలిక వసతులకు	34.48	-	92.84
ఆయుష్	196.89	173.08	211.92
ఫ్యామిలీ వెల్ఫేర్ కేంద్రాలు	188.06	191.18	231.25
ప్రివెంటివ్ మెడిసిన్	17.88	15.78	17.54



జాతీయ ఆరోగ్య కార్యక్రమం (ఎన్‌హెచ్‌ఎమ్) కు రూ 1956.94 కోట్లు, పిహెచ్‌సిలకు రూ 825.37 కోట్లు కేటాయించారు. ఇక ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ నిర్వహణకు గతేడాది రూ 6.09 కోట్లు కేటాయిస్తే ఈ సారి బడ్జెట్‌లో రూ 5 కోట్లకు తగ్గించారు. అయితే కనీసం రూ 10 కోట్లయినా కేటాయించాలని వర్సిటీ ఉద్యోగుల డిమాండ్. తొలిసారిగా ఈ బడ్జెట్‌లో ప్రధానమంత్రి మాతృవందన యోజన (పిఎమ్ఎమ్‌వివై) పథకానికి రూ 160 కోట్లు కేటాయించారు.

12 నుంచి ఒంటిపూట బడులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని పాఠశాలలకు సోమవారం నుంచి ఒంటిపూట బడులు ప్రారంభం కానున్నాయి. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కె సంధ్యారాణి గురువారం విడుదల చేశారు. ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఈ ఏడాది ముందుగానే ఒంటిపూట బడులను ప్రకటిస్తున్నామని తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు తరగతులు జరుగుతాయి.



BUDGET 2018

బడ్జెట్ 2018





నేల విడిచి సాము

కేంద్ర నిధులపైనే ఆశలు

- బడ్జెట్ కూర్పులో లోపించిన శాస్త్రీయత
- అదాయ సమీకరణపై స్పష్టత కరవు
- అధికారులు సాధ్యం కాదన్నా సర్కారు భారీ బడ్జెట్‌కే మొగ్గు
- జీఎస్టీతో తగ్గనున్న పన్నుల రాబడి
- కొత్త రాష్ట్రంలో తొలిసారి మిగులు బడ్జెట్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్ర బడ్జెట్ నేల విడిచి సాము చేస్తున్నట్లుంది. దీంతో శాస్త్రీయత కరువైంది. ఆదాయానికి, ఖర్చుకు మధ్య వ్యత్యాసం సుస్పష్టంగా కనిపిస్తోంది. అసలు అంత అదాయాన్ని ఎలా సమీకరిస్తారన్నది ప్రశ్నార్థకమేనని పలువురు పెదవి విరుస్తున్నారు. ఒకవైపు భారీ ఆదాయ సముపార్జన సాధ్యం కాదని ఆదాయ వనరుల శాఖల అధికారులు తేల్చి చెప్పినప్పటికీ, ప్రభుత్వం మాత్రం భారీ బడ్జెట్‌కే మొగ్గు చూపించింది. అయితే ఆర్థిక మంత్రి యనమల చెప్పినట్లుగా రూ. 2 లక్షల కోట్ల అంచనా కాకుండా, కొద్దిగా తగ్గించుకుని రూ.1.91 లక్షల కోట్లకు పరిమితమయ్యారు. ఈ బడ్జెట్ కేవలం మిగులు చూపించుకునేందుకేననేది స్పష్టమవుతోంది. ఎప్పుడూ 15 శాతం వరకు పెంపుతో కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టడం ఆనవాయితీ. ఊహాతీతంగా ఈసారి బడ్జెట్‌ను దాదాపుగా 24 శాతం వరకు పెంచి చూపించడం విశేషం. రాష్ట్ర విభజన సమయంలో రూ.1.11 లక్షల కోట్ల బడ్జెట్ ఆమోదించగా, కేవలం నాలుగేళ్లలో ఈ మొత్తం 80 కోట్ల రూపాయలు పెరిగిపోవడం గమనార్హం. ఈ నాలుగు సంవత్సరాల్లో కూడా బడ్జెట్‌లో చూపించిన ఆదాయం రాక, ఖర్చులు పెరిగిపోయి లోటు దిశగానే ఆర్థిక సంవత్సరం ముగిసిపోయింది. అయితే ఈసారి మాత్రం తొలిసారిగా మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. ఆదాయాన్ని రూ.1.55 లక్షల కోట్లుగా చూపించిన ప్రభుత్వం, ఖర్చును రూ. 1.50 లక్షల కోట్లుగా పేర్కొంటూ రూ. 5235 కోట్లు మిగులుగా చూపించడం విశేషం. కేవలం ఎన్నికల బడ్జెట్‌గా భావిస్తున్నందునే జనాకర్షణ కోసం తొలిసారి మిగులు బడ్జెట్ చూపించినట్లు విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చూపించిన రూ. 1.55 లక్షల కోట్ల ఆదాయంలో సగానికిపైగా కేంద్రం నుంచే వస్తాయని ప్రతిపాదించారు. పన్నుల్లో రాష్ట్ర వాటాగా 33,930 కోట్లు, గ్రాంట్లుగా 50,696 కోట్లు వస్తాయని పేర్కొంది. అంటే ఏకంగా రూ. 84,626 కోట్లు కేంద్రం నుంచి వస్తాయని అంచనా వేస్తుండడం విశేషం. 2017-18 బడ్జెట్‌లో కేంద్రం నుంచి రూ. 66,700 కోట్లు వస్తాయని చూపించగా, ఇప్పటివరకు వచ్చిన ఆదాయం బాగా తక్కువగా కనిపిస్తోంది. ఇక కొత్త బడ్జెట్‌లో రూ. 18 వేల కోట్లు ఎక్కువగా చూపించడంతో అంత నిధులు కేంద్రం ఎలా వస్తాయన్నది ప్రశ్నార్థకమేననే విమర్శలు వస్తున్నాయి.

జీఎస్‌డిపి కూడా మాయాజాలమే

రాష్ట్ర బడ్జెట్‌లో స్థూల ఉత్పత్తిని రూ. 8,70,330 కోట్లుగా చూపించారు. అదే గత ఏడాది బడ్జెట్‌లో జీఎస్‌డిని రూ.7,68,546 కోట్లుగా చూపించారు. అంటే ఒక్క ఏడాదిలోనే లక్ష కోట్లకుపైగా జీఎస్‌డిపిని పెంచి చూపించడం ఆశ్చర్యం కలిగిస్తోందన్న వాదన కూడా వినిపిస్తోంది. కేవలం ఈ జీఎస్‌డిపి పెంపు వల్ల మూడు శాతం పరిమితితో రూ. 26 వేల కోట్ల వరకు రుణం తీసుకునే వెసులు బాటు ఉంటుందన్నది ఒక్కటే ఊరట. అది కూడా జీఎస్‌డిపి గణాంకాలను కేంద్రం ఆమోదించినప్పుడేనని అధికారులు చెబుతున్నారు.

విద్యుత్ సబ్సిడీలో కోత

గత రెండేళ్ల కన్నా ఈసారి బడ్జెట్‌లో సబ్సిడీలపై కోతల ద్వారా రైతుకు నష్టం కలిగే పరిస్థితి కనిపిస్తోంది. రుణ మాఫీ, బియ్యం సబ్సిడీలను పెంచినప్పటికీ, విద్యుత్ సబ్సిడీని నిధులు తగ్గించేశారు. విద్యుత్ సబ్సిడీలకు 2016-17లో రూ.3586 కోట్లు కేటాయించగా, 2017-18లో రూ. 3300 కోట్లు మాత్రమే కేటాయించారు. తాజా బడ్జెట్‌లో దీనిని మరింతగా తగ్గించి కేవలం రూ. 2500 కోట్లు మాత్రమే కేటాయించడంతో రైతులకు నష్టం కలుగుతుందన్న భావం వ్యక్తమవుతోంది. అంటే రెండేళ్లలో విద్యుత్ సబ్సిడీని వెయ్యి కోట్లు తగ్గించినట్లు కనిపిస్తోంది. బియ్యం సబ్సిడీకి రూ. 3140 కోట్లు, రుణమాఫీకి రూ.4100 కోట్లు కేటాయించారు. మొత్తం మీద సబ్సిడీలు, ఇతర గ్రాంట్లకు గత బడ్జెట్‌లో రూ. 52,206 కోట్లు కేటాయించగా, ఈసారి ఆ మొత్తం రూ. 68,381 కోట్లకు పెంచారు.


ఎన్నికల కోసం.. సంక్షేమ నామం

ఈ బడ్జెట్ ఎన్నికలకు కీలకం కావడంతో సంక్షేమంపై ఎక్కువ శ్రద్ధ చూపించారు. గత ఏడాది బడ్జెట్‌లో ఏడు సంక్షేమ రంగాలకు రూ. 25,986 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది ఎనిమిది రంగాలకు రూ.30,412 కోట్లు కేటాయించారు. ప్రధానంగా ఎస్సీ కాంపోనెంట్‌కి గత ఏడాది రూ.9847 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.11,228 కోట్లు, బిసిలకు గత ఏడాది రూ.10వేల కోట్లు కేటాయించగా, ఈసారి రూ.12,220 కోట్లు, ఎస్టీలకు గత ఏడాది రూ.3529 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.4177 కోట్లు కేటాయించారు. దీనివల్ల ఆయా వర్గాలను ఆకట్టుకునే అవకాశాలు ఉంటాయన్నది ప్రభుత్వ భావన.


కేంద్రం నుంచి నిధులు ఇలా.. (కోట్లలో)

సంవత్సరం	పన్నుల్లో వాటా	గ్రాంట్లు
2014-15	16,837	28,831
2015-16	22,638	17,722
2016-17	24,637	26,849
2017-18	29,139	37,548
2018-19 అంచనా	33,930	50,696

ఆదాయం ఇలా.. (రూ. కోట్లలో)



ఖర్చు ఇలా.. (రూ.కోట్లలో)



బడ్జెట్‌లో పన్ను పోటు

మద్యం ధరల పెంపునకు బడ్జెట్‌లో సంకేతాలు

గతం కంటే పన్ను రాబడిలో భారీ తేడా

అదనపు ఆదాయమంటున్న సర్కారు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి



తాజా బడ్జెట్‌లో కనిపించకుండానే ప్రజలపై పన్నుపోటు పడే ప్రమాదం కనిపిస్తోంది. ఆదాయం పెంచుకునే మార్గాల్లో భాగంగా వివిధ రంగాలపై ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రధానంగా అప్పులపై దృష్టి పెట్టిన ప్రభుత్వం మద్యం అమ్మకాలు, భూమి రిజిస్ట్రేషన్లు, మార్కెట్ విలువ పెంపు వంటి అంశాలపైనా కసరత్తు చేసి బడ్జెట్‌ను రూపొందించినట్లు కనిపిస్తోంది. ఇక రాష్ట్రానికి రావాల్సిన ఆదాయాన్ని చూపిస్తున్న తరుణంలో సరైన విధానాలు పాటించలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. బడ్జెట్‌లో పేర్కొన్న రూ. 1.55 లక్షల కోట్ల ఆదాయం ఎలా వస్తుందో చెబుతూ విడుదల చేసిన గణాంకాలు కూడా లోపభూయిష్టంగా ఉన్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. కొత్తగా కొన్ని రంగాల పేరిట ఆదాయాన్ని చూపించిన ప్రభుత్వం వాటి వివరాలపై స్పష్టత ఇవ్వలేదు. కేంద్రం నుంచి రావాల్సిన పన్నుల్లో వాటా నిధులను రూ. 33,930 కోట్లుగా చూపించారు. రాష్ట్ర సొంత పన్నుల ఆదాయం గత ఏడాది రూ. 53,717 కోట్లుగా చూపించగా, ఈ ఆదాయాన్ని అందుకోవడమే కష్టంగా మారుతోంది. తాజా బడ్జెట్‌లో ఈ ఆదాయాన్ని ఏకంగా రూ. 65,545 కోట్లుగా చూపించారు. ఈనేపథ్యంలో ఈ లక్ష్యాన్ని సాధించేందుకు ఉన్న అవకాశాలపై అయోమయం నెలకొంది. ఇది భారీ మొత్తమని కొద్ది రోజుల క్రితమే ఆర్థిక, ఆదాయ వనరుల శాఖలు తేల్చి చెప్పగా, అందుకు విరుద్ధంగా సొంత పన్నుల లక్ష్యాన్ని నిర్దేశించడంతో ఆ మొత్తం అసాధ్యమన్న భావం వ్యక్తమవుతోంది. సొంత పన్నుల విభాగంలో ఈసారి మద్యం ఆదాయాన్ని గణనీయంగా పెంచి చూపించారు. గత ఏడాది రూ. 5886 కోట్లు చూపించగా, ఈసారి ఏకంగా రూ. 7357 కోట్లుగా చూపించారు. అంటే మద్యంపై అదనంగా రూ. 1500 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేశారు. దీనివల్ల త్వరలోనే మద్యం ధరలను పెంచే పరిస్థితి ఉంటుందన్నది స్పష్టమవుతోంది. ఇదే సమయంలో ఆస్తులపై పన్ను విభాగంపైనా దృష్టి సారించారు. దీని లక్ష్యం గత ఏడాది రూ. 4620 కోట్లుండగా, తాజా బడ్జెట్‌లో రూ. 5500 కోట్లుగా చూపించారు. అంటే అదనంగా రూ. 880 కోట్లు ఆదాయం చూపించారు. ఇందులో స్టాంపులు రిజిస్ట్రేషన్ల ద్వారానే ఈ అదనపు ఆదాయం వస్తున్నట్లు చూపించారు. దీనివల్ల త్వరలోనే రిజిస్ట్రేషన్ల ఛార్జీలూ భారీగా పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. నేరుగా ఈ ఛార్జీలు పెంచడం సాధ్యం కాని నేపథ్యంలో మార్కెట్ ధరలు పెంచుకునే అవకాశాలున్నాయని తెలుస్తోంది. ఇది మధ్య తరగతిపై భారంగానే విశ్లేషిస్తున్నారు. సరుకులపై పన్నులు అంటూ ఒక విభాగాన్ని ప్రస్తావిస్తూ గత ఏడాది రూ. 3988 కోట్లుగా ఉన్న ఆదాయాన్ని ఈ ఏడాది రూ.5346 కోట్లకు పెంచుకునేందుకు ప్రతిపాదించారు. ఇందులో వాణిజ్య అమ్మకాలపై పన్నులను గత ఏడాది రూ.38319 కోట్లుగా చూపించగా, ఈసారి రూ.47940 కోట్లకు పెంచారు. దీనివల్ల కూడా కొంతవరకు స్థానిక పన్నుల పెంపు ఉంటుందన్న సంకేతాలు వస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ఇతర పన్నుల పేరిట మరో రూ.300 కోట్లు చూపించారు. ఇతర పన్నులంటే ఏమిటన్నది వివరించలేదు. పన్నేతర విభాగంలో గత ఏడాది రూ. 3988 కోట్ల ఆదాయాన్ని చూపించగా, ఈ ఏడాది రూ.5346 కోట్లుగా చూపించారు. ఇందులో కొంత సేవా పన్నుల ఆలోచన కూడా ఉండవచ్చునన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పన్నుల ఆదాయం ఇవే (రూ. కోట్లలో)

విభాగం	గత ఏడాది	తాజా బడ్జెట్‌లో
సేల్స్‌టాక్స్	39,321	38,448
ఎక్సయిజ్	5,886	7,357
రవాణా	2,950	3,687
రిజిస్ట్రేషన్లు	4,000	4,880
మొత్తం ఓన్‌టాక్స్	53,717	65,635
పన్నేతర ఆదాయం	5,092	5,346



తలకు 55,430

- ఒక్కొక్కరిపై రుణ భారం
- మొత్తం అప్పు 2.49 లక్షల కోట్లకు చేరిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర అప్పు రూ. 2.49 లక్షల కోట్లకు చేరి పోయింది. గత ఏడాది కన్నా ఏకంగా రూ. 33 వేల కోట్లు ఎక్కువ అప్పు చేయడం గమనార్హం. దీని ప్రభావంతో రాష్ట్ర ప్రజలు ఒక్కొక్కరిపై ఏకంగా రూ. 55,430 రుణ భారం పడుతోంది. గత ఏడాది ఒక్కొక్కరిపై రూ. 48వేలు భారంగా ఉండగా అది ఈసారి మరో రూ.7 వేల కోట్లు పెరిగింది. తాజా బడ్జెట్ ప్రతిపాదనల్లో రాష్ట్రం అప్పులు రూ. 2,49,435 కోట్లుగా లెక్క తేల్చారు. ఇది మొత్తం జీఎస్‌డిపిలో 28.66 శాతంగా ఉంది. గత బడ్జెట్‌లో రూ. 2,16,026 కోట్ల అప్పులుండగా ఈ ఏడాది అవి రూ. 2.49 లక్ష కోట్లకు చేరుకోవడం విశేషం. తాజా అప్పుల్లో మార్కెట్ బారోయింగ్‌ల ద్వారా రూ.1.57 లక్షల కోట్లు, కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రుణాలు రూ. 9,218 కోట్లు, ఇతర సంస్థల నుంచి తీసుకువి రూ. 15,028 కోట్లు, చిన్న మొత్తాల పొదుపు నుంచి రూ. 12,367 కోట్లు, పిఎఫ్ ఖాతాల నుంచి రూ. 15,272 కోట్లు, డిపాజిట్లు, ఇతర నిధుల నుంచి తీసుకున్నది రూ. 39,770 కోట్లుగా ఉన్నాయి. గత ఏడాది బడ్జెట్‌లో మొత్తం అప్పును 2.16 లక్షల కోట్లుగా చూపించగా, సవరణ అంచనాల్లో అది రూ. 2.25 లక్షల కోట్లకు పెరిగిపోయినట్లు ప్రభుత్వం తాజా గణాంకాల్లో వివరించింది.



కార్పొరేటీకరణ ముమ్మరం

- పిపిపి ప్రాజెక్టులు
- విదేశీ సంస్థల రుణాలు
- సర్కారీ కేటాయింపులకు కోతలు
- రూ.19 వేల కోట్లతో వ్యవసాయ బడ్జెట్

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-అమరావతి

రాష్ట్ర అసెంబ్లీలో గురువారం ప్రతిపాదించిన వ్యవసాయ బడ్జెట్ సాగును మరింతగా కార్పొరేట్ బాట పట్టించింది. రోగమొకటైతే మందు వేరొకటి వేసినట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల రైతు వ్యతిరేక విధానాల వలన సేద్యం సంక్షోభంలో చిక్కుకోగా, ఆ విధానాలనే ఇంకా వేగంగా ఏపీలో అమలు చేస్తామని చంద్రబాబు సర్కారు స్పష్టం చేసింది. వ్యవసాయరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు, జోక్యం తగ్గించి ప్రతి దానికీ రైతులు కార్పొరేట్ కంపెనీలపై ఆధారపడేటట్లు, వాటి చేతుల్లో బందీ అయ్యేందుకు పలు కార్యక్రమాలను అమలుపరుస్తామని పేర్కొంది. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పిపిపి)ను మరింతగా ప్రవేశపెడతామంది. అందుకోసం విదేశీ, స్వదేశీ కంపెనీలతో కుదుర్చుకున్న, భవిష్యత్తులో కుదుర్చుకోబోయే పలు పరస్పర అవగాహనా ఒప్పందాల (ఎంవోయు)ను వ్యవసాయ బడ్జెట్‌లో ప్రస్తావించింది. ఎప్పటిలాగానే సాధారణ బడ్జెట్‌లో వ్యవసాయ, అనుబంధ, ఇతర రంగాలకు ప్రతిపాదించిన పద్దులన్నింటినీ గుదిగుచ్చి ఒకచోటకు చేర్చి దాన్నే ప్రత్యేక వ్యవసాయ బడ్జెట్‌గా పేర్కొంది. ఉభయసభల్లో 2018-19 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, శాసనసభలో సంబంధిత శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, మండలిలో పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు బడ్జెట్ ప్రసంగ పాఠాన్ని చదివారు. కంపెనీల కబంధ హస్తాల్లోకి వ్యవసాయరంగం రెండంకెల వృద్ధి సాధించడానికి పలు సంస్థలతో ఎంవోయులు కుదుర్చుకున్నట్లు బడ్జెట్‌లో పేర్కొన్నారు. భూసార పరీక్షల కోసం బిల్ అండ్ మిలిందా గేట్స్ ఫౌండేషన్‌తో, మెగాసీడ్‌పార్క్ స్థాపనకు అమెరికాకు చెందిన అయోవా యూనివర్శిటీతో, రైతులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు ఐదు సాఫ్ట్‌వేర్ సంస్థలతో, ప్రకృతి వ్యవసాయం అభివృద్ధికి అజీమ్ ప్రేమ్‌జీ ఫిలాంత్రఫిక్ ఇనిషియేటివ్‌తో, అలాగే అంతర్జాతీయ సంస్థలైన యుఎన్‌ఇపి, ఎఫ్‌ఎవో, సిజిఐఎఆర్, సి-ఆగ్‌లతో ఒప్పందాలు కుదిరాయని తెలిపారు. కరువు నివారణకు ఐఎఫ్‌ఎడి ప్రాజెక్టు, ప్రపంచబ్యాంక్ నిధులతో ఎపి ఇంటిగ్రేటెడ్ ఇరిగేషన్ అండ్ అగ్రికల్చర్ ట్రాన్స్‌ఫార్మేషన్ ప్రాజెక్టు, వ్యవసాయ, అనుబంధ శాఖల అభివృద్ధికి జపాన్ ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ సొసైటీ (జైకా) సహకారం తీసుకుంటున్నామన్నారు. వ్యవసాయంలో పెట్టుబడుల కోసం అగ్రి బిజినెస్ ఎంటర్‌ప్రెన్యూర్ సమ్మిట్‌ను నిర్వహించామని వివరించారు. సూక్ష్మ సేద్యం కోసం ప్లాస్టిక్ కంపెనీలతో ఎంవోయులు కుదుర్చుకున్నామన్నారు. ఆంగ్రూ రిసెర్చ్ మేనేజ్‌మెంట్ సిష్టం ఏర్పాటుకు ఒప్పందాలు జరిగాయి. వ్యవసాయోత్పత్తుల విదేశీ, స్వదేశీ మార్కెటింగ్ కోసం ఎపిఇడిఎ, ఇతర కార్పొరేట్ సంస్థలతో ఎంవోయులు చేసుకున్నారు. ఉద్యమ తరహాలో రైతు ఉత్పత్తి దారుల సంఘాల (ఎఫ్‌పివో)ను నెలకొల్పి కార్పొరేట్లతో ఒప్పందాలు చేసుకుంటామన్నారు.



వ్యవసాయ శాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డికి అభినందనలు తెలుపుతున్న మహిళా ఎమ్మెల్యేలు

తగ్గిన కేటాయింపులు

వచ్చే ఏడాది వ్యవసాయ బడ్జెట్‌కు రెవెన్యూ వ్యయం, కేపిటల్ వ్యయం రెండూ కలిపుకొని రూ.19,070.36 కోట్లు ప్రతిపాదించారు. ప్రస్తుత సంవత్సరం ప్రతిపాదించింది రూ.18,214 కోట్లు. పైపైన చూస్తే రూ.856.36 కోట్లు పెరిగినట్లు కనిపిస్తున్నా వాస్తవానికి తగ్గింది. జరుగుతున్న సంవత్సరానికి ప్రతిపాదించిన మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో వ్యవసాయ బడ్జెట్ వాటా 11.60 శాతం కాగా వచ్చే ఏడాదికి ప్రతిపాదించింది 9.98 శాతం. సుమారు 1.62 శాతం తగ్గింది. గతం కంటే రూ.3,095 కోట్లు తగ్గాయి.

సగానికిపైన ఇతర పద్దులు

షరామామూలే అన్నట్లు వ్యవసాయ బడ్జెట్‌లో సగానికిపైన ఇతర పద్దులు ఆక్రమించాయి. కేంద్రానికి చెందిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులను వ్యవసాయ బడ్జెట్‌లో చూపించారు. వ్యవసాయానికిచ్చే ఉచిత విద్యుత్, నాల్గవ విడత రుణ ఉపశమన పథకం ఈ ఖర్చులను ఇక్కడే తీసుకొచ్చి చూపెట్టారు. ఇవన్నీ కలిపి వ్యవసాయ బడ్జెట్‌లో 55 శాతానికి పైనే. వాటిలోనూ కొన్నింటికి గతం మీద భారీగా కోతలు పెట్టారు. ఉపాధి హామీకి గత బడ్జెట్‌లో రూ.6,040 కోట్లు కేటాయించగా ఈసారి రూ.4,730 కోట్లకు తగ్గించారు. ఉచిత విద్యుత్ పరిస్థితి విచిత్రంగా ఉంది. గత బడ్జెట్‌లో రూ.3,300 కోట్లు ప్రతిపాదించగా ఈ తడవ రూ.2,500 కోట్లకు తగ్గించారు. ఇదే సమయంలో పంపుసెట్ల సంఖ్య 16.39 లక్షల నుంచి 16.97 లక్షలకు పెరిగాయన్నారు. నెడ్‌క్యాప్ పథకంలో వచ్చే ఏడాది రూ.1,800 కోట్ల రాయితీ ఇచ్చి లక్ష పంపుసెట్లను సోలార్ కిందకు మార్పు చేస్తామన్నారు. నాల్గవ విడత రుణ ఉపశమనానికి రూ.3,600 కోట్ల నుంచి రూ.4,100 కోట్లకు ప్రతిపాదనలు పెంచారు. రైతులకు వడ్డీలేని రుణాలు, పావలావడ్డీలకు ఏ మాత్రం నిధులు పెరగలేదు. వరుసగా రూ.172 కోట్లు, రూ.5.44 కోట్లు చూపించారు. పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తే కేటాయించిన నిధులు ఏమూలకూ చాలవు. మార్కెట్ జోక్యం పథకానికి రూ.500 కోట్లు కేటాయించారు.

ఉపశమనం కలిగించని బడ్జెట్

- ఏపి రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"రాష్ట్ర బడ్జెట్‌లో ప్రాధమిక రంగమైన వ్యవసాయ రంగానికి పెరిగిన బడ్జెట్‌తో పోల్చుకున్నప్పుడు పెద్దగా వరిగిందేమి లేదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై. కేశవరావు, ప్రధాన కార్యదర్శి పి.పెద్దిరెడ్డి పేర్కొన్నారు. జలవనరులశాఖకు నిధులు పెంచినట్లు చూపించినా పోలవరం ప్రాజెక్టుకు నాబార్డ్ నుండి తెచ్చుకునే అప్పుపోగా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాజెక్టులకు కేటాయింపులు నామమాత్రంగానే ఉన్నాయన్నారు. ఆహార ధాన్యాల ఉత్పత్తి పెరిగిందని చెప్పడం సరైందికాదని తెలిపారు 2014-15సీజన్‌లో 160.03లక్షల టన్నుల ఉత్పత్తి కాగా గడిచిన మూడు సంవత్సరాల్లో ఎప్పుడూ ఆస్థితికి చేరలేదన్నారు. ఈ ఏడాది సాగు విస్తీర్ణం 20 శాతం తగ్గిందని, ఉత్పత్తి ఖర్చు పెరుగుతోందన్నారు. కేవలం మత్స్య రంగంలో వచ్చిన పెరుగుదల రాబడిని చూసి మొత్తం రైతాంగానికి ముడిపెట్టడం సరికాదని పేర్కొన్నారు."



ధరల స్థిరీకరణకు రూ.5 వేల కోట్లు కేటాయించాలి

- ఎపి కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

"బడ్జెట్‌లో నిధులు పెంచకుండా 2020 నాటికి రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని ప్రభుత్వం చెప్పడం వట్టి బూటకమని ఏపి కౌలు రైతుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నాగబోయిన రంగారావు, పి.జమలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతులు పండిం చిన పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించేం దుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకపో వడం అన్యాయమన్నారు. వడ్డీలేని రుణాలకు గత ఏడాది కంటే ఒక్క రూపాయి కూడా అదనంగా నిధులు కేటాయించకపో వడం దారుణమన్నారు. గత ఏడాది పంట రుణాల కింద రూ.63 వేల కోట్లు ఇస్తే అందులో కౌలు రైతులకు ఇచ్చింది కేవలం రూ.2,346 కోట్లు మాత్రమేనన్నారు. 80 శాతం పంటలు పండించిన కౌలు రైతులకు రుణమాఫీలో కూడా అన్యాయం జరిగిందని తెలిపారు."

కొత్త కేటాయింపులు (రూ. కోట్లలో)

రాష్ట్ర ప్రభుత్వం తాజా బడ్జెట్‌లో పలు పథకాలకు కొత్తగా నిధులు కేటాయించింది. వీటిలో కొన్ని గతంలోనే ప్రకటించినవి కాగా మరికొన్ని కొత్తగా బడ్జెట్‌లోకి చేర్చారు.

గ్రామీణాభివృద్ధి
శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో ఎన్టీఆర్ జలసిరి 100

హిజ్రాల కోసం
సంక్షేమం 20

ఇళ్ల స్థలాలు
భూ సేకరణ 575

వ్యవసాయం
మెగాసీడ్ పార్క్ 100

పరిశ్రమలు
మౌళిక వసతులు 200

బిసిల కోసం
చంద్రన్న పెళ్లి కానుక 100
ఆదరణ 750

వైద్య, ఆరోగ్యం
ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ 1000
మెడ్‌టెక్ జోన్ 270
పిఎంఎంవివై 160



ఐటి
ఈ ప్రగతి 200
స్టార్టప్‌లు 100
ఎపిఇఐటిఎ 60

పురపాలన
అన్న క్యాంటీన్లు 200
టౌన్‌షిప్, మౌలిక వసతులు 1000

మహిళలు
ప్రత్యేక ఆహార పథకం 360
డ్వాక్రా మహిళలకు సానిటరీ నాప్‌కిన్లు 100

సెకండరీ విద్య
మోడల్ స్కూల్ 377
విద్యార్థులకు గుడ్లు 266
విద్యార్థినీలకు నాప్‌కిన్లు 27

ఇంటర్ మీడియట్ విద్య
మధ్యాహ్న భోజనం 23
ఇంగ్లీష్ లాబరేటరీలు 15

సాంకేతిక విద్య
పాలిటెక్నిక్ కళాశాలల్లో..
విర్చ్యువల్ లాబ్స్ 16
లాబరేటరీల ఆధునీకరణ 50
భవనాల నిర్మాణం 50

సాంఘీక సంక్షేమం
చంద్రన్న పెళ్లి కానుక 100
భూమి కొనుగోలు 100

గిరిజన సంక్షేమం
ఐటిడిఎలకు మౌళిక వసతులు 50
బ్రాండ్‌బ్యాండ్ కనెక్టివిటి 90
భూమి కొనుగోలు 20
విద్య మౌలిక వసతులు 103



సంపాదకీయం

అంకెల ఆట

ఆంధ్రప్రదేశ్ విత్త మంత్రి యనమల రామకృష్ణుడు 2018-19 ఆర్థిక సంవత్సరానికి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఆద్యంతం నంబర్ గేమ్‌ను తలపింపచేసింది. ప్రజలకు చిటారుకొమ్మన మిఠాయి పొట్లం చూపెట్టింది. ప్రభుత్వం అత్యాశకు పోయి జనాలను ఊహల పల్లకిలోకి ఎక్కించేందుకు దొరికిన అన్ని అడ్డదార్లూ తొక్కింది. విభజనానంతర ఏపీలో టిడిపి సర్కారుకు ఇది ఆఖరి పూర్తి స్థాయి బడ్జెట్. గతంలో మాదిరిగానే ఇప్పుడూ ప్రభుత్వం జిమ్మిక్కులకే అధిక ప్రాధాన్యతనిచ్చిందని బడ్జెట్‌ను ఆమూలాగ్రం పరిశీలించినవారికెవరికైనా ఇట్టే అర్థమైపోతుంది. ఎన్నికల సంవత్సరం అయినందున వ్యవసాయం, సాగునీరు, గ్రామీణాభివృద్ధి, సంక్షేమం తదితర రంగాలకు కేటాయింపులు పెంచినట్లు పైకి కనిపిస్తున్నా అవసరమైన నిధుల సమీకరణపై అస్పష్టత అలాగే కొనసాగింది. వచ్చే ఏడాదికి యనమల రూ.1.91 లక్షల కోట్ల భారీ సైజుతో బడ్జెట్‌ను ప్రతిపాదించారు. రెవెన్యూ వ్యయం రూ.1.50 లక్షల కోట్లు, మూలధన వ్యయం రూ.28 వేల కోట్లకు పైనేనని పేర్కొన్నారు. మొత్తమ్మీద ప్రస్తుత ఏడాది కంటే 21 శాతం అంచనాలు పెరిగాయని ఘనంగా చెప్పారు. ఖజానా నిండుకుందంటూనే ఈ జంబో బడ్జెట్‌ను ఎలా పెట్టారు? ఇక్కడే ఆర్థిక మంత్రి అంకెల్లో డొల్లతనం తెలుస్తుంది. కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏకంగా రూ.50 వేల కోట్ల గ్రాంట్లను, సహాయాన్ని ఆశించారు. కేంద్ర పన్నుల్లో వాటాను రూ.34 వేల కోట్లుగా అంచనా వేశారు. ప్రత్యేక హోదాపై జగడంలో కేంద్రం మన రాష్ట్రంపై కత్తిగట్టినట్లుగా వ్యవహరిస్తున్న నేపథ్యంలో అక్కడి నుంచి ఇన్నేసి వేల కోట్లు అందుతాయని ఆశించడంలో ఔచిత్యమేమిటి? అంచనాలకనుగుణంగా నిధులు అందకపోతే బడ్జెట్‌లో పేర్కొన్న అనేకనేక లక్ష్యాలను ఏ విధంగా చేరుకోగలుగుతారో యనమల చెప్పగలుగుతారా?

విభజనలో హైదరాబాద్‌ను కోల్పోయాక పెద్ద మొత్తంలో ఆదాయవనరులను ఏపీ కోల్పోయినమాట నిజం. రెవెన్యూలోటు ఉందంటూనే బడ్జెట్‌లో రూ.5 వేల కోట్లకుపైన ఆదాయ మిగులును అంచనా వేశారు. ద్రవ్యలోటు రూ.24 వేల కోట్లని, జిఎస్‌డిపిలో 2.78 శాతమని అన్నారు. రాష్ట్రం అధోగతిలో ఉందంటూనే జిఎస్‌డిపిని రూ.7.68 లక్షల కోట్ల నుంచి ఎకాఎకిన రూ.8.70 లక్షల కోట్లకు పెంచి ఎఫ్‌ఆర్‌బిఎం నిబంధనలకు లోబడి ద్రవ్యలోటు ఉందంటున్నారు. రాష్ట్రానికి కొత్త పెట్టుబడులు రాకుండా, వ్యవసాయరంగం అభివృద్ధి చెందకుండా ప్రజల ఆదాయాలు ఎలా పెరుగుతాయో ప్రభుత్వానికే తెలియాలి. సర్కారు అప్పులు కొండలను మించిపోతున్నాయి. ప్రతి ఏడాదీ సగటున రూ.20-30 వేల కోట్లు పెరుగుతున్నాయి. వచ్చే ఏడాది ప్రభుత్వ అప్పులు రూ.2.49 లక్షల కోట్లకు చేరతాయని అంచనా వేశారు. నిరుడు బడ్జెట్‌లో ఒక్కో వ్యక్తిపై రూ.48 వేల అప్పు తేలగా ఇప్పుడది రూ.54 వేలకు ఎగబాకింది. ఈ అప్పులన్నీ పప్పుబెల్లాలకు, ప్రచార పటాటోపానికి ఖర్చు పెడుతున్నారు మినహా శాశ్వత ఆస్తుల సృష్టికి కాదు. రాష్ట్ర స్వంత పన్నురాబడి ఎక్కడా తగ్గలేదు సరికాదా పెరుగుతోంది. రూ.53 వేల కోట్ల నుంచి రూ.65 వేల కోట్లకు అంచనాలు పెంచారు. సేల్స్, ఎక్సయిజ్, ఎంవి ట్యాక్స్‌లు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ నుంచి అదనపు ఆదాయం రాబడతామన్నారు. దానర్థం ప్రజలపై అదనపు పన్నులేసి గోళ్లూడగొడతారన్నమాట.

ఇంతా చేసినా ప్రాధమికరంగాలకు, సంక్షేమానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచారా అంటే అదీ లేదు. వ్యవసాయ బడ్జెట్ గతం కంటే 1.62 శాతం తగ్గింది. దాని విలువ రూ.3 వేల కోట్లకుపైనే. చివరి బడ్జెట్‌లో రుణమాఫీకి అరకొర నిధులు కేటాయించారు. నాల్గవ కిస్తీకి ఇప్పుడిస్తే ఐదో కిస్తీ వచ్చే సర్కారు చెల్లించాలా? రైతులకు వడ్డీలేని రుణాలు, పావలావడ్డీకి కేటాయింపులు వెక్కిరిస్తున్నాయి. వ్యవసాయ వృద్ధి రెండంకెలంటూ కార్పొరేట్‌కు ఊతం ఇస్తోంది సర్కారు. వ్యవసాయ కూలీలకు పనులు చూపే ఉపాధిహామీ నిధులు రూ.6,040 కోట్ల నుంచి 4,730 కోట్లకు తగ్గాయి. కరువు మండలాలు ప్రకటించి నిధులెలా తగ్గిస్తారు? సవరించిన బడ్జెట్ అంచనాల ప్రకారం సంక్షేమానికి రూ.651 కోట్ల మేర కత్తెర పెట్టారు. వచ్చే ఏడాదినాటికి పది లక్షల ఇళ్లు కడతామని రోజూ ఢంకా భజాయిస్తున్న ప్రభుత్వం బడ్జెట్‌లో అత్తెసరు నిధులు ప్రతిపాదించింది. గ్రామీణాభివృద్ధికి రూ.700 కోట్ల వరకు తగ్గించింది. డ్వాక్రా మహిళల రుణాల మాఫీ, వడ్డీ రాయితీకి చేసిన కేటాయింపులు అరచేతిలో బెల్లం పెట్టి మోచేతితో నాకించేలా ఉన్నాయి. ఇరిగేషన్‌కు 9.7 శాతం నుంచి 8.89 శాతానికి తగ్గించారు. పోలవరం ప్రాజెక్టుకి 9వేల కోట్లు కేటాయించినట్లు ఘనంగా చెప్పుకున్న ప్రభుత్వం ఆ ప్రాజెక్టు నిర్వాసితుల పునరావాసం గురించి విస్మరించడం దారుణం. విద్య, వైద్యం, ఆరోగ్యం సమస్త రంగాలదీ దాదాపు ఇదే పరిస్థితి. మొత్తంగా యనమల వారి బడ్జెట్ ప్రపంచబ్యాంక్ ఆదేశిత సంస్కరణలను మరింత వేగవంతం చేసే దిశలో పయనిస్తోంది.

ఇది విషయం



బాబు నోట మాటలెన్నో
పీఠమెక్కిన నాటి నుంచి...
సత్తా ఏమైంది మరి
స్టేటును నట్టేట ముంచి!

నిన్నటిదాకా మిత్రులు
తెల్లారాయిక పొత్తులు...
మింగలేక కక్కలేక
కమలంతో తెగదెంపులు!

\- కొల్లూరు వెంకట్

పాలనా శాస్త్రానికి గ్రహణం


కామన్ సెన్స్

నేటి మన పాలకులను చూస్తే.. మీ గ్రంథాల్లో, మంత్రాల్లో అన్నీ ఉన్నాయనే నమ్మకంతోనే బతకమని భారతీయులను ఆంగ్లేయులు వదిలి వెళ్లారనేది నిజమనిపిస్తుంది. కనీసం రాసుకున్న రాజ్యాంగానికి కట్టుబడాలనే ప్రాథమిక పాలనా సూత్రాన్ని పాటించని వారు అధికారంలోకి వస్తారని ఈ దేశ విముక్తి కోసం పోరాడిన మన పూర్వులు ఊహించి ఉండరు. నియంతల పాలనా వ్యవస్థ కంటే హీనంగా 'ప్రజాస్వామ్యం' దిగజారుతుందని భావించి వుండరు. కార్యాకారణ సంబంధాలను దేశ కాల పరిస్థితులను విశ్లేషించలేని అమాయకులు, అజ్ఞానులు, మూర్ఖులు, విధాన నిర్ణయకర్తల రూపంలో ప్రజల నెత్తిమీదకెక్కి వికటాట్టహాసం చేస్తారని అనుకొనుండరు. భారత రాజ్యాంగ రూపకర్తలు ఏ దేశ రాజ్యాంగంలో లేని విధంగా 'శాస్త్రీయ దృక్పథం' ఒక ముఖ్య అంశంగా పొందు పరచటాన్ని అనేక మంది విజ్ఞులు పదే పదే గుర్తు చేస్తున్నప్పటికీ, మంత్రులుగా చలామణి అవుతున్న వారే వికృతమైన, అశాస్త్రీయమైన ప్రకటనలతో ప్రవర్తనతో సంచలనాలను సృష్టిస్తున్నారు. శ్రీదేవి మరణం, నారా వారి నలభై ఏళ్ల పాలనా ప్రహసనం ముందు మీడియా సైన్స్‌డేని మర్చి పోయింది మరి. ఈ సందర్భంగా భారత విద్యారంగ సలహా బోర్డుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కేంద్ర మానవ వనరుల శాఖ సహాయ మంత్రి న్యూటన్ చలన సూత్రాల మీద చేసిన వ్యాఖ్యానాలు మరో దుమారాన్ని లేపాయి. గతంలో ఈయనే తానొక గొప్ప శాస్త్ర మెరిగిన పండితుడిననీ, తానిప్పటివరకూ కోతి మానవుడిగా మారటాన్ని చూడలేదు కాబట్టి డార్విన్ జీవ పరిణామవాద సిద్ధాంతం తప్పనీ ఉటంకించారు. వారి ధోరణి పలు విమర్శలకు దారి తీసినా, ఆ మంత్రిగారు మొండిగా నిలబడ్డారు. వారి బదులు, వారి అనుయాయులు ఏదో సర్ది చెప్పారు. ఇటువంటి వారు మంత్రులుగా చలామణి అవ్వడం మన సమాజ పతన దశకు నిదర్శనమనే స్థాయిలో కొందరు విజ్ఞులు బహిరంగంగానే విమర్శించారు.



ప్రొ॥ ఎన్ వేణుగోపాలరావు

అయితే, సత్యపాల్ మాత్రమే ఈ ధోరణిలో ఉన్నారా అంటే వారిని మించిన అభినవ 'శాస్త్రజ్ఞులు', సమాజ విశ్లేషకులు' ప్రస్తుత మంత్రి వర్గ ముఖ్యులుగా చలామణి అవుతున్నారు. ఆ మాటకొస్తే సాక్షాత్తూ ప్రధాన మంత్రే సైన్స్ కాంగ్రెసుల్లో తన అజ్ఞానాన్ని ఎంతో ఆవేశంగా బయట పెట్టుకొన్నారు. మన గొప్ప శాస్త్రవేత్తలకు తనే వారసుడైనట్టు మాట్లాడారు. అనేక మంది విమర్శించిన తరువాత కూడా వారు ప్రతిస్పందించకపోగా నేనింతేననే ధోరణి ప్రదర్శించారు. దాన్నే మొన్న ప్రఖ్యాత శాస్త్రవేత్త జయంత్ నార్లేకర్, నిన్న రాహుల్ సిద్ధార్థన్, ది హిందూ ద్వారా ఉటంకించారు. ఈ ధోరణి, సైన్స్ కాంగ్రెస్‌లే అవసరం లేదేమో అనేదానికి దారి తీస్తున్నట్లున్నది.



తానొక ఆధునిక సాంకేతికాల ఆహ్వానకర్తగా, పాలనాదక్షుడిగా, అభినవ ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా భుజకీర్తులు తగిలించుకొన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి సందర్భంలోనూ అశాస్త్రీయ, హేతుబద్ధత లేని ప్రకటనలతో పదే పదే యువతను గందరగోళ పరచటాన్ని చూస్తున్నాం. మురుగు నీళ్లలో మునిగితే పుణ్యమొస్తుందని ఒకసారి, కుటుంబ నియంత్రణ తప్పని మరోసారి, దేశీయ ఆవు చుట్టూ నడిచే వ్యవసాయం సర్వ సమస్యలకు పరిష్కారమని మరోసారి చెప్పటాన్ని చూస్తున్నాం.

తానొక ఆధునిక సాంకేతికాల ఆహ్వానకర్తగా, పాలనాదక్షుడిగా, అభినవ ఆర్థిక సంస్కరణల రూపశిల్పిగా భుజకీర్తులు తగిలించుకొన్న మన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రతి సందర్భంలోనూ అశాస్త్రీయ, హేతుబద్ధత లేని ప్రకటనలతో పదే పదే యువతను గందరగోళ పరచటాన్ని చూస్తున్నాం. మురుగు నీళ్లలో మునిగితే పుణ్యమొస్తుందని ఒకసారి, హారతులతో సూర్య నమస్కారాలతో సర్వ సమస్యలు పరిష్కారమౌతాయని మరోసారి, కుటుంబ నియంత్రణ తప్పని మరోసారి, చీరా సారె, పసుపు కుంకుమలను నదుల్లో వదిలితే మంచి జరుగుతుందని మరోసారి, దేశీయ ఆవు చుట్టూ నడిచే వ్యవసాయం సర్వ సమస్యలకు పరిష్కారమని మరోసారి చెప్పటాన్ని చూస్తున్నాం. ఇక ఆయన మంత్రి వర్గ సహచరులు సరేసరి. సచివాలయాన్ని, విశ్వవిద్యాలయాలను, పరిశోధనా స్థానాలను మంత్ర, తంత్ర నిలయాలుగా మారుస్తున్నారు. నోటికొచ్చినట్లు అశాస్త్రీయ ప్రకటనలతో తమ ప్రత్యేకతను ప్రదర్శిస్తున్నారు. 'నలుగురూ నవ్వి పోదురు గాక నాకేటి సిగ్గు' అనే ధోరణితో మంత్రులు, అధికారులు, గవర్నర్లు చేసే ప్రకటనలు జుగుప్స కలిగిస్తున్నాయి. వీళ్లందరూ రాజ్యాంగం మీద ప్రమాణం చేసినవారు.

ఎందుకిలా జరుగుతోంది?

సమసమాజం, సెక్యులరిజం, శాస్త్రీయ దృక్పథం వంటి ఉన్నతమైన ఆశయాలతో రాసుకున్న రాజ్యాంగం చిత్తు కాగితాల ప్రతిగా ఎందుకు మారిపోయింది? పైగా ఈ ధోరణి సరికాదని బహిరంగంగా విశ్లేషించే ఆలోచనాపరులను, హేతువాదులను, ఉద్యమకారులను అంతం చేసే దశకు సమాజాన్ని చేర్చిందెవరు? శాస్త్రవేత్తలు, మేధావులు కూడా మౌన ప్రేక్షక పాత్రలో ఇమిడి పోయారెందుకు?

భారత సైన్స్ కాంగ్రెస్ పితామహుడు ఎ హోవర్డ్, రాజ్యాంగ రూపకర్త అంబేద్కర్, జవహర్‌లాల్ నెహ్రూలు శాస్త్రజ్ఞానం కేంద్రంగాగల సమాజాన్ని ఊహించారు. జెబిఎస్ హాల్డేన్, జెడి బెర్నాల్ వంటి ప్రపంచ స్థాయి ప్రజా శాస్త్రవేత్తలు భారత దేశ భవిష్యత్తు సైన్స్‌తో ముడిపడి వుందని విశ్లేషించారు. ఈశ్వర చంద్ర విద్యాసాగర్, రాజారామ్మోహనరాయ్, వివేకానందుడు, వేమన, వీరబ్రహ్మం వంటి సంఘ సంస్కర్తలు, కందుకూరి వీరేశలింగం, గురజాడ వంటి సాహితీవేత్తలు హేతుబద్ధత, ప్రజాస్వామ్యం వంటివి శాస్త్రజ్ఞానం ద్వారానే సాధ్యమని నమ్మి తమ జీవితాలను త్యాగం చేశారు. శాస్త్రజ్ఞానం (సైన్స్) రూపొందిన క్రమంలో భారత ఉపఖండం పోషించిన అద్వితీయ పాత్రను భారత శాస్త్రవేత్తల విశిష్టతను, వారి ఆవిష్కరణల ప్రత్యేకతలను అనేక మంది గుర్తు చేశారు. అటువంటి దేశంలో శాస్త్రజ్ఞానం తిరోగమన దిశలోకి వెళ్లడం వెనుక మతమౌఢ్యం పెచ్చరిల్లడమే! మూఢాచారాలు, మూఢనమ్మకాలు మతంతో ముడిపడే వుంటాయి. దొంతర్ల సమాజం ఏర్పడటానికి మూలం మతం శాసించే దశకు సైన్స్‌ను చేర్చడమే!

దేశంలో రూపుదిద్దుకొన్న శాస్త్రజ్ఞానం (అంతరిక్ష శాస్త్రం, వైద్య శాస్త్రం, వ్యవసాయం శాస్త్రం) ఏవిధంగా మధ్య ఆసియా ద్వారా ఐరోపాకు విస్తరించిందో 'సైన్స్ చరిత్ర' విశ్లేషకులు క్రోడీకరించారు. మతం నీడ నుండి బయట పడ్డ ఐరోపా తరువాత అమెరికా ముందుకెళ్లడానికి శాస్త్రజ్ఞానం ఎలా తోడ్పడిందో విపులీకరించారు చరిత్రకారులు. డార్విన్ జీవ పరిణామవాదం, మార్క్స్ సామాజిక ఆర్థిక పరిణామ తాత్వికతలు ఏ విధంగా సమాజ పురోగమనానికి తోడ్పడ్డాయో శాస్త్రవేత్తలు తెలియజెప్పారు. న్యూటన్, ఐన్‌స్టీన్ వంటి విశ్వనరుల సిద్ధాంతాల వెలుగులో ప్రపంచం ఎలా మార్పు చెందిందో అర్థమౌతూనే వుంది. ఈ విషయాన్ని ఆధునిక శాస్త్రవేత్త స్టీఫెన్ హాకింగ్ ఇటీవల మరోసారి ఈ తరం వారికి గుర్తు చేశారు.

అయితే శాస్త్ర, సాంకేతికాల వెలుగులో రూపొందిన నాగరికతలను, ప్రజాస్వామ్య విలువలను తిరస్కరించే ఆటవిక పాలనా రంగం కొన్ని దేశాల్లో రూపుదిద్దుకొంది. దాని వెనక మత మౌఢ్యం, జాత్యహంకారం, పురుషాధిక్యత వంటివి ఉన్నాయి. మానవత్వం, ప్రజాస్వామ్యం, వివక్షతలు లేని సమాజం శాస్త్రజ్ఞానంతో ముడిపడి వున్నదనే సత్యం ఆసియా, ఐరోపా దేశాల చరిత్ర నిరూపించింది. అయినా మన పాలకుల వరవడి మారడంలేదు.

పైగా సాంకేతికాల ద్వారా ఒనగూడే సౌఖ్యాలు కావాలి. మత మౌఢ్యమిచ్చే సౌకర్యాలు వుండాలనే ద్వంద్వ వైఖరి విడనాడలేకపోతున్నారు. ఐరోపా, అమెరికాలను ఆవహించిన సైన్స్ సాంకేతికాల గుత్త సొమ్ము వ్యాపారం, మన పాలకులను ఇంకా ఇంకా దిగజార్చింది. ఆ గొలుసులో భాగస్వామ్యం కోసం వెంపర్లాట మొదలైంది. దాని ఫలితమే నేటి ధనస్వామ్య నియంతృత్వ, పర్యావరణ పతన ధోరణితో నిండిన పాలనా రంగం. అంటే పాలనా రంగాన్ని మార్చడమే మన తక్షణ కర్తవ్యం. దానికి దోహదపడేదే ప్రజా సైన్స్ ఉద్యమం. సైన్స్‌ను, సాంకేతికాలను అనుభవిస్తూ సాంప్రదాయాల ముసుగులో ప్రజలను దిగజార్చే పాలకులను వెనక్కు నెట్టాలి. అదే మనకు నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేశ్, పిఎం భార్గవ, వినోద్ రైనా వంటి 'సైన్స్-సమాజం' కేంద్రంగా పని చేసిన ఉద్యమ కారులిచ్చిన స్ఫూర్తి. ఆంధ్ర-తెలంగాణ రాష్ట్రాల్లో ఆ లక్ష్యంతోనే జన విజ్ఞాన వేదిక మూడు దశాబ్దాలుగా పని చేస్తున్నది. అది బలపడితేనే పాలనా శాస్త్రం పరిపుష్టమౌతుంది.

సోషల్ మీడియా

శ్రీధరాయనమ్



ఈశాన్యపు మాణిక్యం పేద ముఖ్యమంత్రి
ఓడాడని ఈనాడున మీటె హాస్య తంత్రి

లేనివాళ్ల బాగు కొరకు అంకితమా నేత
రెండు దశాబ్దాల నడత మచ్చలేని ఘనత
చవకబారు చూపులకు బోధపడని గీత
ఛీఛీలకు లోనాయెను శ్రీధరేఖ రోత

అపజయాలు విజయాలు లెక్కించని ఆశయం
అరుణారుణమై వెలుగును చైతన్యం అహరహం
ప్రజల తీర్పు గౌరవించి నేర్పుకునే సంస్కారం
వున్నదిలే వలసినంత చెల్లదు ఏ వెటకారం

నవ్వన్నది గొప్ప గుణం నవ్వించుట గొప్పతనం
తొవ్వ తప్పిపోవడం దుర్భర అవలక్షణం
వేల కోట్లు కాజేసే వంచకులను వదలి
నేల తల్లి బిడ్డలపై కార్టూనిస్టు కాహళి

ఆదర్శాలను చూడని చవకబారు హాస్యం
అనుచితమై ప్రవహించే అసందర్భ లాస్యం

\- తెర

జన వాక్యం

బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ

అధికారం కోసం చంద్రబాబు చేసిన హామీలు ఏనాడో గాల్లో కలిశాయి. కనీసం దివ్యాంగులకు చేసిన హామీలను కూడా ఆయన పట్టించుకోవడం లేదు. అధికారంలోకి వచ్చాక దివ్యాంగులందరికీ రూ.1500 పింఛను ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ రూ.1000 మాత్రమే ఇస్తున్నారు. అలాగే ఉపాధి భద్రతలో విద్యావంతులైన దివ్యాంగులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. తక్షణం వీరిని ఆదుకోవాలి. బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలి.

ముక్కు సుబ్బారెడ్డి,
ఇమెయిల్ ద్వారా.

ఇదేనా మహా మేలు?

పార్లమెంటు సాక్షిగా 2016-17లో ప్రభుత్వ రంగ బ్యాంకులు రద్దు చేసిన అప్పుల విలువ రూ.81,683 కోట్లు. 2017-18లో రద్దు చేసిన రుణాల విలువ రూ.28,781 కోట్లు అని అరుణ్ జైట్లీ చెప్పారు. అంటే ఏడాదిన్నరలో కార్పొరేట్ శక్తులకు కలిగించిన ప్రయోజనం అక్షరాలా రూ.1,10,464 కోట్లు. అయితే అదే అరుణ్ జైట్లీ బుధవారం మీడియా సమావేశంలో 2014 నుండి ఇప్పటి వరకు ఏపికి రూ.4000 కోట్లు ఇచ్చి మహా మేలు చేసినట్టు మాట్లాడారు. తీవ్ర ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న ఐదు కోట్ల మంది ప్రజానీకం కలిగిన రాష్ట్రానికి నాలుగేళ్లల్లో కేవలం రూ.4000 కోట్లు ఇవ్వడం గొప్పగాను, కోట్లకు పడగలెత్తిన కుబేరులకు ఏడాదిన్నరలో అప్పనంగా రూ.1,10,464 కోట్లు దోచి పెట్టడం సాధారణ విషయంగానూ జైట్లీ భావిస్తున్నారు. హోదా కంటే ప్యాకేజీ ద్వారా ఎక్కువగా ఇస్తున్నామని చెబుతున్న కేంద్ర ప్రభుత్వ వాదనను నమ్మడానికి ప్రజలెవరూ అమాయకులు కాదు. హోదా వల్ల కలిగే ప్రయోజనం ఏంటో! దాని చట్టబద్ధత ఏంటో! తెలుగు ప్రజలకు బాగానే తెలుసు. కాబట్టి ఇప్పటికైనా హోదా సాధించడంలో ఏపి ప్రజలు కంకణబద్ధులు కావాలి.

తాండ్ర రమణ, ఇమెయిల్ ద్వారా.

వ్యాసాలు, ఉత్తరాలు పంపాల్సిన చిరునామా
editpageps@gmail.com

ఇటలీ ఎన్నికల ఫలితాలపై వాటికన్ ఆందోళన !



బెర్లుస్కోని రెంజీ డిమాయియో



ఎం కోటేశ్వరరావు

వలసదారుల వ్యతిరేక, ప్రజాకర్షక నినాదాలు ఇచ్చిన పార్టీలు ఆదివారం నాటి ఇటలీ ఎన్నికలలో పైచేయి సాధించటం పట్ల వాటికన్ ఆందోళన వ్యక్తం చేసింది. వాటికన్ విదేశాంగ మంత్రి కార్డినల్ పైట్రో పారోలిన్, కాథలిక్ వార్తా సంస్థ 'సిర్'తో మాట్లాడుతూ 'అన్ని వేళలా మనం కోరుకున్న సమాజాలు లేదా కోరుకున్న పరిస్థితులు వుండాలంటే కుదరదు. ఎటువంటి పరిస్థితులలో అయినా మనం పని చేయాల్సిందే' అని వ్యాఖ్యానించారు. పొదుపు లేదా మరొక సాకుతో కార్మిక వర్గంపై భారాలు మోపిన పార్టీలకు శృంగభంగమైంది. ఏ పార్టీకి మెజారిటీ లేని తీర్పు ఇచ్చారు. భిన్న వైఖరులు కలిగిన పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుందా? లేక మరో మారు ఎన్నికలకే పార్టీలు మొగ్గు చూపుతాయా అన్నది పెద్ద ప్రశ్నగా వుంది. ఈ తీర్పు ఇటలీకేగాక ఐరోపా మొత్తానికి చెడు సంకేతమని కొందరు వ్యాఖ్యానించారు. ఈనెల 23న జరిగే పార్లమెంట్ తొలి సమావేశం నాటికి సంకీర్ణం గురించి ఒక స్పష్టత వచ్చే అవకాశం వుంది. కార్మిక వర్గంపై మోపుతున్న భారాలు, పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు కారణమైన నయా ఉదారవాద విధానాలకు వ్యతిరేకంగా ఓటర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితిని మితవాద, పచ్చి మితవాద శక్తులు సొమ్ము చేసుకోవటం ఇక్కడ కూడా పునరావృతమైంది.

ఐరోపా యూనియన్‌లో నాలుగవ పెద్ద దేశమైన ఇటలీలో తీవ్రంగా ఉన్న దారిద్ర్యం, నిరుద్యోగం కారణంగా తలెత్తిన అసంతృప్తి కారణంగా పాలక డెమొక్రటిక్ పార్టీ ఎన్నడూలేని రీతిలో మట్టి కరచింది. పార్లమెంట్ ఉభయ సభల్లో 945 స్థానాలున్నాయి. డిప్యూటీల ఛాంబర్‌గా పిలిచే దిగువ సభలోని 630 సీట్లకు గాను ప్రస్తుతం అధికారంలో వున్న డెమొక్రటిక్ పార్టీ కూటమి బలం 345 నుంచి కేవలం 112కు పరిమితమైంది. మితవాద కూటమి తన బలాన్ని 125 నుంచి 263కు పెంచుకుంది. గతంలోనూ, ఇప్పుడు ఒంటరిగా పోటీ చేసిన ఫైవ్ స్టార్ పార్టీ బలం 109 నుంచి 223కు పెరిగి అతి పెద్ద పార్టీగా అవతరించింది. మరో చిన్న పార్టీ 14 స్థానాలు తెచ్చుకుంది.

మితవాద కూటమికి ఎక్కువ సీట్లు వచ్చిన కారణంగా తమకు ప్రధాని పదవి దక్కాలని దానిలోని పెద్దదైన పచ్చి మితవాద లీగ్ పార్టీ నేత పేర్కొన్నారు. మాజీ ప్రధాని బెర్లుస్కోని ఫోర్జా ఇటాలియాకు కేవలం 14 శాతం మాత్రమే రాగా లీగ్ పార్టీకి 17.4శాతం, ఫాసిస్టు పార్టీ బ్రదర్స్‌కు 4.3 శాతం ఓట్లు వచ్చాయి. తమకు కూడా ప్రధాని పదవి కావాలని బెర్లుస్కోని ప్రకటించాడు. అయితే పన్ను ఎగవేతదారుగా వున్న బెర్లుస్కోని ఎలాంటి పదవిని చేపట్టకూడదు. మరో కూటమి తోడ్పాటు లేకుండా మితవాద కూటమి అధికారం చేపట్టే అవకాశం లేదు. డెమొక్రటిక్ పార్టీ, ఫోర్జా ఇటాలియా కలసి ప్రభుత్వ ఏర్పాటు గురించి ఎన్నికలకు ముందు చర్చించారు. అయితే దాని మీద ఎలాంటి పురోగతి లేదు. ఇప్పుడా అవకాశం కూడా లేదు. రెండూ కలసినా మెజారిటీ లేదు. ఫైవ్ స్టార్ పార్టీ, డెమొక్రటిక్ పార్టీ జతకట్టటమే మిగిలింది. ఇప్పటి వరకు ఫైవ్ స్టార్ పార్టీ అధికారానికి దూరంగా వుండి అటు అధికార, ప్రతిపక్షం రెండింటినీ విమర్శిస్తూ ఓటర్లలో సానుభూతిని పొంది, అధికారం కోసం జనం ఛీకొట్టిన డెమొక్రటిక్ పార్టీతో చేతులు కలిపేందుకు ఫైవ్ స్టార్ ముందుకు వస్తుందా అన్నది సమస్య. తమది వామపక్షం లేదా మితవాదం కాదు అని చెప్పుకున్న ఆ పార్టీ వలసలను అనుమతించే విషయంలో వ్యతిరేకించే మితవాద వైఖరిని తీసుకుంది. ఉభయ సభల్లోనూ అతి పెద్ద పార్టీగా అవతరించింది. ఎన్నికల సమయంలో ఆ పార్టీకి చెందిన 31 సంవత్సరాల డిమాయియో దేశంలోని పెద్ద వాణిజ్యవేత్తలు, పెట్టుబడిదారుల సమక్షంలో మాట్లాడుతూ తమ పార్టీని ఐరోపా యూనియన్ వ్యతిరేకమైనదిగా వర్ణించటాన్ని తప్పు పట్టారు. ఇతర పార్టీలతో సంకీర్ణ కూటములు ఏర్పాటు చేయటాన్ని నిషేధించే పేరాను తన కార్యక్రమం నుంచి ఫైవ్‌స్టార్ తొలగించింది. ఇటలీని గందరగోళంలో వదలి వేయాలనుకోవటం లేదని, ప్రభుత్వంలో చేరే సమయం ఆసన్నమైందని కూడా డిమాయియో చెప్పారు.

ఇటలీలో ఏ పార్టీకి మెజారిటీ రాకపోవటంతో ఫలితాలు వెలువడగానే స్టాక్ మార్కెట్లో ప్రతికూల స్పందన వచ్చింది. అయితే అదే సమయంలో జర్మనీలో ప్రభుత్వ ఏర్పాటుకు దారి తీసే నిర్ణయం ఊరట కలిగించింది. బ్రెక్సిట్ తరువాత ఇటలీ ఫలితాలు ఇటలీతో పాటు ఐరోపాకూ చెడ్డవే అని ఒక జర్మన్ పత్రిక, భూకంపం వంటిదని ఫ్రెంచి పత్రిక లీ మాండే, ఇటలీ పాలనకు అవకాశం లేని దేశంగా మారే అవకాశం వుందని లా డిపీచి వ్యాఖ్యానించాయి.

రెండవ ప్రపంచ యుద్ధంలో తీవ్రంగా దెబ్బతిన్న ఐరోపా ధనిక దేశాలు అమెరికా, జపాన్‌ల నుంచి వచ్చే పోటీని తట్టుకొని తిరిగి కోలుకోవాలంటే ఐరోపా యూనియన్ ఏర్పాటు ఒక మార్గమని భావించాయి. దాని ద్వారా తమ లాభాలు, మార్కెట్లను విస్తరించుకోవాలని చూసిన కార్పొరేట్ శక్తులు ప్రపంచ వాణిజ్య పోటీలో తమ వస్తువుల ధరలు తక్కువగా వుండి పోటీలో తట్టుకోవాలంటే కార్మిక వర్గం మీద భారాలు మోపటం ఒక విధానంగా ఇంత కాలం అనుసరించాయి. దాని వలన కూడా అంతగా ప్రయోజనం లేకపోవటంతో యూనియన్ నుంచి బయటకు వచ్చి ఎవరికి వారు తమ పలుకుబడిని ఉపయోగించుకొని వాణిజ్య ఒప్పందాలను కుదుర్చుకొని లబ్ధి పొందాలని చూస్తున్నాయి. దాని పర్యవసానమే బ్రెక్సిట్. అంతకు ముందే అనేక దేశాలలోని మితవాద శక్తులు ఐరోపా యూనియన్ వ్యతిరేక వైఖరిని తీసుకున్నాయి. ఇటీవలి కాలంలో ఎవరు అధికారంలో వున్నా మరీ ముఖ్యంగా 2008 ఆర్థిక సంక్షోభం తరువాత ఐరోపాలో ఏ ఒక్క పార్టీ కూడా వరుసగా రెండో సారి అధికారానికి వచ్చిన ఉదంతం లేదు. మితవాద, సోషల్ డెమొక్రటిక్ పార్టీలనే తేడా లేకుండా జనం ఓడిస్తున్నారు.

నయా ఉదారవాదం కలిగించిన భ్రమలకు కార్మిక వర్గం లోనుకావటాన్ని గమనించి వాగాడంబరంతో వున్న వామపక్ష శక్తులు, పచ్చి మితవాద శక్తులు ప్రజాకర్షక నినాదాలతో ఎన్నికల బరిలోకి దిగి అనూహ్య విజయాలు సాధిస్తున్నాయి. సాంప్రదాయ పార్టీలకు చుక్కలు చూపుతున్నాయి. ఇటలీలో జరిగింది అదేనని గ్రహించిన మితవాద శక్తులు ఐరోపా యూనియన్ నుంచి బయటకు రావాలనే వైఖరి లేదా దానిని తీవ్రంగా విమర్శించటం గాని చేస్తున్నాయి. ఎన్నికలలో లబ్ధి పొందుతున్నారు. ఇటలీ ఎన్నికల ఫలితాలు ఇటువంటి శక్తులకు ఇతర దేశాలలో కూడా ఊపునిస్తాయని వేరే చెప్పనవసరం లేదు.

సాంప్రదాయ సోషల్ డెమొక్రటిక్ పార్టీలు ఇంకేమాత్రం జనాన్ని ఆకర్షించే స్థితిలో లేవని దాదాపు ప్రతి దేశంలో రుజువు చేసుకున్నాయి. జర్మనీ సోషల్ డెమొక్రటిక్ పార్టీలో వామపక్ష వాదులుగా వున్న యువకులు మెర్కెల్ నాయకత్వంలోని క్రిస్టియన్ డెమొక్రటిక్ పార్టీతో చేతులు కలపటంపై తిరుగుబాటు జరిపి కొత్త పార్టీని ఏర్పాటు చేస్తారా అన్నంతగా కొన్ని పరిణామాలు జరిగాయి. చివరకు సంకీర్ణంపై పార్టీలో ఓటింగ్ జరిపి నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. గ్రీసులో ఆకర్షణీయ వాగ్దానాలతో రెండవ సారి కూడా అధికారానికి వచ్చిన సిరిజా ఆచరణలో కార్మిక వ్యతిరేక చర్యలకు పాల్పడుతూ తీవ్ర వ్యతిరేకతను కొని తెచ్చుకొంటోంది. ఇపుడు ఒక హాస్యనటుడి నాయకత్వంలో ఏర్పడిన ఇటలీ ఫైవ్ స్టార్ ఉద్యమ పార్టీ కూడా పూర్తిగా అలాంటిది కాకపోయినప్పటికీ పాలక పార్టీల వైఫల్యాలను సొమ్ము చేసుకున్న పార్టీ మాత్రమే. గత ఎన్నికలలో 25.56 శాతం ఓట్లు 109 సీట్లు తెచ్చుకున్న ఈ పార్టీపై ఎలాంటి మచ్చ లేకపోవటంతో ఈ ఎన్నికలలో ఆ బలాన్ని 32.66 శాతం ఓట్లు 221 సీట్లకు పెంచుకొని అధికారానికి రావాలని ఉవ్విళ్లూరుతోంది. ఈ పార్టీ కనుక అధికారానికి వస్తే సాంప్రదాయక పార్టీలు వెనక్కు పోయి కొత్త పార్టీలతో ఐరోపా ధనిక దేశాలలో మరో నూతన అధ్యాయం ప్రారంభమైనట్లే అని చెప్పవచ్చు.

దొందూ దొందే




మన్మోహన్ సింగ్ ప్రభుత్వం

రాజా - జైల్
సురేశ్ కల్మాడి - జైల్
కనిమొళి - జైల్
రామలింగ రాజు - జైల్
సహారా శ్రీ - జైల్
సంజయ్ చంద్ర - జైల్
వినోద్ గోయంకా - జైల్

మోడీ ప్రభుత్వం

విజయ్ మాల్యా-పరార్
లలిత్ మోడీ-పరార్
సంజయ్ బండారి-పరార్
జతిన్ మెహతా-పరార్
నీరవ్ మోడీ-పరార్
మెహుల్ భాయ్-పరార్

ఘనత



అక్బర్ : బీర్బల్ ! మోడీ, ప్రభుత్వం సాధించిన ఘనత ఏమిటి?
బీర్బల్ : జహాపనా! సాధారణ ప్రజల ఆలోచనా విధానంలో చాలా పెద్ద ఎత్తున మార్పు వచ్చేలా చేశారు. 2016 ముందు వరకు, ప్రజల తమ దగ్గర ఏమీ లేదని, ప్రభుత్వం తమకు ఏదైనా ఇవ్వాలని అనుకునేవారు. నేడు, ప్రజలు తమ దగ్గర చాలా ఉన్నదని, దానిని ఈ ప్రభుత్వం నుండి కాపాడుకోవాలని తీవ్రంగా ఆలోచిస్తున్నారు.

కట్టుబాట్ల పేరుతో కొన్ని సంప్రదాయాలు సమాజాన్ని వెనక్కి నెట్టేస్తాయి. మరికొన్ని సంప్రదాయాలు మనుషుల మధ్య ఐక్యతను చాటుతాయి. సమాజాభివృద్ధికి తోడ్పడే ఏ విషయాన్నైనా అందరం ప్రోత్సహించాలి. అలా మానవత్వాన్ని పంచే కొన్ని ఆచారాలను గౌరవించాలి అంటున్నారు .. శృంగారపురం పల్లెవాసులు. ఇప్పుడు మనం చెప్పుకోబోయేది దశాబ్దాలుగా విసిరివేయబడ్డ ఓ సామాజికవర్గం గురించి. దశాబ్దానికిపైగా స్ఫూర్తివంతంగా వారు అనుసరిస్తోన్న సంప్రదాయం గురించి! రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు 'మన' అనుకున్న వారికోసం మనసారా చేస్తోన్న సాయం గురించి!! కూటికి పేదోళ్లమైనా కష్టసమయాల్లో మాదంతా ఒకే కుటుంబం అంటోన్న శృంగారపురం మాదిగపల్లి వాసుల అనుబంధాల కథేంటో తెలుసుకుందాం పదండి!!



ఒకరికి ఒకరై..

ఏకమై..! సాయమై!!

గుంటూరుజిల్లా దుగ్గిరాల మండలంలోని ఓ మారుమూల గ్రామం శృంగారపురం. ఈ గ్రామంలో రెండు వందలకుపైగా మాదిగ సామాజికవర్గానికి చెందిన కుటుంబాలు జీవిస్తున్నాయి. వీరిలో ఎక్కువమంది రోజు కూలీలే. నేటి ఆధునిక జీవనంలో పక్కవారి గురించి పట్టించుకునే తీరిక ఎక్కడుంటుంది అనే మాట సర్వసాధారణం. అదీ దళితవాడలైతే సామాజికంగానేకాదు, ఆర్థికంగా, విద్యాపరంగా వెనుకబాటుకు కేరాఫ్ అడ్రస్‌లుగా నిలుస్తున్నాయి. వారి అమాయకత్వాన్ని సొమ్ము చేసుకునే నాయకులుకు కొదవేలేదు. ఐక్యంగా ఉంటే, వారి ఆటలు సాగవని.. విభజించి పాలించేందుకు ప్రణాళికలు వేస్తూ.. వారిని దశాబ్దాలుగా మోసం చేస్తున్నారు. అయితే, ఆ మాటలకు శృంగారపురం గ్రామానికి మినహాయింపు ఇవ్వాలి. ఎందుకంటే, ఇక్కడి మాదిగపల్లె వాసులు ఐక్యతకు మారుపేరుగా నిలుస్తున్నారు.

ఆపదలో అండగా!

'మా ఎస్‌సి కాలనీకి చెందిన చందు అనే యువకుడు గతేడాది ఒక్కసారిగా లివర్ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. తల్లిదండ్రులిద్దరూ రోజు కూలీలు. పనికెళ్తేనే పూటగడిచేది. అలాంటి కుటుంబానికి చెందిన చందు హఠాన్మరణంతో ఆ తల్లిదండ్రులకు దిక్కుతోచని పరిస్థితి. అయితే, ఎస్‌సి కాలనీలోని వారమంతా ఒక్కొక్కరిగా చేరాం. ఎవరికి తోచింది వారు..కొంత మొత్తాన్ని పోగుచేసి, వారికి అందించాం. అంతా ఒక్కటై.. ఆరోజున ఆ కుటుంబానికి ఆసరాగా నిలిచాం. ఇలా మా కాలనీలో ఎవరికి ఏ సమస్య వచ్చినా పదిమందిమి ఒక్కటై, అండగా ఉండటం మా సంప్రదాయం' అని చెప్పుకొచ్చాడు ఈ గ్రామానికి చెందిన శైలేంద్ర అనే యువకుడు. రెండేళ్ల క్రితం పాతికేళ్లు కూడా నిండని ఓ మహిళకు హార్ట్‌లో ఏదో సమస్య వచ్చింది. వెంటనే స్పందించిన కాలనీవాసులు వారి సంప్రదాయాన్ని కొనసాగించారు. ఆమె ప్రాణాలను కాపాడుకున్నారు. ఇక్కడివారిని పలకరిస్తే చాలు, మాదిగపల్లెలో ఆనవాయితీగా వస్తోన్న ఈ సంప్రదాయం గురించి గర్వంగా చెప్పుకొస్తారు.



డబ్బుకంటే.. బంధాలే ముఖ్యం


ఈ రోజుల్లో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలే అంటారు కొందరు. కానీ, ఈ మాదిగపల్లెలోనివారు మాత్రం 'డబ్బు ఈరోజున మా దగ్గర ఉంటే, రేపు ఎదుటోళ్ల దగ్గర ఉంటుంది. దానికోసం మనుషుల మధ్య బంధాలను వదులుకోవడం మాకు ఇష్టం లేదు' అంటారు. సుఖదుఃఖాలలో ఒకరికి ఒకరు తోడుంటారు. కష్టనష్టాల్లో ఒకరికొకరు అండగా నిలుస్తారు. కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఇస్సయ్యకు పక్షవాతం వచ్చింది. ఆస్పత్రికి తీసుకెళ్లారు. విషయం తెలుసుకున్న కాలనీవారంతా తమ రోజువారీ పనులను పక్కనబెట్టి, అక్కడికి చేరుకున్నారు. ఇస్సయ్య వారంరోజులు ఆస్పత్రిలో ఉన్నాడు. అతనికి విడతలవారీగా ఆస్పత్రిలో తోడుండేందుకు కాలనీ యువకులు ప్రణాళికలు వేసుకున్నారు. తిరిగి ఇంటికి వచ్చేవరకూ కంటికిరెప్పలా చూసుకున్నారు. ఇప్పుడు ఇస్సయ్య భార్యా పిల్లలతో సంతోషంగా జీవిస్తున్నాడు. ఇలాంటి సంఘటనలు, సందర్భాలు ఈ కాలనీలో చెప్పుకోవాలంటే చాలానే ఉన్నాయి. అప్పుడప్పుడూ వీరి మధ్యా విభేదాలూ వస్తుంటాయి. వాటిని అందరూ కలిసి, సామరస్యంగా పరిష్కరించేలా ప్రణాళికలు వేసుకుంటారు. ఆర్థికపరమైన అంతస్థులు వారి మధ్య ఆప్యాయతలకు అడ్డురావు. రాజకీయాలకు అతీతంగా అంతా ఒక్కటై.. ముందుకు సాగడమే వీరికి తెలుసు.

పుట్టుకకు అర్థమే ఉండదు

'మా మంచికోసమే పెద్దలే ఇలాంటి నిబంధన పెట్టుంటారు. అలాంటప్పుడు వాటిని గౌరవించడం మా బాధ్యత. భవిష్యత్తులోనూ ఈ సంప్రదాయాన్ని కొనసాగిస్తాం. అయినా, ఆపద సమయాల్లో సాటిమనిషికి సాయపడకపోతే ఈ పుట్టుకకు అర్థంలేదు కదా?!' అంటారు స్థానిక యువతీయువకులు. అంతేకాదు, క్రీడలను ప్రోత్సహించేందుకు ఇక్కడివారంతా ఓ చిన్న సైజు క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేసుకున్నారు. 'మా పిల్లల ఆలోచనలు మారడానికి కారణం చదువు. అయితే, భవిష్యత్తులో అది ఎక్కడ వారికి దూరం అయిపోతుందో అని భయంగా ఉంది. మా ఊరికి బస్సు సౌకర్యంలేదు. పిల్లలు చదువుకోవాలంటే మూడు కిలోమీటర్ల దూరంలోఉన్న రేవేంద్రపాడు సెంటర్‌కు వెళ్లాల్సిందే! అక్కడికి చేరుకునేందుకు బస్సు లేదు. చదువుకునే పిల్లలు రోజూ ఆటోల్లోనే వెళ్లాలి. అలా పంపించాలంటే మాకు భయంగా ఉంది. పిల్లలు తిరిగి ఇంటికి వచ్చేదాకా ఆ భయం అలాగే ఉంటుంది. దాంతో కొందరు తల్లిదండ్రులు పిల్లలను స్కూళ్లకు పంపించకుండా ఇంటిపట్టునే ఉంచేస్తున్నారు. మరికొందరు పనులకు పంపించేస్తున్నారు. అధికారులు స్పందించి, మా ఊరికి బస్సు సౌకర్యం కల్పిస్తే మాకు ఎంతో ప్రయోజనం ఉంటుంది' అని తమ ఊరిలోని రవాణా సమస్య గురించి చెప్పుకొచ్చాడు ఓ గ్రామస్తుడు.

కేవలం చదువుకునే పిల్లలేకాదు.. ఇక్కడి వారు వ్యాపారం, ఉపాధి పనుల్లో భాగంగా నిత్యం రాకపోకలు సాగిస్తూనే ఉంటారు. సరైన రోడ్డు సౌకర్యమూ లేదు. ఇన్ని సమస్యలు ఉన్నాగానీ, నిరుత్సాహ పడకుండా అంతా ఐక్యతతో ఒకరికొకరు సాయపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇలా... మనసున్న సమాజం కోసం తమవంతుగా పాటుపడుతూ.. చుట్టుపక్కల గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తోన్న శృంగారపురం వాసులను హృదయపూర్వకంగా అభినందించాల్సిందే!

- చందు తిలారు



కలిసికట్టుగా పనిచేస్తున్నాం

మా మధ్య ఎన్ని గొడవలున్నా.. ఎవరికైనా ఆపద వస్తే అవేంపట్టించుకోం. దళిత కుటుంబాల పరిస్థితి ఏంటో రోజూ పేపర్లలో, టీవీల్లో చూస్తున్నాం. రాజకీయంగా, సామాజికంగా వెనకబడిన దళితబిడ్డలకు మా ఊరు ఆదర్శంగా కనిపించాలి. అందుకు కలిసికట్టుగా పనిచేస్తున్నాం.

- ఎస్ నవీన్



మావోళ్ల చలవతోనే బతికా

ఐదేళ్ల క్రితం పాము కాటుకు గురయ్యాను. ఆస్పత్రికి తీసుకెళితే అక్కడ బతకడం కష్టమన్నారు. వారం పాటు చావును దగ్గరగా చూశాను. మావాడ వాళ్లంతా నాకు ధైర్యం చెప్పారు. ఆర్థికంగా ఆదుకున్నారు. ఈ రోజు బతికున్నానంటే అది మావోళ్ల చలువే!

- కనపాల రాయప్ప



మా పిల్లలు బాగా చేస్తున్నారు

కలిసికట్టుగా ఉంటే ఇంత బలం ఉంటుందని మా పిల్లలు నిరూపిస్తున్నారు. వారు ఏం చేసినా, మా పెద్దల సలహాలు, సూచనలు తీసుకుంటారు. భవిష్యత్తులోనూ దీన్ని కొనసాగిస్తారనే నమ్మకం ఉంది. అయితే, మా మాదిగపల్లెకు సరైన వసతులు లేవు. ఆ సమస్యలూ తీరాలి.

- శృంగారపాటి బాజీ

కాంతివంతమైన చర్మం కోసం

చర్మసౌందర్యాన్ని మెరుగుపర్చుకోవాలంటే కొంతమంది కేవలం బ్యూటీ ప్రొడక్ట్స్‌ను మాత్రమే వాడుతుంటారు. మనం వంటిల్లో వాడే పదార్థాల ద్వారా కూడా చర్మసౌందర్యాన్ని పెంచుకోవచ్చని చెబుతున్నారు నిపుణులు.

- గిన్నెలో ఒక స్పూన్ బొప్పాయి గుజ్జు, ఒక స్పూన్ తేనె, రెండు స్పూన్ల నిమ్మరసం వేసి పేస్టులా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూతలా పట్టించి ఇరవై నిమిషాల వరకు అలాగే ఉంచుకోవాలి. అనంతరం శుభ్రమైన నీటితో కడిగేస్తే. చర్మం కాంతివంతం అవుతుంది. చర్మం పొడి బారకుండా ఉంటుంది.
- ఒక గిన్నెలో కొత్తిమీర, పుదీనా ఆకులను సమానంగా తీసుకోవాలి. అనంతరం వాటిని ఒక పేస్టులా బాగా కలుపుకోవాలి. ఈ పేస్టులో కాస్త నిమ్మరసం చేర్చి బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే జిడ్డు వెంటనే తొలగిపోతుంది.
- ఒక పాత్ర తీసుకుని అందులో బాదం, ఓట్స్ సరిపాళ్ళలో వేసుకోవాలి. అనంతరం వాటిని కలియబెడుతూ పేస్టులా తయారుచేసుకోవాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టిస్తే ముఖం



కాంతివంతంగా తయారవుతుంది. అయితే మొటిమలు, సెన్సెటివ్ చర్మం కలిగినవారు ఈ మిశ్రమాన్ని ఉపయోగించకూడదు.

- రోజూ తీసుకునే డైట్‌లో క్యారెట్ ఉండాలి. ఇవి మొటిమలను దూరం చేయడంతో పాటు కేశాలను సంరక్షిస్తాయి. ఆమ్లాలను రోజూ తీసుకోవడం ద్వారా శరీరవేడి తగ్గుతుంది. జుట్టు నెరసిపోవడానికి చెక్ పెడుతుంది. రోజూ మూడు నాలుగు బాదం పప్పులు తీసుకోవడం ద్వారా చర్మం కాంతివంతంగా తయారు కావడంతో పాటు జుట్టు నెరసిపోకుండా చేస్తుంది.
- పాల మీగడ లేదా పెరుగులో కాస్త తేనె కలుపుకుని కంటికి మర్దన చేసుకుంటే.. కంటి కింది వలయాలు మాయమవుతాయి. జుట్టు నెరసినవారు అప్పుడప్పుడు ఆయిల్ మసాజ్ చేసుకుంటూ ఉండాలి. దీని కోసం బాదం ఆయిల్ ఉపయోగించడం మంచిది. ★

మీకోసం

విపరీతంగా తలనొప్పి ఉంటే.. వేడి వేడి టీలో కొద్దిగా తేనె కలుపుకొని తాగితే వెంటనే బాధ నుంచి విముక్తి పొందవచ్చు.



జీవన సౌరభం

అన్నీ కోల్పోయినా.. ఆత్మవిశ్వాసాన్ని కోల్పోకూడదు. అదొక్కటి ఉంటే చాలు.. మనం కోల్పోయిన వాటన్నింటినీ తిరిగి దక్కించుకోవచ్చు

మా నాన్నగారు 2004 సంవత్సరంలో 200 గజాల స్థలానికి ఒక వ్యక్తి దగ్గర అగ్రిమెంటు రాయించుకున్నాడు. డబ్బులు అవసరమై 2005 సంవత్సరంలో వేరొక వ్యక్తి దగ్గర అగ్రిమెంటు కాగితాలు ఇచ్చి, డబ్బు తీసుకున్నాడు. ఆ స్థలం అప్పటి నుంచీ వివాదంలో ఉంది. అసలు యజమాని ఇంకా రిజిష్టరు చేయలేదు. అగ్రిమెంటు కాగితాలుగల వ్యక్తి తనకే హక్కు ఉందంటున్నాడు. మేము ఆ స్థలం మీద ఆశలు పెట్టుకున్నాం. 2008లో గ్రామపంచాయితీలో అగ్రిమెంటు కాగితాలు ఉన్నవారికే హక్కు ఉందని తీర్మానించారు. ఇప్పటివరకు వివాదం తేలలేదు. మాకు ఆ స్థలం మీద హక్కు లభిస్తుందా? లేదా?

- రెహ్మాన్, తిరువూరు

ఆ స్థలంపై మాకు హక్కుందా?

న్యాయ సలహా





అగ్రిమెంటు చేసుకున్నప్పుడు షరతులు ఉంటాయి. కాలపరిమితి, ఎవరి పేరున రిజిష్టరు చేయాల్సిందీ రాసుకోవాలి. మీ నాన్న వేరొకరికి అగ్రిమెంటును బదిలీ చేసి ఉంటారు. అంటే, అగ్రిమెంటు మొత్తాన్నీ చెల్లించి, అసలు యజమాని చేత రిజిష్టరు చేయించుకోవచ్చు. ఇంతకాలం రిజిష్టరు చేయకుండా ఉంటే అగ్రిమెంటుకి కాలదోషం పడుతుంది. బహుశా మరో అగ్రిమెంటు స్థల యజమాని కొంతపైకం తీసుకుని, రాసి ఉంటాడు. అప్పుడు ఆ స్థలం మీద అతడికి హక్కు ఉంటుంది. అతనికే రిజిస్ట్రేషను జరుగుతుంది. మీకు కాదు. మీ నాన్న అగ్రిమెంటు తాలూకు సొమ్మును తీసుకున్నాక మీకెలా హక్కులుంటాయి? పైగా మీరు అగ్రిమెంటులో 'పార్టీ' కాదు. కాబట్టి, మీకు ఎలాంటి హక్కులూ లేనట్టే. కాబట్టి, అనవసరంగా ఆ స్థలం కోసం ఆశపడి పేచీలు పడొద్దు. కొట్లాటలు జరిగితే క్రిమినల్ కేసు అవుతుంది. అది మీకే నష్టం. కాబట్టి మీది కాని ఆస్తి గురించి మర్చిపోండి. ★

కాటూరు రవీంద్ర త్రివిక్రమ్
హైకోర్టు న్యాయవాది, విజయవాడ.
ఫోన్ నెం : 8330968901
ఇ మెయిల్ : katururavindra trivikram@gmail.com






'టైలర్‌మేన్' మగువ

'ఆలోచనల్లో వైవిధ్యం ఉంటే గెలుపు ఖాయం'- అని భరోసా ఇస్తోంది విద్యా నటరాజ్. శ్రీలంకలో ఓ భారతీయ కుటుంబంలో జన్మించిన ఆమె లండన్‌లో ఉన్నత చదువులు ముగిశాక అక్కడే 'ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్' గా చాలాకాలం పనిచేసింది. ఆ తర్వాత ఫ్రాన్స్‌లోని ప్రఖ్యాత బిజినెస్ స్కూలులో ఎంబిఎ పూర్తిచేశాక భారత్‌కు చేరుకుంది. చెన్నైలో బిజినెస్ కన్సల్టెంట్‌గా ఆమె తన కెరీర్‌ను మొదలుపెట్టింది. వివాహం జరిగాక భర్తతో ఆమె బెంగళూరుకు చేరుకుంది. అక్కడ 'బ్లూ స్టోన్' పేరిట ఆన్‌లైన్ జ్యూయలరీ స్టోర్‌ని ప్రారంభించింది. కొన్నాళ్లపాటు ఆ వ్యాపారం నడిపిన తర్వాత, అందరికంటే విభిన్నంగా ఏదైనా చేయాలని ఆమె సంకల్పించింది. అప్పటికే ఆసియాలో పురుషుల సూట్స్ తయారీలో ఎంతో పేరుపొందిన గౌతమ్ గోల్చాతో కలిసి వ్యాపారంలో అడుగుపెట్టాలని భావించింది. మొదట కుటుంబసభ్యుల నుంచి పెద్దగా ప్రోత్సాహం లభించకపోయినా విద్య వెనకడుగు వేయలేదు. తాను చేసింది నలుగురికీ నచ్చితే సక్సెస్ అసాధ్యం కాదని భావించి, రిస్క్ తీసుకుంది. పురుషుల సూట్స్ తయారీలో అప్పటికే గట్టి పోటీ ఉంది. అది పురుషాధిక్య రంగం కావడంతో నిలదొక్కుకోవడానికి విద్యకి సవాళ్లు తప్పలేదు.

చిత్తశుద్ధి, గెలవాలన్న తపనతో పనిచేయడంతో కొద్ది కాలంలోనే ఆమె ఉత్పత్తి చేసిన సూట్స్ పురుషులను ఆకర్షించాయి. దాంతో ఆమె చేపట్టిన వ్యాపారం క్రమంగా పెరిగింది. హ్యూగోమాస్, రాల్‌లెరెన్ పేర్లతో ఆమె రూపొందించిన సూట్స్‌కి డిమాండ్ ఏర్పడింది. ప్రముఖులు, సెలబ్రిటీలు కూడా ఆ సూట్స్ వాడేందుకు ఆసక్తి చూపడంతో విద్యకి ఇక వెనుదిరిగి చూడాల్సిన అవసరం లేకపోయింది. 'టైలర్‌మేన్' పేరిట ఆమె సొంతంగా నెలకొల్పిన సూట్స్ స్టోర్ బెంగళూరులో ఎంతో ప్రాచుర్యం పొందింది. సూట్స్ తయారీలో తనకంటూ ఓ ప్రత్యేకత సాధించడంతో కోల్‌కతా, చెన్నైలో కూడా స్టోర్‌లను ప్రారంభించి, ఆమె వ్యాపారాన్ని అభివృద్ధి చేసింది. అంతర్జాతీయ ప్రమాణాలతో సూట్స్ అందించడం 'టైలర్‌మేన్' ప్రత్యేకత అని విద్య చెబుతోంది. నాణ్యమైన ముడిసరుకు వాడడం, కొలతల్లో వ్యత్యాసాలను కచ్చితంగా పాటించడం, నిర్ణీత సమయానికి సూట్స్ అందించడం వంటివి తన విజయ రహస్యాలని అంటోందామె. తమ వద్ద సూట్ కుట్టించుకున్న కస్టమర్‌కు సంబంధించి కొలతలను డిజిటల్ పద్ధతిలో నిక్షిప్తం చేస్తామని, ఆ వ్యక్తి మళ్లీ మళ్లీ సూట్ కుట్టించుకునే సమయంలో ప్రతిసారీ కొలతలు ఇవ్వనవసరం లేదని విద్య చెబుతోంది. ఇలా చేయడం వల్ల కస్టమర్ల సమయం ఆదా అవుతుంది. ఆమె వద్ద నైపుణ్యం కలిగిన టైలర్లు ఎంతోమంది ఉన్నారు. తగిన సలహాలు ఇస్తూ వారిని ప్రోత్సహించడం తప్ప.. పని విషయంలో జోక్యం చేసుకోనని అంటారామె. టీమ్‌వర్క్ తప్ప, ఇది తన ఘనత కాదని ఆమె విశ్లేషించారు. పని విషయంలో పురుషుల కంటే స్త్రీలే ఎక్కువగా దృష్టి సారిస్తుంటారని.. అందుకే తన ఫ్యాక్టరీలో అధికభాగం మహిళలే ఉన్నారని అంటోందామె. ఆడవారు బహుముఖ నైపుణ్యం కలిగి ఉంటారని, తమకు కేటాయించిన పనే కాకుండా మరిన్ని పనులు చేయగలిగే సామర్థ్యం వారికి ఉంటుందని అంటారు. డిమాండ్ పెరిగినప్పటికీ అందరికీ అందుబాటు ధరల్లోనే సూట్స్ కుడతామని చెబుతుంటారు. అనిల్ కుంబ్లే, రోహన్ బోపన్న వంటి ప్రముఖ క్రీడాకారులు ఆమె వద్ద సూట్స్ కొంటారు. సెలబ్రిటీలకే కాదు, సామాన్యులకూ ఒకే విధంగా సూట్స్ అందిస్తామని అంటారు విద్యానటరాజ్. ★







BUDGET 2018
బడ్జెట్ 2018

సంస్కరణలు మరింత జోరు

- **2029 నాటికి జిఎస్‌డిపి లక్ష్యం 12 శాతం**
- **రాష్ట్ర ఆర్థిక సర్వే వెల్లడి**

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో


విజన్-2029 ప్రకారం వచ్చే పదేళ్లలో రాష్ట్ర సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు 12 శాతం సాధించాలన్న పేరిట ప్రపంచ బ్యాంకు, ఆసియన్ అభివృద్ధి బ్యాంకు (ఎడిబి), జపాన్ అంతర్జాతీయ సహకార సంస్థ (జైకా) నిర్దేశించిన వ్యవస్థాగత సర్దుబాట్లను మరింత ముమ్మరంగా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించుకుంది. రాష్ట్ర బడ్జెట్‌తో బాటు గురువారం విడుదలైన రాష్ట్ర ఆర్థిక సర్వే ఈ విషయం వెల్లడించింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సామర్థ్యానికి సంబంధించిన ప్రధాన సూచీల తీరు తెన్నులు, 2017-18 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ప్రకటించిన వివిధ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పని తీరును వివరిస్తూ, భవిష్యత్తులో ప్రభుత్వం అనుసరించే విధాన పరమైన చర్యల గురించి ఈ సర్వే కొన్ని సంకేతాలు ఇచ్చింది. గత మూడేళ్లలో రాష్ట్ర వృద్ధి రేటు (జిఎస్‌డిపి) సగటున 11 శాతం సాధించిందని, తలసరి ఆదాయం రూ.1,07,276 (2015-16)నుంచి రూ.1,42,054 (2017-18)కు పెరిగిందని సర్వే తెలిపింది. గత మూడేళ్లలో ఏడాదికి సగటున రూ.12 వేలు చొప్పున పెరిగిందని, ఇది అంతకుముందు కాలంలో, అంటే రాష్ట్ర విభజనకు ముందు రూ.6,500 మాత్రమేనని అది వివరించింది. విజన్ ఎజెండా ప్రకారం వ్యవస్థాగత సర్దుబాట్లు, సామాజిక పరివర్తన ద్వారా మానవాభివృద్ధి సూచీలో మెరుగైన స్థానం సాధిస్తానని ప్రభుత్వం చెబుతోంది.

విద్య, వైద్యం

మానవాభివృద్ధిలో అత్యంత కీలకమైన విద్య, వైద్య రంగాలపై ప్రభుత్వ వ్యయం బాగా పెరగాల్సిన అవసరముందని ఆర్థిక సర్వే అంగీకరించింది. పేదలు, సామాన్య, మధ్య తరగతి ఖర్చులో అత్యధిక భాగం ఈ రెండింటిపైనే వుంటున్నందున ప్రజల జేబుపై భారాన్ని తగ్గించి, ప్రభుత్వ వ్యయాన్ని పెంచాల్సిన అవసరముందని సర్వే పేర్కొంది. ఇప్పటివరకు ఈ దిశలో చెప్పుకోదగిన ఎలాంటి కృషి లేదన్న విషయాన్ని అది గుర్తు చేసింది. పాఠశాల విద్యను మెరుగు పరిచేందుకు ప్రస్తుతం ఉన్న స్కూళ్ల స్థానే మున్సిపల్ స్కూల్ మోడల్‌ను ప్రవేశపెట్టాలని, హాస్టళ్లను రెసిడెన్షియల్ స్కూళ్లుగా మార్చే ప్రక్రియను మరింత జోరుగా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. సర్వే కూడా దీనికే వంతపాడింది. ఆరోగ్య రంగంలో సేవలను మెరుగుపరిచేందుకు, కనీస ప్రాథమిక సదుపాయాల కల్పనలో రాష్ట్రం ఇప్పటికీ వెనుకబడే ఉందని సర్వే అంగీకరించింది. సంతోష సూచీలో భారత్ 122వ ర్యాంకులో ఉండగా, రాష్ట్రం 74వ ర్యాంకులో ఉంది.

వ్యవసాయం

వ్యవసాయ ప్రధానమైన మన రాష్ట్రం ఈ రంగంలో సుస్థిర అభివృద్ధి సాధనలో విఫలమైన మాట నిజమేనని సర్వే అంగీకరించింది. రాష్ట్రాన్ని కరువు రహితంగాను, వ్యవసాయం లాభసాటిగాను వుండాలంటే రైతు పండించే పంటకు గిట్టుబాటు ధర కల్పించడం, తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు సాధించేలా ప్రోత్సాహకాలు ఉండాలని సూచించింది. పాడి పరిశ్రమ, కోళ్ల పరిశ్రమ పశుపోషణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది. వ్యవసాయ అనుబంధ రంగమైన మత్స్య పరిశ్రమ బాగానే ఉందని, రాష్ట్ర జిడిపిలో దీని వాటా 6.4 శాతం దాకా ఉందని, ఈ రంగంపై ఆధారపడి 14.5 లక్షల మంది ఉపాధి పొందుతున్నారని ఆర్థిక సర్వే పేర్కొంది.



SOCIO ECONOMIC SURVEY 2017-18

PLANNING DEPARTMENT
GOVERNMENT OF ANDHRA PRADESH

పారిశ్రామిక రంగం

పారిశ్రామిక రంగ అభివృద్ధి వ్యవసాయ రంగంలో సాధించే అభివృద్ధిపైనే ప్రధానంగా ఆధారపడి ఉందని తెలిపింది. పారిశ్రామిక రంగంలో స్తబ్దత నెలకొనడంపై సర్వే ఆందోళన వ్యక్తం చేసింది. సంఘటిత రంగంలోఉపాధి కల్పిస్తున్న ప్రధాన రంగాల్లో సేవల రంగం ఒకటని సర్వే తెలిపింది. ఈ రంగంపై మరింత దృష్టి సారించాల్సిన అవసరముందని అభిప్రాయపడింది. అలాగే నిర్మాణ రంగం మరీ ముఖ్యంగా గృహ నిర్మాణ రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం అవసరమని సూచించింది. రియల్ ఎస్టేట్ రంగం ఇప్పటికీ పూర్తిగా పుంజుకోని విషయాన్ని గుర్తు చేసింది. ఈ పరిస్థితికి జిఎస్టీ కూడా ఒక ముఖ్య కారణమని తెలిపింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి ప్రభుత్వం రూ. వంద కోట్ల కార్పస్ ఫండ్‌తో ఎంఎస్‌ఎంఇ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసింది. మార్కెటింగ్, బ్రాండింగ్, నైపుణ్యాభివృద్ధి, ఉత్పత్తుల నాణ్యత పెంచేందుకు ఇది తోడ్పడుతుందని తెలిపింది.

పెట్టుబడులు

విశాఖలో గత మూడేళ్లలో వరుసగా మూడు భాగస్వామ్య సదస్సులు నిర్వహించడం వల్ల రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావ రణం ఏర్పడిందని, పెట్టుబడుల్లో పురోగతి ప్రోత్సాహకరంగానే ఉందని ఈ సర్వే తెలిపింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో చేపట్టిన మెగా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కారిడార్ 'చెన్నయి- బెంగళూరు ఇండస్ట్రియల్ కారిడార్' ఒకటి. భారత ప్రభుత్వ ప్రతిపాదిత 800 కిలోమీటర్ల తూర్పు పారిశ్రామిక కారిడార్‌తో విశాఖ-చెన్నయి ఇండస్ట్రియల్ కారిడార్‌ను అనుసంధానిస్తే ఆగ్నేయాసియాలోనే ఇది అతి పెద్ద కారిడార్ అవుతుందని సర్వే పేర్కొంది.

నీటి పారుదల రంగం

రాష్ట్రంలోని 29 నీటి పారుదల ప్రాజెక్టులను ప్రాధాన్యత ప్రాతిపదికన పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కరువు పీడిత రాయలసీమ, ప్రకాశం జిల్లాలు, వెనుకబడిన శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నీటి పారుదల సౌకర్య కల్పనకు అధిక ప్రాధాన్యమివ్వాలని సర్వే పేర్కొంది. ప్రభుత్వ ప్రాధాన్యతల్లో పోలవరం, బిఆర్‌ఆర్ వంశధార(రెండోదశ), సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి ప్రాజెక్టు, పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు, గుండ్లకమ్మ, జిఎన్‌ఎస్ఎస్ మొదటి, రెండవ దశతో సహా 57 ప్రాజెక్టులు (28 ప్రధాన, 18 మధ్య తరహా, 4 ఫ్లడ్ బ్యాంక్స్, ఏడు ఆధునికీకరణ ప్రాజెక్టులు) పూర్తయితే 48,433 లక్షల ఎకరాలు కొత్తగా ఆయకట్టు కిందకి వస్తాయని సర్వే తెలిపింది. ప్రధాన, మధ్య తరహా ప్రాజెక్టుల కింద 24.196 లక్షల ఎకరాల స్థిరీకరణకు ఇది అదనమని సర్వే పేర్కొంది.

సంక్షేమం

అభివృద్ధిలో అందరికీ భాగస్వామ్యం అన్న కల సాకారానికి సంక్షేమ రంగం నిర్లక్ష్యానికి గురైన విషయాన్ని ఆర్థిక సర్వే అంగీకరించింది. ఈ రంగంపై ఇప్పటికైనా శ్రద్ధ పెట్టాలని అది సూచించింది. ఈ రంగంపై రూ. 60 వేల కోట్లు వెచ్చించినా ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతుల్లో ఎలాంటి మార్పూ లేదని సర్వే తెలిపింది. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, పరిశ్రమలు తదితర రంగాల్లో రాణించేందుకు వినూత్న ప్రక్రియ చేపట్టాలని సర్వే సూచించింది. ప్రతి కుటుంబానికీ నెలకు రూ. 10వేల ఆదాయం నికరంగా వచ్చేలా చూసినప్పుడే వారి జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొంది.


ఎన్నికల పద్దే

పిడిఎఫ్ ఎమ్మెల్సీలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల బడ్జెట్‌గా పేర్కొనవచ్చని పిడిఎఫ్ ఎమ్మెల్సీలు విఠపు బాలసుబ్ర హ్మణ్యం, బొడ్డునాగేశ్వరరావు, యండవల్లి శ్రీనివాసరెడ్డి, రాము సూర్యారావులు అభిప్రాయ పడ్డారు. గురువారం అసెంబ్లీ మీడియా పాయింట్ లో వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలు, దీర్ఘకాల లక్ష్యాల కన్నా తాత్కాలిక అవసరాలకు ప్రాధాన్యత నివ్వడంచూస్తుంటే ఇది ఖచ్చితంగా రాబోవు ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పెట్టిన బడ్జెట్‌గా చూడవచ్చన్నారు. కేంద్రం రాష్ట్రానికి ఇతోధికంగా చేసే సహాయం మీద ఆదారపడి ఉంటుందని, ఆశించిన స్థాయిలో సహాయం అందకపోతే బడ్జెట్‌లోని అంకెలు తారు మారయ్యే అవకాశాలు లేక పోలేదని వారు అభిప్రా యపడ్డారు. 22శాతం కంటే తగ్గిన ప్రతి పద్దు ప్రభుత్వ నిరాదరణకు గురయినట్లు భావించవ చ్చన్నారు. ముఖ్యంగా వ్యవసాయం తదితర రంగాలకు సంబందించి ఎకనామిక్ సర్వే సెస్‌కు 19.08శాతం మాత్రమే పెరిగిందే తప్ప బడ్జెట్ పెరిగిన శాతం వీటిలో పెరగలేదని అర్థం చేసుకోవ చ్చన్నారు. సోషల్ సర్వీసెస్ విద్య, సాంఘిక సంక్షేమంలో కేటాయింపులు 30.92శాతం పెరిగిం దన్నారు. బడ్జెట్ మొత్తం సంక్షేమం వైపునకు మొగ్గు చూపినట్లుగా అర్థం చేసుకోవచ్చని తెలిపారు. మొత్తం బడ్జెట్‌లో గృహనిర్మాణరంగం గతేడాది రూ.1456 కోట్లు కేటాయిస్తే, ఈ బడ్జెట్ లోరూ.3679 కోట్లకు పెంచారు. రుణమాఫీకి గతేడాది రూ.3600 కేటాయింపులు ఉండగా ఈ ఏడాది రూ.4100 కోట్లకు కేటాయింపులు పెంచారు. వ్యవసాయ రంగానికి ఆ మోతాదులో కేటాయింపులు పెరగలేదన్నారు. గిరిజనులకు ఫుడ్ బాస్కెట్‌కు గత ఏడాదిలో నిధులు కేటాయించ లేదని, ఈ బడ్జెట్‌లో రూ.40 కోట్లు కేటాయించాడం మంచి పరిణామ మన్నారు. 9వతరగతి పిల్లలకు ఇచ్చే సైకిళ్లను ఈ బడ్జెట్‌లో 8వతరగతి విద్యార్థులకు ఇవ్వాలని పేర్కొనడాన్ని ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం మోడల్ హైస్కూల్స్‌కు నిధులు నిలిపి వేసిందని, రాష్ట్ర ప్రభుత్వం రూ.377 కోట్లు కేటా యించడం సానుకూల అంశంగా అభివర్ణించా రు. పాఠశాలలకు మరుగుదొడ్ల నిర్వహణకు గతేడాది 20 కోట్లు ఇవ్వగా ఈఏడాది రూ.100 కోట్లు కేటా యించడాన్ని మంచి పరిణామంగా భావిస్తు న్నామన్నారు. ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు మాట్లాడుతూ బడ్జెట్ సంక్షే బడ్జెట్‌గా పేర్కొన్నారు. పాఠశాల విద్య విషయానికి వస్తేబడ్జెట్‌లో నిధులు విషయానికి వస్తే యువజన పాలసీకి గతేడాది నిధులు రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ నేటికీ యువజన పాలసీ తయారు చేయకపోవడాన్ని ప్రశ్నించారు. ఈ ఏడాది వెయ్యి కోట్లు నిధులు కేటాయించినప్పటికీ ఖర్చు చేస్తారా లేదా అనే అనుమానం కలుగుతోందన్నారు. ప్రభుత్వ ఖాళీలు తప్పని సరిగా పూర్తి చేస్తామనిపేర్కొనపోవడం విచిత్రంగా ఉందన్నారు. ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, వెలుగొండ, హంద్రీనీవా, గాలేరు- నగరి ప్రాజెక్టులకు నిధులు కేటాయింపులు పెంచాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్సీ రాము సూర్యారావు మాట్లాడుతూ అంకెల బడ్జెట్ కాకుండా ఆచరణ బడ్జెట్‌గా నిదులు ఖర్చు చేయాలని కోరారు.

ఆశా వర్కర్లకు గౌరవ వేతనం పెంచాలి
ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు




ఆశా వర్కర్లకు గౌరవ వేతనం పెంచాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు కోరారు. గురు వారం శాసన మండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఆశావర్కర్ల సమస్యలను ఆయన మండలి దృష్టికి తెచ్చారు. గౌరవ వేతనం చెల్లించడంలో, వారి సమస్యలు పరిష్కరించడంలోనూ నిర్లక్ష్యంగా వ్యవరి స్తోందన్నారు. ఉద్యోగ భద్రత కల్పించడంలోనూ వైఫల్యం చెందిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో సుమారు 40వేల మందికి పైగా ఆశావర్కర్లు గ్రామ స్థాయిలో గర్భవతులు, బాలింతలు, పసిపిల్లల సంరక్షణతో పాటు 26 రకాల సేవలు గత 12 సంవత్సరాలుగా అందిస్తున్నారన్నారు. ఇంత విశేషమైన సేవలందిస్తున్న ఆశావర్కర్లకు ఎటువంటి వేతనాలు లేకుండా అరకొరా పారితోషకాలు మాత్రమే అందిస్తున్నారన్నారు. అవి కూడా సక్రమంగా చెల్లించడం లేదన్నారు. ఈ నేపథ్యంలోనే గురువారం చలో అసెంబ్లీ కార్యక్రమం చేపట్టార న్నారు. కేరళ, కర్నాటక, హర్యానా, బెంగాల్, త్రిపుర, తెలంగాణ రాష్ట్రాల్లో పారితోషికాలతో పాటు గౌరవ వేతనాలు కూడా చెల్లిస్తున్నారన్నారు. నెలకు రూ. 6వేలు గౌరవ వేతనంతో పాటు పారితోషిక బకాయిలు చెల్లించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

గ జీన ది? ల్లో పొగడ్తల పర్వం

-అసెంబ్లీలో సిఎం, బిజెపి నేతల తీరు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర మంత్రి వర్గానికి టిడిపి మంత్రులు రాజీనామా చేయడంతో రాష్ట్రంలో బిజెపికి చెందిన కామినేని శ్రీనివాసరావు, పైడికొండల మాణిక్యాలరావు తమ మంత్రి పదవులకు రాజీనామా చేశారు. ఈ సందర్భంగా రాజీనామాల అంశం సభలో చర్చకు వచ్చింది. రాజీనామా చేసిన కామినేని, మాణిక్యాలరావు సభలో మాట్లాడుతూ సిఎం చంద్రబాబును పొగడ్తలతో ముంచెత్తారు. చంద్రబాబు లేదనిదే రాష్ట్రం అభివృద్ధి చెందేది కాదన్నారు. అనంతరం సిఎం చంద్రబాబు మాట్లాడుతూ బిజెపి మంత్రులు పూర్తి సమర్థతతో పని చేశారంటూ పొగడ్తలు గుప్పించారు. రాష్ట్ర ప్రజల కోసం అందరూ సమిష్టిగా పని చేయాలని, రాష్ట్రానికి నష్టం జరుగుతున్నప్పుడు మీరు కూడా నిలబడి పోరాడాలని బిజెపి నాయకుల్ని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. చట్టంలోని అంశాలు, రాజ్యసభలో ఇచ్చిన హామీలు నెరవేరుస్తామంటేనే బిజెపితో కలిసి ఎన్నికలకు వెళ్లామన్నారు. ఇప్పుడు నిబంధనలు అడ్డొస్తున్నాయని కథలు చెబుతున్నారని చంద్రబాబు పేర్కొన్నారు. 29 సార్లు ఢిల్లీ చుట్టూ తిరిగానన్నారు. ప్రత్యేక హోదాలో ఏ ముంటే అవన్నీ ఇస్తామంటేనే తాను స్పెషల్ ప్యాకేజీకి అంగీకరించానని చెప్పారు. హోదా ఉన్న రాష్ట్రాలకు 90 శాతం కేంద్ర నిధులు ఇస్తుంటే రాష్ట్రానికి మాత్రం ఇఎపి, నాబార్డు నుంచి నిధులు ఇస్తామన్నారని సిఎం తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని, బిజెపి వెంట నడిచామని, ఆ పార్టీ కూడా అదే విధంగా వ్యవహరించడం సరైంది కాదన్నారు. జాతీయ పార్టీలంటే ప్రజల్లో నమ్మకం పోయే పరిస్థితి నెలకొందన్నారు. ఢిల్లీలో కేంద్ర ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బుధవారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో చేసిన వ్యాఖ్యలు బాధించాయని, తామేమీ గొంతెమ్మ కోర్కెలు కొరలేదన్నారు.



డ్వాక్రా సభ్యులకు రూ.2000 కోట్లు : సిఎం

రుణమాఫీలో భాగంగా డ్వాక్రా సంఘాల సభ్యులకు రూ.2 వేల కోట్లు విడుదల చేస్తున్నట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలకు అభినందనలు తెలిపారు. సభలో ఆయన మాట్లాడుతూ మహిళలు ఆకాశమే హద్దుగా ముందుకు సాగుతున్నారని చెప్పారు. టిడిపి ప్రభుత్వం మహిళలకు ఎప్పుడూ అండగా ఉంటుందని, అనేక సంక్షేమ పథకాల్ని అమలు చేస్తోందని చెప్పారు. మహిళలకు స్థానిక సంస్థల్లో 50 శాతం, ఉద్యోగాల్లో 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నామన్నారు. శిశుమరణాల్ని నివారించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎనీమియా, పోషకాహార నివారణకు స్థానిక సంస్థలు ముందుకు రావాలన్నారు. శానిటరీ నాప్‌కిన్స్‌కు రూ.120 కోట్లు ఖర్చు చేసి ఉచితంగా అందిస్తున్నామని చెప్పారు. వివాహం జరిగే రోజునే ఎస్టీ, మైనారిటీ ఆడబిడ్డలకు రూ.50వేలు, ఎస్సీలకు రూ.40 వేలు, బిసిలకు రూ.35 వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు.



చంద్రబాబుతోనే అభివృద్ధి: కామినేని

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమయ్యిందని కామినేని శ్రీనివాస్ అన్నారు. తాను మంత్రిగా ఎటువంటి అవినీతికీ పాల్పడలేదని, కొందరు తనపై బురద జల్లే కార్యక్రమం చేపట్టారన్నారు. మంత్రి పదవికి రాజీనామా సమర్పించిన సందర్భంగా సభలో మాట్లాడుతూ తాను ఎవరి దగ్గరా డబ్బు తీసుకోలేదని, ఇదే విషయాన్ని శుక్రవారం కాణిపాక వినాయకుడి దేవస్థానంలో కూడా ప్రమాణం చేస్తానన్నారు. మంత్రి పదవిలో ఉండగా చేసిన కొన్ని పనులు సంతృప్తినిచ్చాయన్నారు. సిఎం చంద్రబాబుతోపాటు, సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు పూర్తి సహకారాన్ని అందించారన్నారు.

మోడీ, వెంకయ్యలు ద్రోహులు కాదు: పైడికొండల



రాష్ట్ర విభజన వల్లే ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనిస్తోందని పైడికొండల మాణిక్యాలరావు తెలిపారు. రాజీనామా అనంతరం ఆయన సభలో మాట్లాడుతూ ప్రధాని మోడీ, వెంకయ్యనాయడు ద్రోహులు కాదని, రాష్ట్రానికి బిజెపి శత్రువు కాదని చెప్పారు. దేవాదాయ శాఖలో ఉన్న అవినీతిని నిర్మూలించడానికి ప్రయత్నం చేశానన్నారు. సిఎం ఆవేదనతో తాను ఏకీభవిస్తున్నానని, రాష్ట్రాభివృద్ధికి బిజెపి కట్టుబడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

అనంతపురం హైవేకి నిధులేవీ?

రోడ్లు, భవనాలు, రవాణాకు నామమాత్రమే



2016-2017 కేటాయింపులు రూ. కోట్లలో..			
విషయం	2017-18 అంచనా	ఖర్చు	2018-19 అంచనా
రవాణా శాఖ	191.38	200.11	207.66
ఆర్ అండ్ బి 3849		3829	4495
కొత్త రైల్వే లైన్లకు	84.40	200	100
ఎపిఆర్‌డిసికి సాయం	-	-	240
మేజర్ జిల్లా రోడ్లు	రూ.204 కోట్లు	రూ.372 కోట్లు	రూ.341 కోట్లు
రాష్ట్ర రహదారులకు రూ.500 కోట్లు		రూ.400 కోట్లు	రూ.250 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధానిని రా యలసీమను అను సం ధానం చేసేందుకు ప్రతిష్టాత్మకంగా చేపట్ట నున్న అమరావతి- అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేకి రాష్ట్ర బడ్జెట్‌లో స్థానం దక్కలేదు. చంద్రబాబు పదే పదే జపిస్తున్న ఈ ప్రాజెక్టుకు అసలు కేటాయింపులే లేకపోవడంతో ప్రాజెక్టు పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది. హైవే ప్రాజెక్టుకు ఇప్పటి వరకూ కొన్ని ప్రాంతాల్లోనే భూ సేకరణ పూర్తయింది. మరికొన్ని ప్రాంతాల్లో అసలు భూ సేకరణకే నోచలేదు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ప్రాజెక్టును ప్రభుత్వం విస్మరించే పనిలో ఉందన్న విమర్శలూ వ్యక్తమవుతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా అనంతపురం, కడప జిల్లాల వారికి రాజధానిని చేరుకోవడం సులువు అవుతుందనుకున్నది కలగానే మిగిలిపోనుంది.

రవాణా శాఖకు గతేడాది బడ్జెట్‌లో రూ.191.38 కోట్లు కేటాయించగా, రూ.200.11 కోట్లు ఖర్చు చేశారు. ఈ ఏడాది నామమాత్రంగా రూ.207.66 కోట్లు కేటాయించారు. రహదారి భద్రతకు కేవలం రూ.10 కోట్లు మాత్రమే కేటాయించారు. దీంతో రహదారి భద్రత నీరుగారనుంది. రోడ్లు, భవనాలకు గతేడాది రూ.3849 కోట్లు కేటాయించగా, రూ.3829 కోట్లు ఖర్చు చేశారు. ఈ బడ్జెట్‌లో రూ.4495 కోట్లను కేటాయించారు. ఎపిఆర్‌డిసికి సాయంగా రూ.240 కోట్లు, కొత్త రైల్వే లైన్ల నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం వాటాగా రూ.100 కోట్లు, ఎపిఆర్‌డిసి పరిధిలోని రాష్ట్ర హైవేలకు రూ.250 కోట్లు, కోర్ నెట్‌వర్క్‌రోడ్లకు రూ.230 కోట్లు కేటాయించారు.

ఉపయోగం లేని కేటాయింపులే

రవాణా, రోడ్లు, భవనాల బడ్జెట్‌లో చాలా వరకూ అన్నీ ఉపయోగం లేని కేటాయింపులే. రవాణా రంగాన్ని ప్రభుత్వం ప్రధాన్యతా రంగంగా గుర్తించలేదు. హంగుల కోసమే కేటాయింపులు చేశారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమానికి కూడా నిధులు కేటాయించలేదు. రోడ్ల అభివృద్ధికి కేటాయించిన నిధులు ఏమాత్రం సరిపోవు. రహదారి భద్రతకు కూడా ఎప్పటిలాగా అరకొర నిధులే కేటాయించారు.

- జిలానీ బాషా, ఈశ్వర్‌రావు,
రవాణా రంగ నిపుణులు

భూములు తీసుకుని పనులు ప్రారంభించకపోతే నోటీసులు

అసెంబ్లీలో మంత్రి నారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాజధాని అమరావతిలో సంస్థలు ఏర్పాటు చేస్తామని చెప్పి భూములు తీసుకుని ఇంకా పనులు ప్రారంభించని వారికి నోటీసులిచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా గురువారం జరిగిన క్వశ్చన్ అవర్‌లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రావణకుమార్ అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. మొత్తం 12 ప్రభుత్వ సంస్థలకు గాను 287 ఎకరాల భూమిని కేటాయించామన్నారు. 14 ప్రైవేటు సంస్థలకు 973 ఎకరాలు ఇచ్చామన్నారు. ఇందులో 673 ఎకరాలకు అగ్రిమెంట్ అయ్యిందని, మిగిలిన 300 ఎకరాలు నిబంధనల మేరకు ఇస్తామన్నారు.

సాధికార మిత్రలకు గౌరవ వేతనం : మంత్రి సునీత

రాష్ట్రంలో సుమారు 3.41 లక్షల సాధికార మిత్రలను నియమించినట్లు ఎమ్మెల్యే జివి ఆంజనేయులు అడిగిన ప్రశ్నకు మంత్రి పరిటాల సునీత సమాధానం ఇచ్చారు. సభ్యుల సూచన మేరకు వారికి గౌరవ వేతనం ఇచ్చే అవకాశాన్ని పరిశీలిస్తున్నామన్నారు. ఎమ్మెల్యేలు రామానాయుడు, మృణాళిని, అనితల సూచనలను పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

త్వరలోనే చేనేత బోర్డు: మంత్రి అచ్చెన్నాయుడు

చేనేత కార్మికులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాల్ని ప్రవేశ పెడుతోందని, త్వరలోనే చేనేత బోర్డును ఏర్పాటు చేసే అంశం కూడా ప్రభుత్వ దృష్టిలో ఉందని ఎమ్మెల్యేలు ఆలపాటి రాజేంద్రప్రసాద్, వర్మ, జయ నాగేశ్వరరెడ్డి, సూర్యనారాయణ, విప్ పల్లె అడిగిన ప్రశ్నలకు బిసి సంక్షేమ శాఖా మంత్రి కె.అచ్చెన్నాయుడు సమాధానం చెప్పారు. రాష్ట్రంలో సుమారు 8 లక్షల చేనేత కుటుంబాలున్నా కేవలం 2.50 లక్షల మందికే సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ఇప్పటికే 77 వేల మంది పింఛన్లు తీసుకుంటున్నారని, మరో 25 వేలు మంజూరైనా నిబంధనల కారణంగా తీసుకునే వారు లేరన్నారు. తొమ్మిదివేల మందికి రూ.45 కోట్ల మేర ముద్రా పథకం కింద రుణాలిచ్చామన్నారు.

రోడ్ల వెడల్పునకు చర్యలు: మంత్రి అయ్యన్న

గోదావరి జిల్లాల్లో రోడ్ల మరమత్తులతో పాటు వెడల్పు చేయడానికి చర్యలు చేపట్టినట్లు మంత్రి అయ్యన్నపాత్రుడు వివరించారు. ఎమ్మెల్యేలు పెందుర్తి వెంకటేష్, రామకృష్ణారెడ్డి, సూర్యారావులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. సుమారు రూ.509 లక్షలతో 415 కిలోమీటర్ల మేర రోడ్డు మరమత్తు పనులు జరుగుతు న్నాయని తెలిపారు. తూర్పు గోదావరిలో ట్రాన్స్ ట్రాయ్ కంపెనీ రూ.7 కోట్లు తీసుకుని పనులు చేయకుండా వెళ్లిపోయిందన్నారు.

తాండవ నది ఇబ్బందుల్ని తొలగిస్తాం:మంత్రి దేవినేని

తుని, పాయకారావుపేట మధ్య తాండవ నది గేట్లు కుంగిపోయి నదీ ప్రవాహంతో సమీప గ్రామాలకు ఎదురవుతున్న ఇబ్బందుల్ని వెంటనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అనిత అడిగిన ప్రశ్నకు మంత్రి దేవినేని సమాధానమిచ్చారు. గేట్ల పటిష్టతకు సంబంధించి నెల రోజుల్లో టెండర్లు పిలిచి ఆరు నెలల్లో పనులు పూర్తి చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఉప్పుటేరు ద్వారా సుమారు 15 వేల క్యూసెక్కుల నీరు సముద్రంలో వృధాగా కలిసి పోతోందని ఎమ్మెల్యే కాగిత వెంకట్రావు అడిగిన ప్రశ్నకు మంత్రి దేవినేని సమాధానం చెప్పారు. రెగ్యులేటర్ ఏర్పాటు చేసి సముద్రంలోకి కలవ కుండా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యేలు రామాంజనేయులు, నారాయణమూర్తిలు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు.

మహిళా పోలీస్ విభాగం యోచన లేదు: హోంమంత్రి

మహిళల రక్షణ కోసం ప్రత్యేక పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేసే ఆలోచన లేదని హోం మంత్రి చిన రాజప్ప స్పష్టం చేశారు. ఇప్పటికే 1091, 181 టోల్‌ఫ్రీ నెంబర్లు మహిళల కోసం ఉన్నట్లు ఆయన వెల్లడించారు.

1,47,657 ఉద్యోగాలు: మంత్రి కొల్లు రవీంద్ర

నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ఇప్పటి వరకు 51,295 ఉద్యోగాలు, జాబ్ మేళాల ద్వారా 96,362 ఉద్యోగాలు కలిపి మొత్తం 1,47,657 ఉద్యోగాలు రాష్ట్రంలోని నిరుద్యోగులకు వచ్చాయని ప్రభుత్వ చీఫ్ విప్ పల్లె రఘునాథరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి కొల్లు రవీంద్ర సమాధానం చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కిల్ డెవలప్‌మెంట్‌కు 139 కేంద్రాల్ని ఏర్పాటు చేశామన్నారు.



కడప ఉక్కు కోసం ఉద్యమాలు తప్పవు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు కోసం ఉద్యమాలు చేస్తే తప్ప కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసేట్టు లేదని పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ విఠపు బాలసుబ్రహ్మణ్యం విమర్శిం చారు. శాసనమండ లిలో గురువారం జరిగిన ప్రశ్నోత్తరాల్లో ఆయన మాట్లాడుతూ కడప ఉక్కు కర్మాగారం కేవలం రాయలసీమకే కాకుండా యావత్ రాష్ట్రానికే ప్రాణమన్నారు. కర్మాగారం ఏర్పాటుకు కావల సిన అన్ని సదుపాయాలున్నా కేవలం సాంకేతిక కారణాల సాకుతో ఆపేయడం దుర్మార్గమన్నారు. చంద్రన్న విలేజ్ మాల్స్ వల్ల స్థానిక ఉత్పత్తులు, వ్యాపా రులకు తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు. టిడిపి సభ్యులు తిప్పే స్వామి మాట్లాడుతూ నిబంధన లకు విరుద్ధంగా బినామీ పేర్లతో రేషన్ షాపులను నడుపుతు న్నారని, అధికార్లకు ఫిర్యాదులు చేసినా ఫలి తం ఉండ టం లేదని అన్నారు. కర్నాటక బోర్డర్‌లో ఈ అవకత వకలు ఎక్కువుగా ఉంటున్నా యన్నారు.

పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్
విఠపు బాలసుబ్రహ్మణ్యం



శ్రీసిటీలో స్థానిక ఉద్యోగులు 5 శాతమే

నెల్లూరు-చిత్తూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన శ్రీ సిటీలో స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో నిర్లక్షంగా వ్యవహరిస్తున్నారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి శ్రీనివాసుల రెడ్డి విమర్శించారు. శ్రీసిటీలో ప్రస్తుతం ఉన్న ఉద్యోగుల్లో కేవలం 5 శాతం మంది స్థాని కులు ఉన్నారన్నారు. స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో వైఫల్యానికి ఇంత కంటే నిదర్శనం మరొకటి ఉండదన్నారు. నిబంధనల మేరకు 25 శాతం స్థానికులకు ఉద్యోగాలి వ్వాలని, దీని అమలు చేయడానికి చర్యలు తీసు కుంటామని మంత్రి అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో ఇంక్యుబేష్ కేంద్రాలను ఏర్పాటు చేయాల్సి ఉందని, అదనంగా వీటి సంఖ్యను కూడా పెంచేందుకు చర్యలు తీసుకుంటామని టిడిపి సభ్యులు ఎంవివిఎస్ మూర్తి అడిగిన ప్రశ్నకు మంత్రి సోమిరెడ్డి బదులిచ్చారు.

పిడిఎఫ్ ఎమ్మెల్సీ యండపల్లి

ప్రత్యేకహోదా కోసం

13న జెఏసి ర్యాలీలు

ప్రజాశక్తి-ఒంగోలుటౌన్

ఎపికి ప్రత్యేక హోదా, విభజన చట్టంలోని హామీలను కేంద్రం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ 13న జిల్లా కేంద్రాలలో జెఎసి ఆధ్వర్యంలో ప్రదర్శనలు, సభలు నిర్వహించాలని యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్యాప్టో చైర్మన్ పి.బాబురెడ్డి పిలుపునిచ్చారు. ఒంగోలులోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విభజన చట్టంలో 13వ షెడ్యూల్‌లో చేర్చిన 11 జాతీయ విద్యాసంస్థలను ఎపిలో నెలకొల్పాల్సి ఉందన్నారు. వీటికోసం రూ.11370 కోట్లు అవసరం కాగా కేవలం రూ.4021 కోట్లు కేటాయించారని విమర్శించారు. 13న సాయంత్రం వేళలో ప్రదర్శనలు, సభలు నిర్వహించాలన్నారు.



రైతు, కౌలు రైతుల సంఘం నేతలతో చర్చలు జరుపుతున్న మంత్రి సోమిరెడ్డి చంద్ర మోహన్‌రెడ్డి

వ్యవసాయ మంత్రి ఇంటి వద్ద కౌలు రైతుల ధర్నా

నష్టపరిహారానికి హామీ

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ ప్రతినిధి

నకిలీ మిర్చినారుతో నష్టపోయిన కృష్ణాజిల్లా గంపలగూడెం మండలం పెనుగొలను, ఊటుకూరు గ్రామాల రైతులకు పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఎపి కౌలు రైతుల సంఘం ఆధ్వర్యాన గురువారం విజయవాడ పటమటలంకలోని వ్యవసాయశాఖ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహనరెడ్డి ఇంటి వద్ద ధర్నా నిర్వహించారు. తమకు నష్టపరిహారం చెల్లించాలని పెద్దపెట్టున నినాదాలు చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు నాగబోయిన రంగారావు, పి.జమలయ్య, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు రైతుల సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నష్టపోయిన పంటలను జిల్లా కలెక్టర్, వ్యవసాయ శాస్త్రవేత్తలు పరిశీలించి నకిలీ మిర్చి నారు వల్లే కౌలు రైతులు పంట నష్టపోయారని నిర్ధారించిన విషయాన్ని గుర్తుచేశారు. దీంతో మంత్రి కౌలు రైతులను తన కార్యాలయంలో చర్చలకు ఆహ్వానించారు. పరిహారం చెల్లింపుతోపాటు నర్సరీ యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీనిపై త్వరలో జిల్లాకు చెందిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. దీంతో రైతులు ధర్నా విరమించారు. కార్యక్రమంలో సంఘం పశ్చిమ కృష్ణా కార్యదర్శి ఎన్.నరసింహా, వ్యవసాయ కార్మిక సంఘం పశ్చిమకృష్ణా కార్యదర్శి కె.కళ్యాణ్, బాధిత రైతులు బి.పూర్ణ, వి.మాధవరావు, డి.నాగార్జున, ఎం.శ్రీను, ఎల్.మురళీ తదితరులు పాల్గొన్నారు.

ఐదు గంటలు రోడ్డుపైనే

బైఠాయించిన ఆశా వర్కర్లు

- దిగొచ్చిన అధికారులు
- పోలీసులకు, నాయకులకు మధ్య తోపులాట
- సొమ్మసిల్లిన ఆశావర్కర్లు
- పలు చోట్ల అక్రమ అరెస్టులు



విజయవాడ ధర్నాచౌక్‌లో ఆశాల నిరసనను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశావర్కర్లు విజయవాడలో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఐదుగంటలపాటు మండుటెండలో నడిరోడ్డుపైనే బైఠాయించారు. వర్కర్ల ఆందోళనను భగ్నం చేసేందుకు పోలీసులు ప్రయత్నించగా తోపులాట జరిగింది. ఈ సందర్భంగా నాయకులు సుబ్బరావమ్మ, ఆర్.వి.నరసింహారావు, ఎ.వెంకటేశ్వర రావు తదితరులను పోలీసులు అరెస్టు చేశారు. పట్టు విడవకుండా రోడ్డపైనే బైఠాయించడంతో అధికారులు దిగివచ్చారు. మెడికల్ అండ్ హెల్త్ డైరెక్టర్ శారద, ఫ్యామిలీ వెల్ఫేర్ జాయింట్ కమిషనర్ ప్రమిలా, ఆశా వర్కర్స్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగమల్లేశ్వరి తదితరులు ఆలంకార్ సెంటర్లో రోడ్డుపై బైఠాయించిన ఆశా వర్కర్ల వద్దకు వచ్చి మాట్లాడారు. ఏప్రిల్ 10వ తేదీలోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి సమస్యలు పరిష్కరిస్తామని హామీనిచ్చారు. వివిధ బకాయిపడ్డ వేతనాలను కూడా చెల్లిస్తామని హామీనిచ్చారు. దీంతో ఆందోళన విరమించారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే భవిష్యత్‌తో ఆందోళన ఉధృతం చేస్తామని ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) రాష్ట్ర కమిటీ ప్రకటించింది.

ధర్నా సమయంలో వేసవి తాపాన్ని తట్టుకోలేక వివిధ జిల్లాలకు చెందిన ఏడుగురు మహిళలు స్పృహ తప్పారు. అలంకార్ సెంటర్‌కు చేరుకోవడానికి ముందు వర్కర్లు రైల్వేస్టేషన్ వద్ద బైఠాయించారు. ఆశా వర్కర్స్ యూనియన్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి మాట్లాడుతూ మహిళల ఉద్ధరణ గురించి గొప్పగా మాట్లాడే ప్రభుత్వం కష్టపడి పనిచేస్తున్న మహిళలకు అన్యాయం చేస్తోందని తెలిపారు. పొరుగున్న తెలంగాణాలో ఆరువేలు, కేరళలలో 7500, హర్యానాలో రూ.4500 ఇస్తున్నారని, ఇక్కడ మాత్రం ఇవ్వడ లేదని అన్నారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.స్వరూపరాణి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం కార్మికులు, ఉద్యోగుల పట్ల నిరంకుశ వైఖరి అనుసరిస్తోందని అన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందన్నారు. నాయకులు ఎన్‌సిహెచ్.శ్రీనివాస్, ముజఫర్, ఎ.కమల, శ్యామలారాణి, శ్రీలక్ష్మి, సిహెచ్.పద్మ తదితరులు ప్రసంగించారు.

ఆశా వర్కర్లపై నిర్బంధాన్ని ఖండించండి

తమకు నెలకు రూ.6 వేల వేతనం ఇవ్వాలని మరియు ఇతర కోర్కెలను పరిష్కరించాలని కోరుతూ ఈ రోజు విజయవాడలో చేపట్టిన రాష్ట్రవ్యాప్త ర్యాలీపై ప్రభుత్వం నిర్బంధం విధించడానికి సిఐటియు రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నరసింగరావు, ఎం.ఎ.గఫూర్ ఖండించారు. జిల్లాలలో బయలు దేరిన ఆశా వర్కర్లను ముందుగానే పోలీసులు అరెస్టులు చేశారని పేర్కొన్నారు. అయినప్పటికీ వేలాది మంది వర్కర్లు విజయవాడకు చేరుకొని అలంకార్ ధర్నా సెంటర్ వద్ద బైటాయించారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలని యూనియన్ నాయకత్వంతో చర్చలు జరిపి వారి కోర్కెలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలని కోరారు.

ఆశాల అక్రమ అరెస్టులు

తమ న్యాయమైన కోర్కెల కోసం విజయవాడలో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న ఆశా కార్యకర్తలపై లాఠీఛార్జీ చేసి అరెస్టు చేయడంపై పశ్చిమగోదావరి జిల్లాలో మహిళా సంఘాలు భగ్గుమన్నాయి. జిల్లా వ్యాప్తంగా మహిళలు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా పాలకోడేరులో చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అడ్డుకుని పోలీసు స్టేషన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. భీమవరంలో టౌన్ రైల్వే స్టేషను వద్ద ఆశా కార్యకర్తలను పోలీసులు అడ్డగించి టూటౌన్‌కు తరలించడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏలూరులోనూ ఆశా కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనను సిఐటియు ఖండించింది. జంగారెడ్డి గూడెంలో అరెస్టులను నిరసిస్తూ స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద మహిళా, ప్రజాసంఘాల నాయకులు ధర్నా చేశారు. తూర్పుగోదావరి జిల్లాలో పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మండపేట మండలం ద్వారపూడి రైల్వేస్టేషన్ వద్ద ఆశావర్కర్లను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో గురువారం తెల్లవారుజామున రెండు గంటలకు విశాఖ జిల్లా పెందుర్తి శాఖ ఆశా వర్కర్స్ యూనియన్ మండల అధ్యక్షులు ఎస్.పద్మతో పాటు 66 మంది ఆశావర్కర్ల అరెస్టు చేసి రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కంచికచర్లలో 30 మందిని అరెస్టు చేశారు. గుంటూరు జిల్లా మేడికొండూరులో సిపిఎం నాయకులు వడ్ల రామకృష్ణను అర్ధరాత్రి అక్రమంగా అరెస్టు చేశారు.

'పోలీస్'కు రూ.6,226 కోట్లు...!

ఇకపై మహిళా పోలీస్ వాలంటీర్స్

హోంగార్డుల ఊసే ఎత్తని ప్రభుత్వం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హోంశాఖకు బడ్జెట్‌లో రూ.6,226 కోట్లు ప్రకటించినా ప్రస్తుత పరిస్థితుల్లో అది సరిపోని పరిస్థితి ఉంది. కీలకమైన ఫోరెన్సిక్ ల్యాబ్, క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ విభాగాలకూ నామమాత్రపు నిధులతో సరిపెట్టారు. చాలా విభాగాలకు అత్తెసరుగానే నిధులు కేటాయించారు. నిర్భయ మహిళా పోలీసు వాలంటీర్స్ కోసం ఈసారి రూ.28.71 కోట్లను కేటాయించడమే బడ్జెట్ విశేషం. పోలీస్ అకాడమీ నిర్మాణం, హోంగార్డుల వేతనాల పెంపు అంశం బడ్జెట్‌లో సూచన ప్రాయంగా కూడా లేకపోవడం గమనార్హం. ఈసారి పోలీస్ సంక్షేమానికీ ప్రాధాన్యత లభించలేదు. సంక్షేమానికి కేవలం రూ.9.69 కోట్లనే కేటాయించారు. నేరాల నివారణలో ఎంతో కీలకమైన క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ (సీసీటీఎన్)కు కేవలం రూ.20.70 కోట్లనే కేటాయించటం గమనార్హం. మొత్తం కేటాయింపుల్లో రూ.3,396 కోట్లను జిల్లా పోలీస్ బలగాలకే చూపించారు.కొత్త రాజధానిలో వీవీఐపీల పర్యటనలు, ప్రత్యేక కార్యక్రమాల బందోబస్తు విధులు నిర్వహించే సిబ్బందికి ప్రత్యేక భత్యం ఇచ్చేందుకూ అదనపు నిధులు లేవు. పోలీసు కమ్యూనికేషన్స్‌కు రూ.59.16 కోట్లు, ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ (ఎఫ్ఎస్ఎల్)కు రూ.10 కోట్లు మాత్రమే కేటాయించారు. మెరైన్ పోలీసింగ్‌కు రూ. 38.65 కోట్లు మాత్రమే కేటాయించారు.


నిఘా కోసం రూ.263 కోట్లు...

రాష్ట్రంలో నిఘా వ్యవస్థను బలోపేతం చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించింది. నిఘా వ్యవస్థ బలోపేతానికి రూ.263.54 కోట్లు కేటాయించింది. జైళ్ల శాఖకు రూ.169.10 కోట్లు, అగ్నిమాపక శాఖకు రూ.215.28 కోట్లు, ఆక్టోపస్, గ్రేహౌండ్స్‌కు రూ.200 కోట్లు కేటాయించారు. రాష్ట్రంలో కీలకమైన విశాఖ పోలీస్ కమిషనరేట్‌కు రూ.226 కోట్లను ప్రత్యేకంగా కేటాయించటం విశేషం.

గత మూడేళ్లుగా బడ్జెట్ కేటాయింపులు

సంవత్సరం	కేటాయింపులు (కోట్లలో)
2016-17	రూ.4,726
2017-18	రూ.5,221
2018-19	రూ.6,226

నిరాశలో కూరుకుపోయాం..



రాష్ట్ర ప్రభుత్వం గురువారం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో హోంగార్డుల వేతనాల పెంపునకు సంబంధించి కనీసం సూత్రప్రాయ సూచన కూడా లేకపోవడంపై తీవ్ర నిరాశ చెందామని హోంగార్డ్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్ ప్రజాశక్తి వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వులు ప్రకారం మాత్రమే తమ వేతనాలను పెంచమని కోరుతున్నామ న్నారు. ఇతర శాఖల ఉద్యోగులైతే ఆందోళనలో, ధర్నాలో చేసి తమ డిమాండ్లను సాధించుకుం టారని, తమకు ఆ అవకాశం కూడా లేదని కన్నీళ్ల పర్యంతమయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 15 వేల హోంగార్డుల కుటుంబాలను దృష్టిలో ఉంచుకునైనా ముఖ్యమంత్రి చంద్రబాబు తమ జీతాల పెంపును అమలు చేయాలని గోవింద్ కోరారు.

- హోంగార్డ్స్ రాష్ట్ర అధ్యక్షులు గోవింద్

'ఆమె'ను బతకనిద్దాం..

అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో డి.రమాదేవి

ప్రజాశక్తి-యంత్రాంగం



మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం తిరుపతిలో జరిగన సభలో మాట్లాడుతున్న రమాదేవి

సమానత్వం పేరుతో మారాలంటూ ఆడవాళ్ల అభివృద్ధికి అడ్డుగా ఉంటున్న సంప్రదాయాలను విడనాడుదామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమాదేవి పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు నిర్వహించారు. తిరుపతిలోని ఎస్‌వి మెడికల్ కళాశాల ఆడిటోరియంలో ఐద్వా, ఉద్యోగ, ఉపాధ్యాయ జెఎసిల ఆధ్వర్యంలో నిర్వహించిన సభకు రమాదేవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఆడా, మగ ఇద్దరూ సమానమే అయినా స్త్రీ, పురుషుడి కోసమే సృష్టించబడిందని చెబుతూ తరతరాలుగా ఆమెను అణగదొక్కుతున్నారన్నారు. ప్రపంచ దేశాల్లో 1917లో మొట్టమొదటిసారిగా మహిళలకు ఓటు హక్కు ఇచ్చిన నాయకుడు లెనిన్ అని కొనియాడారు. మహిళల హక్కుల సాధనకు ఐద్వా నిరంతరం పోరాడుతూనే ఉంటుందన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు జిల్లా బాపట్లకు చెందిన వికలాంగ యువకుడు బోగిరెడ్డి శ్రీనివాసరెడ్డిని, గుంటూరుకు చెందిన యువతి కుంభా సంధ్య బాపట్ల వెలుగు కార్యాలయంలో వికలాంగ సంఘం, మున్సిపల్ చైర్‌పర్సన్ తదితరుల సమక్షంలో వివాహం చేసుకుంది. ఈ సందర్భంగా 50 మంది వికలాంగుల భార్యలను సన్మానించారు. గుంటూరు రీజియన్ వ్యాప్తంగా ఆర్టీసీలో పనిచేస్తున్న మహిళా సిబ్బందికి ఉత్తమ పురస్కారాలను ఆర్‌ఎం.జ్ఞానంగారి శ్రీహరి అందజేశారు. శ్రీకాకుళంలో ఐద్వా ఆధ్వర్యాన మహిళలు ర్యాలీ నిర్వహించారు.

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో యువజన సంక్షేమ శాఖ, మహిళా శిశు సంక్షేమ శాఖ సంయుక్త ఆధ్వర్యాన వివిధ రంగాల్లో రాణించిన మహిళలను సన్మానించారు. విజయనగరం జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో ఎపి ఎన్‌జిఒ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని కలెక్టర్ వివేక్‌యాదవ్ ప్రారంభించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆనందగజపతి ఆడిటోరియంలో వేడుకలు నిర్వహించారు. జిల్లా కుటుంబ న్యాయస్థానంలో జరిగిన కార్యక్రమంలో ఆ కోర్టు జడ్జి ఇ.భీమారావు ప్రసంగించారు. కర్నూలులో పోలీస్ శాఖ, షీటీమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కె వాక్ కార్యక్రమంలో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఐద్వా నెల్లూరు నగర కమిటీ ఆధ్వర్యంలో 5వ డివిజన్‌లోని వైకుంఠపురంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు.

బిజెపితో వైసిపికి సంబంధాలు లేవు : బొత్స

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

బిజెపితో వైసిపికి ఎటువంటి సంబంధాలు లేవని వైసిని నేత బొత్స సత్యనారాయణ అన్నారు. గుంటూరులో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. బిజెపితో చీకటి ఒప్పందాలు చేసుకునేది చంద్రబాబు నాయుడేనని, బిజెపికి వైసిపికి సంబంధాలు అంటగట్టి రాజకీయంగా లబ్ధిపొందడానికి సిఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. తన రాజకీయ అవసరాల కోసం బిజెపితో పొత్తు పెట్టుకోవడం, ప్రజల్లో వ్యతిరేకత రాగానే మళ్లీ పొత్తు నుంచి బయటపడేందుకు రాష్ట్ర ప్రయోజనాలంటూ కొత్త పల్లవి అందుకోవడం చంద్రబాబుకు కొత్తేమీ కాదన్నారు. ప్రత్యేక హోదా ఇవ్వబోమని 2016లో కేంద్రం చెప్పినప్పుడే ఎన్‌డిఎ నుంచి బయటకు వచ్చి ఉంటే రాష్ట్రానికి మేలు జరిగేదన్నారు. రాష్ట్రానికి నిధులు రాకపోవడానికి చంద్రబాబే కారణమని, తన బ్రాండ్ ఇమేజ్ అంటూ అతిగా ప్రచారం చేసుకోవడం వల్ల నష్టం జరిగిందని అన్నారు. తమ పార్టీ నాయకులు ప్రధాని ఇంటి చుట్టూ తిరుగుతున్నారని చంద్రబాబు చేసిన ఆరోపణ నిజం కాదన్నారు. చంద్రబాబు ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలన్నారు. నాలుగేళ్లలో 29 సార్లు ఢిల్లీ యాత్ర చేసి చంద్రబాబు ఏం సాధించారని ప్రశ్నించారు. ముందుగా ప్రకటించిన విధంగా ఈనెల 21న తమ పార్టీ కేంద్ర ప్రభుత్వంపై అవిశ్వాసం పెడుతుందని, దమ్ముంటే టిడిపి మద్దతు పలికి మోడీ రాష్ట్రానికి చేసిన అన్యాయాన్ని ఎండగట్టాలన్నారు. సంఖ్యాపరంగా బలం లేకున్నా మిగిలిన పార్టీల మద్దతు కూడగడతామన్నారు.

మతోన్మాదుల అరాచకంపై ఆగ్రహం

త్రిపుర ఘటనలపై పలు జిల్లాల్లో వామపక్షాలు, ప్రజాసంఘాల నిరసన

ప్రజాశక్తి యంత్రాంగం

త్రిపురలో బిజెపి., ఆర్ఎస్ఎస్ అరాచకాలను నిరసిస్తూ రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వామపక్షాలు, పలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గురువారమూ ఆందోళనలు కొనసాగాయి. విశాఖలో సిపిఎం జగదాంబ జోన్ కమిటీ ఆధ్వర్యంలో పూర్ణామార్కెట్ నుంచి సరస్వతి పార్కు వరకూ ర్యాలీ నిర్వహించారు. దళిత, గిరిజన ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యాన విశాఖ ఎల్ఐసి కార్యాలయం సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. విశాఖ జిల్లా రాంబిల్లిలో సిపిఎం ఆధ్వర్యాన రాస్తారోకో, కొయ్యూరులో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యాన నిరసన ర్యాలీలను నిర్వహించారు. పశ్చిమగోదావరి చింతలపూడి ఫైర్‌స్టేషన్ వద్ద సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో మతోన్మాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. గణపవరం మండలం అప్పన్నపేటలో సిపిఎం ఆధ్వర్యాన కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. పెనుగొండ గాంధీబొమ్మ సెంటర్‌లో సిపిఎం ఆధ్వర్యంలో, పెనుమంట్ర మండలం బ్రాహ్మణచెర్వులో బిజెపి మతోన్మాద దిష్టిబొమ్మను దహనం చేశారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద వామపక్షాలు, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. సిపిఎం, సిపిఐ, సిపిఎంఎల్ న్యూడెమోక్రసీ, పిడిఎస్‌యు, కెవిపిఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. తిరుపతిలో వామపక్షాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద లెనిన్ మాస్కులు ధరించి నిరసన తెలిపారు. అనంతరం మున్సిపల్ కార్యాలయం నుంచి నాలుగు కాళ్ల మండపం వరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు దడాల సుబ్బారావు, జిల్లా కార్యదర్శి అంగేరి పుల్లయ్య, కందారపు మురళి, సిపిఐ జిల్లా కార్యదర్శి రామానాయుడు, డివైఎఫ్ఐ నాయకులు పాల్గొన్నారు. గుంటూరులోని శంకర్‌విలాస్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో సిపియం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్), ఎంసిపిఐ(యు), మాలమహానాడు, భీమసేన సేవాదళ్, కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా, సిఐటియు, ఆవాజ్ తదితర ప్రజాసంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఎం గుంటూరు తూర్పు జిల్లా కార్యదర్శి పాశం రామారావు మాట్లాడారు. సిపిఎం ఆధ్వర్యంలో పిడుగురాళ్ల, ముప్పాళ్లల్లో ప్రధానమంత్రి దిష్టిబొమ్మను దహనం చేశారు. బాపట్లలో జమ్ములపాలెం ఆర్‌వోబీ సెంటర్లో సీపియం, సిపిఐ, సిఐటియూ ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు.



కాకినాడ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న వామపక్షాలు, దళిత, ప్రజాసంఘాల నాయకులు



లెనిన్ విగ్రహంతో ధర్నాలో పాల్గొన్న చిన్నారి



అమెరికా డ్రోన్ దాడుల్లో గూగుల్‌కూ పాత్ర

అంగీకరించిన కంపెనీ

వాషింగ్టన్ : అమెరికా అక్రమంగా సాగిస్తున్న డ్రోన్ దాడుల కార్యక్రమంలో తాము కూడా సహకరించామని గూగుల్ అంగీకరించింది. ఆ దాడుల లక్ష్యాలను గుర్తించడానికి అవసరమైన సాఫ్ట్‌వేర్‌ను తాము అందించామని గూగుల్ మాతృ సంస్థ ఆల్ఫాబెట్ కంపెనీ స్పష్టం చేసింది. 2009లో అమెరికా డ్రోన్ దాడి కార్యక్రమాన్ని చేపట్టినప్పటి నుండి దాదాపు 3వేల మందిని హతమార్చినట్లు అమెరికా చెప్పుకుంటోంది. డ్రోణ్ దాడిలో లక్ష్యమైన ఒక వ్యక్తితో పాటు 9మంది పక్కవారు కూడా మరణించారని అంతర్గత సైనిక పత్రాల్లో వెల్లడవుతోంది. అంటే దీన్నిబట్టి యెమెన్, సోమాలియా, ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్, ఇరాక్‌ల్లో అమెరికా సైన్యం సాగించిన తీవ్రవాద దాడుల్లో మృతుల సంఖ్య వేల సంఖ్యలోనే వుందని వెల్లడవుతోంది. డ్రోణ్ దాడుల కార్యక్రమంలో గూగుల్ పాత్ర వుండడంతో అమెరికా సైన్యం నేరపూరిత కార్యకలాపాల్లో కూడా దానికి భాగమున్నట్లు స్పష్టమైంది. గత వారం అంతర్గత మెమోలో గూగుల్ ఈ విషయాన్ని ధృవీకరించింది. దీంతో గూగుల్ ఉద్యోగుల్లో ఆగ్రహావేశాలు వ్యక్తమవుతున్నాయి.

సిరియాలో తక్షణమే కాల్పుల విరమణ

ఐక్యరాజ్య సమితి డిమాండ్

ఐక్యరాజ్య సమితి : సిరియాలో తక్షణమే కాల్పుల విరమణను అమలు చేయాలని ఐక్యరాజ్య సమితి డిమాండ్ చేస్తోంది. ఐక్యరాజ్య సమితి చేసిన తీర్మానం 2401ని అమలు చేయాలని పిలుపిచ్చింది. సిరియాలో నెలకొన్న దుర్భర పరిస్థితుల పట్ల భద్రతా మండలి సభ్యులు ఆందోళన వెలిబుచ్చారు. అక్కడ ఘర్షణల విరమణపై చర్చ జరగాలని కోరారు. జనాంతిక చర్చల అనంతరం భద్రతా మండలి అధ్యక్షుడు, ఐరాసలో డచ్ రాయబారి కరేల్ వన్ ఊస్టరామ్ మాట్లాడుతూ పై డిమాండ్ చేశారు. అంతకు మించి సమావేశం వివరాలు వెల్లడించలేదు. ఫిబ్రవరి 24న ఏకగ్రీవంగా ఆమోదించిన 2401 తీర్మానాన్ని అమలు చేయడంలో జరిగిన వైఫల్యాన్ని చర్చించేందుకు తక్షణమే సమావేశం జరగాలని ఫ్రాన్స్, బ్రిటన్‌లు కోరాయి.

నాగాలాండ్ సిఎంగా బాధ్యతలు చేపట్టిన రియో

కొహిమా: ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపితో జట్టు కట్టి విజయం సాధించిన నేషనలిస్ట్ డెమొక్రాటిక్ పీపుల్స్ పార్టీ (ఎన్‌డిపిపి) అధినేత నీఫియు రియో గురువారం ఇక్కడ రాజ్‌భవన్‌లో జరిగిన కార్యక్రమంలో నాగాలాండ్ ముఖ్యమంత్రిగా అధికార బాధ్యతలను స్వీకరించారు. బిజెపికి చెందిన వై పాటన్ రాష్ట్ర ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి బిజెపి అధ్యక్షుడు అమిత్‌షా, కేంద్ర మంత్రులు కిరణ్ రిజిజు, నిర్మలా సీతారామన్ తదితరులు హాజరయ్యారు.

వీరితో పాటు ఈ కార్యక్రమానికి మేఘాలయ కొత్త ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా, అరుణాచల్ ప్రదేశ్, అసోం, మణిపూర్ రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూడా హాజరయ్యారు. నీఫియు రియో నాగాలాండ్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించటం ఇది నాలుగోసారి. అంతకు ముందు 2003-2014 మధ్య కాలంలో ఆయన మూడుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించారు. నాగాలాండ్ రాష్ట్రానికి వరుసగా మూడుసార్లు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన ఏకైక వ్యక్తిగా రియో రికార్డులకెక్కారు. ఇప్పటి వరకు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన జెలియాంగ్ మంగళవారం నాడు తన పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. ఆయన నేతృత్వంలోని నాగా పీపుల్స్ ఫ్రంట్ (ఎన్‌పిఎఫ్) అసెంబ్లీ ఎన్నికల్లో 26 స్థానాలు సాధించి అతి పెద్ద పార్టీగా అవతరించినప్పటికీ బిజెపి-ఎన్‌డిపిపి కూటమికి 30 స్థానాలు లభించటంతో పాటు జెడి(యు), ఇండిపెండెంట్ సభ్యుల మద్దతు కూడా లభించటంతో ఈ కూటమి నేత రియోను గవర్నర్ ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానించారు.

నేటి నుండి ఆరెస్సెస్ ప్రతినిధుల 'సభ'

న్యూఢిల్లీ: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అత్యున్నత విధాన నిర్ణాయక వ్యవస్థ అఖిల భారతీయ ప్రతినిధి సభ మూడు రోజుల సమావేశాలు శుక్రవారం నుండి నాగపూర్‌లో ప్రారంభం కానున్నాయి. ప్రతి మూడేళ్లకోసారి జరిగే ఈ భేటీ 2019 సార్వత్రిక ఎన్నికల ముందు జరిగే చివరి భేటీ కావటంతో ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ భేటీలో ప్రధానంగా సంఘ్ వ్యవస్థాపరమైన మార్పులతో పాటు రానున్న మూడేళ్ల కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఆరెస్సెస్ సర్ కార్యవాహ్ (ప్రధాన కార్యదర్శి)గా వున్న భయ్యాజీ జోషి స్థానంలో కొత్త వారిని ఎన్నుకోనున్నట్లు తెలుస్తోంది. సంఘ్ కార్యవర్గంలో ప్రధాన కార్యదర్శిది రెండో స్థానం అన్న విషయం తెలిసిందే. సంఘ్‌లో అత్యున్నత పదవి అయిన సర్‌సంఘ చాలక్‌గా ప్రస్తుతం వ్యవహరిస్తున్న మోహన్‌భగవత్ సంస్థకు మార్గదర్శిగా వ్యవహరిస్తారని ఆరెస్సెస్ వర్గాలు వివరించాయి.

సూకీ మానవ హక్కుల అవార్డు రద్దు

హోలోకాస్ట్ మ్యూజియం నిర్ణయం



వాషింగ్టన్: మయన్మార్‌లో రోహింగ్యా ముస్లింలపై కొనసాగుతున్న హింసాకాండను అరికట్టడంలో విఫలమయ్యారని ఆరోపిస్తూ మయన్మార్ ప్రభుత్వ సలహాదారు, నోబుల్ శాంతి పురస్కార విజేత ఆంగ్‌సాన్ సూకీకి అందచేసిన మానవ హక్కుల అవార్డును రద్దు చేస్తున్నట్లు అమెరికాకు చెందిన హోలోకాస్ట్ (ఊచకోత) మ్యూజియం ప్రకటించింది. మానవ హక్కుల పరిరక్షణకు ఉద్యమించి విజయం సాధించిన ఆంగ్‌సాన్ సూకీకి 2012లో ఎలీవీసెల్ మానవ హక్కుల అవార్డును ఈ మ్యూజియం ప్రకటించిన విషయం తెలిసిందే. మ్యూజియం నిర్వాహకులు సూకీకి రాసిన లేఖలో ఆమె మౌనం దేశంలో మైనార్టీలపై సైన్యం దాడులను మరింత ప్రోత్సహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రోహింగ్యాల పరిస్థితిని పరిశీలించేందుకు వచ్చిన ఐరాస ప్రతినిధి వర్గాన్ని అడ్డుకోవటం విచారకరమని, దేశంలో సైనిక పెత్తనంపై ఆమె ఏ మాత్రం ప్రభావం చూపలేకపోయారని హోలోకాస్ట్ మ్యూజియం తన లేఖలో పేర్కొంది. రోహింగ్యాలపై కొనసాగుతున్న మారణ కాండను అడ్డుకుని వారికి సంఘీభావం ప్రకటించి వుంటే బాగుండేదని మ్యూజియం తన లేఖలో అభిప్రాయపడింది. మైనార్టీలపై ఇటీవలి కాలంలో పెరిగిపోతున్న హింసాకాండ తీవ్రత, పరిస్థితిని అడ్డుకోవటంలో మీ వైఫల్యాన్ని సూచిస్తోందని పేర్కొంది. రోహింగ్యాల ఊచకోత నేపథ్యంలో మసకబారుతున్న సూకీ ప్రతిష్టకు ఇది తాజా ఎదురు దెబ్బ అని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు. మ్యూజియం నిర్ణయంపై స్పందించిన సూకీ ప్రతినిధి ఒకరు మీడియాతో మాట్లాడుతూ ఇది తప్పుడు సమాచారం ఆధారంగా తీసుకున్న నిర్ణయంలా కన్పిస్తోందన్నారు. ఈ నిర్ణయం పట్ల మయన్మార్ ప్రభుత్వం తీవ్ర విచారం ప్రకటిస్తోందని చెప్పారు. మయన్మార్‌లో సైనిక నియంతృత్వాన్ని వ్యతిరేకిస్తూ అనేక ఏళ్లపాటు గృహనిర్బంధంలో గడిపిన ఆంగ్‌సాన్ సూకీకి 1991లో నోబుల్ శాంతి పురస్కారం లభించిన విషయం తెలిసిందే. 2015 నాటి ఎన్నికల్లో ఆమె పార్టీ ఘన విజయం సాధించటంతో కేవలం ఆమె కోసమే ప్రత్యేకంగా ప్రభుత్వ సలహాదారు పేరుతో అత్యున్నత పదవిని సృష్టించారు. అయితే ఇప్పటికీ సైన్యమే అక్కడ రాజకీయ, ఆర్థిక పెత్తనం చెలాయిస్తుండటం గమనార్హం.

నైట్రోజన్ డయాక్సైడ్‌తో అకాల మరణాలు

బెర్లిన్ : నైట్రోజన్ డయాక్సైడ్ కలిగించే ప్రమాదకరమైన ప్రభావాల కారణంగా ప్రతి ఏటా వేలాది అకాలమరణాలు సంభవిస్తున్నాయని జర్మనీ అధ్యయనంలో వెల్లడైంది. జర్మనీ వాతావరణ విభాగం నిర్వహించిన అధ్యయనం వివరాలను గురువారం విడుదల చేశారు. 2014లో ఈ కారణంగా దాదాపు 6వేల మంది అస్వస్థతతో అకాల మరణాల బారిన పడ్డారని నివేదిక తెలిపింది. వీరి అస్వస్థతకు నైట్రోజన్ డయాక్సైడ్ కారణమని స్పష్టమైంది. నగరాల్లో, పల్లెల్లో డయాబెటిస్, ఆస్మా, కాలుష్యం వల్ల కలిగే ఇతర వ్యాధులతో సంభవించిన మరణాలతో నైట్రోజన్ డయాక్సైడ్ మరణాలను పోలుస్తూ నివేదికను రూపొందించారు. గాలిలో కాలుష్యాన్ని తగ్గించేందుకు, వాయు నాణ్యతను మెరుగుపరిచేందుకు నగరాల్లో డీజిల్ కార్ల వినియోగంపై నిషేధం విధించాలని జర్మనీ కోర్టు రూలింగ్ ఇచ్చింది. ఆ తర్వాత వారానికే ఈ అధ్యయనం ఫలితాలు ప్రచురితమయ్యాయి.

భారత్, చైనా కలిసి సాగాలి

- ఒకటి ఒకటి కలిస్తే రెండు కాదు పదకొండు
- భారత్‌తో స్నేహంపై చైనా



బీజింగ్: చైనా డ్రాగన్, భారత్ ఏనుగు పోరాడకూడదని, కలిసి నాట్యమాడాలని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ వి అన్నారు. గురువారం ఆయన బీజింగ్‌లో మీడియాతో మాట్లాడుతూ రెండు దేశాలు తమ మధ్య ఉన్న తేడాలను సరిదిద్దు కొని, మదిలో ఉన్న అపోహలను తొలగించుకొని, ఇరువురికి ప్రయోజనం కలిగే రీతిలో ద్వైపాక్షిక సంబంధాలను పెంపొందించుకోవాలని పేర్కొన్నారు. 2017లో రెండు దేశాల మధ్య డోక్లామ్ వివాదంతోపాటు మరికొన్ని అంశాల్లో సమస్యలు తలెత్తిన నేపథ్యంలో ఈ ఏడాది సంబంధాలు ఎలా ఉంటాయని విలేకరులు ప్రశ్నించగా కొన్ని పరీక్షలు, కష్టాలు ఎదురైనప్పటికీ చైనా, భారత్ సంబంధాలు మెరుగౌతూనే ఉన్నాయని చెప్పారు. చైనా తన హక్కులను, న్యాయబద్ధమైన ప్రయోజనాలను రక్షించుకుంటుందని, అదే విధంగా భారత్‌తో సంబంధాలను కొనసాగించడంలో జాగ్రత్తలు తీసుకుంటుందని చెప్పారు. ఇరు దేశాల మధ్య భవిష్యత్ సంబంధాల పెంపుదల కోసం చైనా, భారత్ నాయకులు వ్యూహాత్మక దృక్పథాన్ని అభివృద్ధి చేసుకున్నారని చెప్పారు. చైనా డ్రాగన్, భారత్ ఏనుగు పోట్లాడుకోకూడదని, రెండు కలిసి నాట్యమాడాలని అన్నారు. భారత్, చైనా కలిస్తే ఒకటి, ఒకటి కలిసి రెండు అయ్యే బదులు పదకొండు అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ శతాబ్దంలో అంతర్జాతీయ పరిస్థితుల్లో పెద్ద మార్పులు కన్పిస్తున్నాయని, వీటిని అర్థం చేసుకొని చైనా, భారత్‌లు రెండూ పరస్పరం సహకరించుకోవాలని, అనుమానాలను తొలగించుకోవాలని అన్నారు. భారత్, చైనా సంబంధాల్లో పరస్పర నమ్మకం చాలా కీలకమైందని పేర్కొన్నారు. రాజకీయ నమ్మకంతో ముందుకు సాగితే హిమాల యాలు సైతం తమ దేశాల మధ్య స్నేహ సహకారాన్ని అడ్డుకో లేవని చెప్పారు. పరస్పర అవగాహనతో బేదాభిప్రా యాలను తొలగించుకుంటామని, ఉమ్మడి ప్రయోజనాలు సమస్యలను పక్కకు తోసేస్తాయమని, భారత్‌తో సంప్రదాయ స్నేహాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు, భారత్ ప్రజలతో స్నేహితుడిగా, భాగాస్వామిగా ఉండేందుకు చైనా సిద్ధంగా ఉందని చెప్పారు. అనుమనాల స్థానంలో నమ్మకాన్ని పెంచుకోవాలని, చర్చలతో విబేదాలను తొలగించుకోవాలని సహకారంతో భవిష్యత్‌ను నిర్మించుకోవాలని చెప్పారు.



అమెరికా తూర్పు తీరం దిశగా మరో తుపాను

న్యూయార్క్ : అమెరికా తూర్పు తీరం దిశగా గురువారం మరో తుపాను కదులుతోంది. గత వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండవది. తుపాను తీవ్రత కారణంగా బలమైన గాలులు వీయడంతో వేలాది గృహాలు విద్యుత్ లేక అంధకారంలో మగ్గుతున్నాయి. పెన్సిల్వేనియా నుండి న్యూ ఇంగ్లాండ్ వరకు ఇదే పరిస్థితి నెలకొంది. ఇదే సమయంలో భారీగా మంచు కూడా కురుస్తుండడంతో పరిస్థితి మరింత బీభత్సంగా వుంది. బుధవారం రాత్రికి కొన్ని ప్రాంతాల్లో రెండు అడుగుల కన్నా ఎక్కువగా మంచు పేరుకుపోయింది. మోంటివిల్లే, న్యూజెర్సీ ప్రాంతాల్లో 26 అంగుళాల మందాన మంచు కురిసింది. తుపాను కారణంగా ఈ ప్రాంతాల్లో వేలాది విమానాలు రద్దయ్యాయి. 2018 సిఎఎ మహిళా బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి వచ్చిన నార్త్‌ఈస్టర్న్ యూనివర్శిటీ మహిళా బాస్కెట్ బాల్ బృందం సభ్యులు ప్రాక్టీస్ సెంటర్ వెలుపల మంచు బాగా కురియడంతో వెనక్కి రావాల్సి వచ్చింది. న్యూయార్క్ సిటీ మెట్రో రైళ్లను రద్దు చేసింది. గత వారం సంభవించినంత తీవ్రంగా ఈ తుపాను వుండకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. గత తుపాను కారణంగా విద్యుత్ పోయి అంధకారంలో వుంటున్న వేలాదిమందికి బుధవారం నాటికి కూడా విద్యుత్ పునరుద్ధరణ జరగలేదు. భారీగా మంచు కురుస్తున్న కారణంగా దాదాపు 450 విమానాలను రద్దు చేశారు. న్యూయార్క్ నుండి వెళ్లే, వచ్చే విమానాలను నిలిపివేశారు.

టిఎంసి, బిజెపిలకు వ్యతిరేకంగా పోరాటాలు

- విస్తృత ప్రజా ఐక్యతకు కృషి
- సిపిఎం పశ్చిమ బెంగాల్ రాష్ట్ర మహాసభల నిర్ణయం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి-కోల్‌కతా

విస్తృతంగా ప్రజల మధ్య ఐక్యతను సాధించి ఏకకాలంలో టిఎంసి, బిజెపిలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహించాలని సిపిఎం పశ్చిమబెంగాల్ రాష్ట్ర కమిటీ 25వ మహాసభలు నిర్ణయించాయి. మహాసభలు పూర్తయిన అనంతరం తిరిగి కార్యదర్శిగా ఎన్నికైన సూర్యకాంత మిశ్రా, పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఎండి సలీమ్ విలేకరులతో మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర కమిటీ వరకు పార్టీని సంస్థాగతంగా పటిష్టపరుచుకున్నట్లు చెప్పారు. బిజెపి, టిఎంసిలు రెండు తలల పాము లాంటివని, రెండు పార్టీల ఉద్దేశ్యాలు ఒక్కటేనని అన్నారు. రానున్న రోజుల్లో ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఉద్యమాలు నిర్మిస్తామని చెప్పారు. రానున్న పంచాయితీ ఎన్నికల్లోనూ ఇదే వ్యూహంతో పని చేస్తామని చెప్పారు. ఎక్కడైతే వామపక్షాలకు సంస్థాగతమైన నిర్మాణం ఉండదో అక్కడ టిఎంసి, బిజెపి అభ్యర్థులను ఓడించే సత్తా ఉన్న ప్రజాతంత్ర శక్తులకు ఓటేయ్యమని కోరతామని చెప్పారు. ఈ రెండు పార్టీలకు వ్యతిరేకంగా విశాలమైన ప్రజా ఐక్యతకు సాధించేందుకు పార్టీ కృషి చేస్తుందని చెప్పారు. కొత్తగా 80 మందితో రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేశారు. షెడ్యూల్ కులాలకు చెందిన మహిళ కోసం ఓ స్థానాన్ని ఖాళీగా ఉంచారు. సూర్యకాంత మిశ్రాను తిరిగా రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. రాష్ట్ర కమిటీలో 17 మంది కొత్త వారిని ఎన్నుకోగా 20 మంది పాత సభ్యులను తప్పించారు. హైదరాబాద్‌లో జరగనున్న పార్టీ జాతీయ మహాసభలకు 175 మంది ప్రతినిధుల జాబితాను ఖరారు చేశారు. రాష్ట్ర పార్టీ ప్లీనం నిర్ణయం మేరకు రాష్ట్ర కమిటీ సభ్యుల సగటు వయస్సును యాభైనాలున్నర ఏళ్లకు తగ్గించారు. 75 ఏళ్ల వయస్సు ఉన్నప్పటికీ చలాకీగా పని చేసే సామర్థ్యాన్ని ఇప్పటికీ కల్గి ఉండడంతో లెఫ్ట్‌ఫ్రంట్ ఛైర్మన్ బిమన్ బసుకు మాత్రం మినహాయింపునిచ్చి రాష్ట్ర కమిటీ సభ్యునిగా ఎన్నుకున్నారు. మాజీ విద్యార్థి నాయకుడైన 33 ఏళ్ల మధుజా సెన్‌రాయ్ రాష్ట్ర కమిటీలో అత్యంత పిన్న వయస్కుడుగా ఉన్నారు. మాజీ ముఖ్యమంత్రి బుద్దదేవ్ భట్టాచార్య రాష్ట్ర కమిటీ బాధ్యతల నుంచి తప్పుకుంటానని కోరారు. అయితే ఆయన్ను రాష్ట్ర కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడిగా ఎన్నుకున్నారు.

మహిళా హక్కులకు చట్టపరమైన రక్షణ

టర్కీ మహిళా కార్యకర్తలు పిలుపు

అంకారా : మహిళా హక్కులకు చట్టపరమైన రక్షణ కావాలని టర్కీ మహిళా కార్యకర్తలు పిలుపిచ్చారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టర్కీవ్యాప్తంగా గురువారం పలు కార్యక్రమాలు జరిగాయి. ప్రదర్శనలు, వర్క్‌షాపులు, సెమినార్లు నిర్వహించారు. ఆధునిక సమాజంలో తలనొప్పిగా మారిన హింసపై ప్రత్యేకంగా దృష్టి పెడుతూ పలు కార్యక్రమాలు జరిగాయి. మధ్య ప్రాచ్యంలోని మరే ఇతర దేశాల్లో కన్నా టర్కీలో దాదాపు 4కోట్ల మంది మహిళలు, బాలికలు మెరుగైన చట్టపరమైన రక్షణలు అనుభవిస్తున్నారు. 1920, 30వ దశకం చివరిలో ఆధునిక టర్కీ వ్యవస్థాపకుడు ముస్తఫా కెమల్ అతర్క్ సంస్కరణలు తీసుకువచ్చిన తర్వాత ఈ పరిస్థితి ఏర్పడింది. అయితే, టర్కీ సమాజంలో మహిళల పాత్రపై కఠినతరమైన, మితవాద భావాలు తరచుగా తీవ్ర సమస్యలకు దారి తీస్తున్నాయి. గృహ హింసకు కారణమవుతున్నాయని అధికార డేటా పేర్కొంది. గతేడాదిలో 409 మంది మహిళలు మరణించారు. లింగ సమానత్వం దిశగా టర్కీ గణణీయమైన పురోగతి సాధించినప్పటికీ మతపరమైన ఆచార, సాంప్రదాయాల విషయంలో మాత్రం ఇంకా కఠినమైన పద్ధతులే అమలవుతున్నాయి. సమాన హక్కులు, మహిళల రక్షణకు చట్టాలు చేశారు.

భారత్ పర్యటనకు వచ్చిన మాక్రాన్



పారిస్: ఫ్రెంచ్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయెల్ మాక్రాన్ భారత్‌లో అధికార పర్యటన నిమిత్తం గురువారం ఇక్కడికి చేరుకున్నారు. కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో పర్యటించిన కొద్ది వారాలకే మాక్రాన్ భారత్ పర్యటనకు రావటం విశేషం. ఈ ఇరువురు నేతలూ అంతర్జాతీయ అంశాలపై ఒకే విధమైన అభిప్రాయాలు కలిగి వుండటంతో కొద్దిరోజుల తేడాతో జరుగుతున్న వీరి పర్యటనలు చర్చనీయాంశాలుగా మారాయి. ఇరువురు నేతలూ భారత్‌తో సత్సంబంధాలకు ప్రాధాన్యతనిస్తున్నప్పటికీ ఫ్రెంచ్ అధ్యక్షుడు మాత్రం తన భారతీయ మిత్రులపై భిన్నమైన ప్రభావాన్ని చూపాలన్న ఆసక్తితో వున్నట్లు తెలుస్తోంది. ఆదివారం నాడు న్యూఢిల్లీలో జరుగనున్న సౌర విద్యుత్ సదస్సుకు హాజరు కానున్న ఫ్రెంచ్ అధ్యక్షుడు మాక్రాన్, తరువాత ప్రధాని మోడీతో భేటీ అవుతారని ఫ్రెంచ్ అధ్యక్ష కార్యాలయం ఒక ప్రకటనలో వివరించింది. భార్య బ్రిగెట్టితో సహా భారత్ వచ్చిన మాక్రాన్ ఆదివారం నాడు ఆగ్రాలోని తాజ్ మహల్‌ను సతీసమేతంగా సందర్శించనున్నారు. సోమవారం నాడు ఆయన వారణాసి నగరాన్ని సందర్శించి అక్కడ గంగశుద్ధికి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను పరిశీలిస్తారు. దీనితో పాటు తమ దేశానికి చెందిన ఎయిర్‌బస్ హెలీకాప్టర్లు, స్కార్పియన్ జలాంతర్గాముల వంటి వాటి విక్రయాలకు సంబంధించి ఆయన చర్చలు జరుపనున్నారు.

న్యాయవ్యవస్థలో ఇప్పటికీ పురుషాధిక్యతే..!

- సుప్రీంలో 1 శాతం మాత్రమే మహిళా న్యాయమూర్తులు

న్యూఢిల్లీ: భారత న్యాయవ్యవస్థలో ఇప్పటికీ పురుషాధిక్యతే రాజ్యమేలుతోందని సుప్రీంకోర్టు మహిళా న్యాయవాదుల సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. న్యాయవ్యవస్థలో మహిళా న్యాయమూర్తులకు మరింత ఎక్కువగా స్థానం కల్పించేందుకు అవసరమైన సూచనలతో మహిళా న్యాయవాదుల సంఘం న్యాయ మూర్తి జెఎస్ ఖేహర్ నేతృత్వంలోని ధర్మాసనానికి 2015లో ఒక వినతిపత్రం సమర్పిం చినట్లు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రుమాపాల్ చెప్పారు. దిగువ స్థాయి న్యాయస్థానాలలో దేశవ్యాప్తం గా 27 శాతం మేర మహిళా న్యాయమూర్తులున్నారని, హైకోర్టు వంటి ఉన్నత స్థాయిలో పది శాతం మంది వుండగా సర్వోన్నత న్యాయస్థానంలో ఈ సంఖ్య 1 శాతం కన్నా తక్కువగా వుందని మహిళా న్యాయవాదుల సంఘం తన వినతిపత్రంలో వివరించింది. దేశ న్యాయవ్యవస్థలో మహిళా సాధికారికతకు అవకాశం కల్పిస్తూ మహిళా న్యాయమూర్తుల సంఖ్యను పెంచాల్సిన అవసరం వుందని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో గతంలో 1994 నుండి 99 వరకూ సుప్రీంకోర్టులో రెండో మహిళా న్యాయమూర్తిగా వ్యవహరించిన సుజాతా వి మనోహర్ గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఒక మీడియా సంస్థతో మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో మహిళల ప్రాతినిధ్యం నానాటికీ కుదించుకుపోవటం దురదృష్టకరమన్నారు. న్యాయమూర్తుల నియామకానికి అనేక మంది అర్హులైన మహిళలున్నారని, వారిలో అనుభవజ్ఞులకు న్యాయమూర్తులుగా అవకాశం కల్పించాలని ఆమె సూచించారు. 2000 నుండి 2006 వరకూ సుప్రీంకోర్టులో సుదీర్ఘ కాలం న్యాయమూర్తిగా వ్యవహరించిన జస్టిస్ రుమాపాల్ మాట్లాడుతూ మహిళలకు జరుగుతున్న ఈ అన్యాయానికి ప్రధాన కారణంగా న్యాయమూర్తులను ఎంపిక చేసే వారు కూడా పురుషులే కావటమేనని అన్నారు. ఎంపిక ప్రక్రియలో భాగస్వాములైన పురుషులు సహజంగానే అర్హులైన మహిళల పట్ల చిన్న చూపు ప్రదర్శిస్తుంటారని ఆమె అన్నారు.

చెలరేగిన లంకలో తాజా హింస

ముస్లింల ఆస్తుల ధ్వంసం

కాండీ (శ్రీలంక): శ్రీలంక సెంట్రల్ ప్రావిన్స్‌లో చెలరేగిన ఘర్షణల నేపథ్యంలో ప్రభుత్వం ఎమర్జెన్సీ విధించిన మరుసటి రోజయిన గురువారం కాండీ పట్టణంలో ముస్లింల షాపులు, ఇళ్లు లక్ష్యంగా భారీయెత్తున హింస చెలరేగింది. కాండీ నగర శివార్లలోని అకురానా, కటుగస్తోట తదితర ప్రాంతాలలో ముస్లింలకు చెందిన షాపులు, ఇతర భవనాలపై కొందరు దుండగులు దాడులు చేశారు. వీరంతా సింహళీయులేనని స్థానికులు చెబుతున్నారు. తాజా హింసాకాండ నేపథ్యంలో అధ్యక్షుడు మైత్రీపాల సిరిసేన అత్యవసర ఉన్నతాధికార భేటీలో పరిస్థితిని సమీక్షించారు. తాను కాండీ పట్టణాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిని అధ్యయనం చేసి వివిధ వర్గాల నేతలు, అధికారులతోచర్చలు జరిపానని ఆయన ట్వీట్‌లో వివరించారు. ఆ ప్రాంతంలో శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని అధికారులను ఆదేశించినట్లు ఆయన తెలిపారు. ఇదిలా వుండగా హింసాకాండ చెలరేగిన ప్రాంతాలలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేస్తూ శ్రీలంక టెలికమ్యూనికేషన్ నియంత్రణా వ్యవస్థ (టిఆర్‌సి) నిర్ణయం తీసుకుంది. మూడు రోజులపాటు అమలులో వుండే ఈ నిర్ణయం ప్రజల్లో భయాందోళనల నివారణకు, హింసాకాండ విస్తరించకుండా వుండేందుకు దోహదపడుతుందని భావిస్తున్నట్లు టిఆర్‌సి వర్గాలు తెలిపాయి.

పాకిస్తానీ తాలిబన్లపై అమెరికన్ డ్రోన్ దాడి

ఆఫ్ఘన్‌లో 21 మంది మృతి

దేరా ఇస్మాయిల్ ఖాన్: పాక్ తాలిబన్లు లక్ష్యంగా అమెరికాకు చెందిన ఒక మానవ రహిత విమానం (డ్రోన్) ప్రయోగించిన రెండు క్షిపణులు ఆఫ్ఘనిస్తాన్‌లోని ఒక మిలిటెంట్ స్థావరంపై పడటంతో పాక్ తాలిబన్ నేత కుమారుడితో సహా 21 మంది మిలిటెంట్లు ప్రాణాలు కోల్పోయారని పాక్ ఇంటెలిజెన్స్ అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఆఫ్ఘనిస్తాన్‌లో తలదాచుకున్నట్లు భావిస్తున్న పాకిస్తానీ తాలిబన్ నేత ముల్లా ఫజుల్లా తరచు సందర్శించే ఒక భవనాన్ని లక్ష్యంగా చేసుకుని బుధవారం నాడు అమెరికన్ డ్రోణ్ ఈ దాడి చేసిందని అధికారులు చెప్పారు. ఆ సమయంలో ఫజుల్లాకు బదులుగా అతడి కుమారుడు ఆ భవనంలో వుండటంతో క్షిపణి దాడిలో మరణించాడని అధికారులు వివరించారు. ఆఫ్ఘన్ పాక్ సరిహద్దు ప్రాంతానికి కొద్ది దూరంలో వున్న కునార్ ప్రావిన్స్‌లో ఈ దాడి జరిగిందని అధికారులు చెప్పారు. ఈ దాడిలో తమ సహచరులు మరణించిన విషయాన్ని ముగ్గురు పాకిస్తానీ తాలిబన్ కమాండర్లు కూడా ధృవీకరించారు. అయితే దీనిపై అమెరికా ఇప్పటి వరకూ స్పందించలేదు.

వేడెక్కిన వాణిజ్య వాతావరణం

ట్రంప్ చర్యలపైనే అందరి దృష్టి

స్పందించక తప్పదన్న ఇయు

వాషింగ్టన్ : ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామని గత వారం ప్రకటించిన ట్రంప్ సర్కార్ వాటికి సంబంధించిన విధి విధానాలను ఇంకా ప్రకటించాల్సి వుంది. అయితే వాటివల్ల కలిగే ప్రభావాలు ఎలా వుంటాయో ఇప్పటికే ప్రధాన దేశాలన్నీ చర్చిస్తుండడంతో పూర్తి స్థాయిలో అంతర్జాతీ యంగా వాణిజ్యపరమైన ఘర్షణా వాతావరణం వేడెక్కింది. ట్రంప్ తాను అనుకున్న విధంగా ముందుకు సాగినట్లైతే తాము తప్పక ఈ కేసును ప్రపంచ వాణిజ్య సంస్థ వద్దకు తీసుకెళ తామని యురోపియన్ యూనియన్ వాణిజ్య కమిషనర్ సెసీలియా మామ్ స్టార్మ్ తెలిపారు. ఈ టారిఫ్‌ల పరిధిలోకి వచ్చే ఉత్పత్తుల జాబితా కూడా ఇయు సిద్ధం చేసినట్లు ఆమె తెలిపారు. ఆహార పదార్థాల నుండి హార్లీ డేవిడ్‌సన్ మోటార్‌బైక్‌ల దాకా వివిధ రకాల ఉత్పత్తులు ఈ జాబితాలో వున్నాయి. 'వాణిజ్య యుద్ధం' అనే పదం వాడేందుకు తాను విముఖంగా వున్నానని ఆమె చెప్పారు. ఈ వివాదం లేదా ఘర్షణ చేయి దాటి పోవాలని ఇయు కోరుకోవడం లేదన్నారు. అయితే ట్రంప్ సర్కార్ చర్యలను బట్టి తాము కూడా నిర్దిష్టంగా కొన్ని చర్యలను తీసుకోవాల్సిన అవసరం వుందని అన్నారు. ట్రంప్ చర్యలు యురోపియన్ ఆర్థిక వ్యవస్థను, తమ కార్మిక శక్తిని దెబ్బతీసే ముప్పు పొంచి వుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు.

పార్టీ కార్యాలయమే మాణిక్ సర్కార్ 'నివాసం'

అధికార నివాసం ఖాళీ

అగర్తలా: పదవీ విరమణ చేస్తున్న త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ గురువారం నాడు తన అధికార నివాసాన్ని ఖాళీ చేసి పార్టీ రాష్ట్ర కమిటీ కార్యాలయానికి మారారు. గత రెండు దశాబ్దాలుగా రాష్ట్రాన్ని పాలించిన మాణిక్ సర్కార్ ఇప్పుడు తన అధికార నివాసం 'మార్క్స్ ఏంగెల్స్ సరణి' ని విడిచి 500 మీటర్ల దూరంలో వున్న పార్టీ కార్యాలయంలోకి మకాం మార్చారని పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి బిజన్‌ధర్ చెప్పారు. గురువారం ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ మాణిక్ సర్కార్ తన సతీమణి పాంచాలీ భట్టాచార్యతో కలిసి పార్టీ కార్యాలయంలోని అతిథిగృహంలోని ఒక గదిలో నివసిస్తారని తెలిపారు.. పార్టీ ఆఫీసు కిచెన్‌లో వండిన ఆహార పదార్థాలనే వారు కూడా భుజిస్తారని సిపిఎం పార్టీ కార్యాలయ కార్యదర్శి హరిపాద దాస్ వివరించారు. ఇప్పటికే తన దుస్తులు, పుస్తకాలు, సిడీలను పార్టీ ఆఫీసుకు పంపారని ఆయన చెప్పారు. కొత్త ప్రభుత్వం ఒక ప్రభుత్వ క్వార్టర్‌ను కేటాయిస్తే ఆయన అందులోకి మకాం మారుస్తారని తెలిపారు. మాణిక్ సర్కార్ దంపతులకు సంతానం లేని విషయం తెలిసిందే.

ఆగని విగ్రహాల విధ్వంసం

తిరువనంతపురం : విగ్రహాల ధ్వంసంపై ప్రధాని నరేంద్రమోడీ ఆగ్రహం వ్యక్తం చేసినప్పటికీ ఇంకా దుశ్చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కేరళలోని కన్నూర్‌లో గురువారం ఉదయం 7 గంటలకు గుర్తు తెలియని వ్యక్తి గాంధీ విగ్రహన్ని ధ్వంసం చేశాడు. విగ్రహనికి ఉన్న కళ్ళ జోడును విరగొట్టి, మెడలో ఉన్న దండను తెంపివేశారు. స్థానికులు అందించిన సమాచారం ప్రకారం అతనిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ దాడి చేయడానికి వెనుక రాజకీయ ప్రేరణ ఏమి లేదని సీనియర్ పోలీస్ సాధారణ అధికారి మీడియాతో పేర్కొన్నారు. దానిని ఒక సంఘటనగానే పరిగణిస్తున్నట్లు తెలిపారు. దాడి చేసిన వ్యక్తి గోధుమ రంగు చొక్కా, కాషాయ రంగు లుంగీని ధరించాడని, సహజంగా కన్నూర్‌లో ఇలాంటి దుస్తులను ధరిస్తారని తెలిపారు. కాగా, తమిళనాడు రాష్ట్రంలోని చెన్నైలో బిఆర్ అంబేద్కర్ విగ్రహంపై గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి రంగును పోసి దుశ్చర్యకు పాల్పడ్డారు. దీంతో రాష్ట్రాల్లోని పోలీసులు ప్రముఖుల విగ్రహాల వద్ద భద్రతా చర్యలు చేపట్టారు. ఢిల్లీ పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యగా వివిధ పోలీస్ స్టేషన్లలోని అధికారులను అప్రమత్తం చేశారు. గత మూడు రోజులుగా త్రిపురలో లెనిన్, తమిళనాడులో పెరియార్, పశ్చిమబెంగాల్‌లో శ్యాం ప్రసాద్ ముఖర్జీ విగ్రహాలు విధ్వంసానికి గురైన సంగతి తెలిసిందే. విగ్రహాలను విధ్వంసం చేసే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం ఆదేశించింది.

తాత్కాలిక ఉపశమనానికి ఢిల్లీ కోర్టుకెళ్ళండి

కార్తీ పిటిషన్‌పై 'సుప్రీం'

న్యూఢిల్లీ : ఐఎన్‌ఎక్స్ మీడియా మనీలాండరింగ్ కేసులో తాత్కాలిక ఉపశమనం పొందాలని భావిస్తే ఢిల్లీ హైకోర్టునే ఆశ్రయించాలని కాంగ్రెస్ సీనియర్ నేత చిదంబరం కుమారుడు కార్తీ చిదంబరానికి గురువారం సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కార్తీ చిదంబరంపై నమోదైన కేసులో శుక్రవారం వాదనలు వినడానికి తగిన బెంచ్‌ను ఏర్పాటు చేయాలని ఢిల్లీ హైకోర్ట్ యాక్టింగ్ చీఫ్ జస్టిస్‌కు దీపక్ మిశ్రాతో కూడిన సుప్రీం ధర్మాసనం సూచించింది. మనీలాండరింగ్ కేసులో సుప్రీం కోర్టులో పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌ను వెనక్కు తీసుకునేందుకు కార్తీ చిదంబరానికి అనుమతినిచ్చింది. మార్చి 6న తాత్కాలిక రక్షణ కోరుతూ కార్తీ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించింది. గత మేలో సిబిఐ దాఖలు చేసిన ఎఫ్ఐఆర్‌పై దర్యాప్తు చేసే అధికారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి)కు లేదని కార్తీ సుప్రీం కోర్టును ఆశ్రయించారు.

స్థానిక ఎన్నికల విజయాలతో రాజస్థాన్ కాంగ్రెస్ సంబరాలు

జైపూర్ : రాజస్తాన్‌లో ఈ వారంలో పలు స్థానిక సంస్థలకు జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవడంతో ఆ పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నాయి.. ఆరు జిల్లా పరిషత్ సీట్లలో నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకోగా, 20 పంచాయతీ సమితి స్థానాలకుగాను 12 స్థానాలను, అలాగే ఆరు మున్సిపల్ స్థానాల్లో నాలుగింటిని కాంగ్రెస్ గెలుచుకుంది. కొద్ది రోజుల క్రితం రెండు లోక్‌సభ స్థానాలను, ఒక అసెంబ్లీ స్థానాన్ని కాంగ్రెస్ కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. దీంతో మళ్ళీ రాష్ట్రంలో తమ పార్టీ అధికారంలోకి రానుందని కాంగ్రెస్ వర్గాలు ఆశాభావంతో వున్నాయి. ఇది పార్టీ కార్యకర్తల కృషికి లభించిన మరో విజయని, గత నాలుగేళ్ల పాలనా కాలంలో బిజెపి ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తూ రాష్ట్ర ప్రజలపై భారాలు మోపిందని కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ వ్యాఖ్యానించారు.

సాగునీటి ప్రాజెక్టుల పడకే

- రూ. 16,978.23 కోట్లు కేటాయింపు
- పోలవరానికే రూ. 9,994 కోట్లు
- మిగిలిన రూ.6 వేల కోట్లతో పూర్తయ్యేనా?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో చేపట్టిన సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని ప్రభుత్వం ఒక పక్క ప్రకటిస్తూనే మరో పక్క వాటికి భారీగా కోత విధిస్తోంది. ఈ రంగానికి సంబంధించి కేటాయింపులు కాగితాలపై అంకెల మాయగానే కనిపిస్తోంది. ' ప్రస్తుత 2018-19 సంవత్సరానికి 16,978.23 వేల కోట్లు కేటాయించాం. గత సంవత్సరం కన్నా ఇది 32 శాతం ఎక్కువ' అని బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికశాఖ మంత్రి యనమల రామకృష్ణుడు చెప్పిన మాటలివి. అయితే వాస్తవం దీనికి భిన్నంగా ఉంది. కాగితాలపై కేటాయింపులు ఘనంగా కన్పిస్తున్నప్పటికీ నిజంగా జలవనరులశాఖకు దక్కింది మాత్రం నామమాత్రమే. రూ. 16 వేల కోట్ల రూపాయల కేటాయింపుల్లో పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన మొత్తం రూ. 9,994 కోట్లు. ఇది పోతే మిగిలింది రూ. 6 వేల కోట్లు మాత్రమే వీటితో రాష్ట్రంలోని ప్రధాన ప్రాజెక్టులను ఏ విధంగా ప్రభుత్వం పూర్తి చేస్తుందో సామాన్యులకు అంతుపట్టడం లేదు. ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టే దాదాపు చివరి బడ్జెట్ ఇదే. అయితే వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమలోని గాలేరు-నగరి, హంద్రీ-నీవా, వెలిగొండ, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, తోటపల్లి, వంశధార ఫేజ్-2 తదితర ప్రధాన ప్రాజెక్టులతోపాటు మరో 40 వరకు చిన్నతరహా ప్రాజెక్టులున్నాయి. వీటిని ఈ ఏడాది చివరికల్లా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకొంది. 100 రోజుల్లో 28 ప్రాధాన్య ప్రాజెక్టులను పూర్తి చేయాలనేది ప్రభుత్వ ఆలోచన. వాస్తవానికి ఈ ప్రాజెక్టులు పూర్తవ్వాలంటే రూ. వేల కోట్లు ఖర్చు చేయాల్సిన అవసరం ఉంది. అయితే ఈ బడ్జెట్‌లో కేవలం రూ. 6 వేల కోట్లు మాత్రమే కేటాయించింది. దీంతో ప్రాజెక్టులు పూర్తయ్యే అవకాశం కన్పించడం లేదు.



శ్రీకాకుళం జిల్లా భామిని మండలం కాట్రగడ వద్ద నట్టనడకన సాగుతున్న వంశధార స్టేజ్-2, ఫేజ్-2 ప్రాజెక్టు పనులు

లక్ష్యం నెరవేరేనా?

ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకున్న గోదావరి-పెన్నా అనుసంధానం, మహేంద్రతనయ, గాలేరు - నగరి రెండోదశ, వెలిగొండ 1, 2 సొరంగాలు, వైకుంఠపురం బ్యారజ్, స్వర్ణముఖి- సోమశిల, మల్లెమడుగు, బాలాజీ రిజర్వాయర్, వేణుగోపాల్ సాగర్, తారకరామ తీర్థసాగరం, హీరమండలం ఇచ్ఛాపురం- సోంపేట, జీడిపల్లి బైరవానితిప్ప, మూపల్లి- కుప్పం, పాలేరు, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, ఆల్తూరుపాడుతోపాటు 25 పైగా ప్రాజెక్టులను పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకొంది. రాష్ట్ర ప్రభుత్వం జలవనరులశాఖకు ప్రాధాన్యత క్రమంలో 2016-17 బడ్జెట్‌లో రూ. 7,978 కోట్లు, 2017-18లో రూ. 12,770 కోట్లు, ప్రస్తుత 2018-19 బడ్జెట్‌లో రూ.16,978.23 కోట్లు కేటాయించింది. అయితే ఏడాదికేడాది నిధులు పెరగుతున్నాయి తప్ప అనుకున్న లక్ష్యం నెరవేరడం లేదు. చాలా చోట్ల నిర్వాసితులకు ఇచ్చే పునరావసం సమస్య అధికమవుతోంది.

'సీమ' ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

రాయలసీమను కరువు రహితంగా చేయడానికి అక్కడ అన్ని ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ దిశగా వాటికి నిధుల కేటాయింపులు చేపట్టలేదు. గాలేరు- నగరి, హంద్రీ-నీవా ప్రాజెక్టులను 2017-18 ఆర్థిక సంవత్సరంలోనే పూర్తి చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అయితే 2018-19లోనూ ఆ మేరకు నిధులు కేటాయించలేదు. హంద్రీ-నీవా పూర్తి చేయడానికి రూ. 2500 కోట్లు అవసరమని జలవనరులశాఖ అంచనా వేయగా రూ. 524.31 కోట్లతోనే సరిపెట్టారు. గత ఆర్థిక సంవత్సరంలో రూ.479.20 కోట్లు మాత్రమే కేటాయించారు. గతేడాదితో పోల్చితే రూ.46 కోట్లు పెంచారు తప్ప పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోలేదు. గాలేరు-నగరికి రూ. 845.15 కోట్లు ఇవ్వాల్సి ఉండగా 430.21 మాత్రమే కేటాయించారు. గత ఆర్థిక సంవత్సరంలోనూ గాలేరు-నగరికి ఈ ఏడాది కేటాయించినట్లే కేటాయింపులు జరిగాయి. చాగల్నాడు, లాంటి చిన్నతరహా ఎత్తిపోతల పథకాలకూ ప్రభుత్వం ప్రత్యేకంగా పద్దు పెట్టి అందులోనే ఖర్చు చూపిస్తోంది. కానీ అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్టులకు ఎలాంటి పద్దు పెట్టకపోవడం గమనార్హం. గతేడాది వెలిగొండకు రూ. 200 కోట్లు కేటాయించిన ప్రభుత్వం ఈ బడ్జెట్‌లో రూ.334 కోట్లు మాత్రమే కేటాయించింది. కృష్ణా డెల్టా ఆధునికీకరణ కోసం 2016-17 బడ్జెట్‌లో 112.89 కోట్లు ప్రభుత్వం కేటాయించింది. అందులో పైసా కూడా ఖర్చు పెట్టలేదు. 2017-18 బడ్జెట్‌లో రూ.112.89 కోట్లు కేటాయించింది. ప్రస్తుత బడ్జెట్‌లో రూ.01.10 కోట్లు మాత్రమే కేటాయించింది.

ఉత్తరాంధ్ర ప్రాజెక్టులూ అంతే

ఉత్తరాంధ్రలో ప్రధాన ప్రాజెక్టులైన వంశధార, సుజల స్రవంతికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపింది. వంశధారకు గతేడాది బడ్జెట్‌లో రూ.54.82 కోట్లు కేటాయించి, ప్రస్తుతం రూ.13.41 కోట్లు మాత్రమే కేటాయించింది. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తికావాలంటే దాదాపు రూ.3 వేల కోట్లు కావాల్సి ఉంది. అయితే కేవలం రూ.378 కోట్లే కేటాయించింది. గతేడాది ర.91.90 కోట్లు కేటాయించింది. దీనివల్ల భూసేకరణ మరింత జాప్యం ఏర్పడే పరిస్థితి నెలకొంది.

అంకెలే తప్ప ఒరిగేదేమీ లేదు

జలవనరులశాఖకు కేటాయించిన రూ.16 వేల కోట్లలో పోలవరానికి కేటాయించిన రూ.9,994 కోట్లు కేంద్రమే నాబార్డు నుంచి ఇస్తుంది. ఈ లెక్కన రాష్ట్రం కేటాయించింది కేవలరం రూ. 6వేల కోట్లు. ఈ రకంగా రాయలసీమలోని వెలిగొండ, తెలుగుగంగ, ఉత్తరాంధ్రలోని సుజల స్రవంతి, చింతలపూడి ఎత్తిపోతల ఎప్పటికి పూర్తవుతాయి. మరోవైపు కృష్ణాడెల్టా ఆధునికీకరణ పనులు పెండింగ్‌లో ఉన్నాయి. పోలవరానికి సంబంధించి నిర్వాసితులకు రూపాయి కూడా కేటాయించలేదు. రెండేళ్లలో రూ. 33 వేలకోట్లు ఎలా ఖర్చు పెడతారు. ప్రాజెక్టు అంచనావ్యయం రెట్టింపు పెరిగిందన్నారు. ఈ రకంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేవు. ఒక వేళ పోలవరం పూర్తయితే రాష్ట్రంలోని మిగిలిన ప్రాజెక్టులు పూర్తవకుండా ఆ నీటిని ఎక్కడికి తరలిస్తారు కేవలం అంకెల కేటాయింపే తప్ప జలవనరులశాఖకు ఒరిగిందేదీ లేదు

- ఎపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై కేశవరావు

ప్రాజెక్టులవారీగా కేటాయింపులు (రూ. కోట్లలో)

ప్రాజెక్టులు	2017-18 కేటాయింపులు	2018-19 కేటాయింపులు
తారకతర్న కృష్ణవేణి	3.01	0.00
గోదావరి బ్యారేజీ	3.52	2.47
ప్రకాశం బ్యారేజీ	1.34	00.50
తాండవ రిజర్వాయర్	5.05	5.00
నారాయణపురం ఆనకట్టు	0.02	0.10
తెలుగుగంగ	201.75	547.80
సోమశిల	-	143.53
పెన్నా డెల్టా సిస్టమ్	10.00	50.00
కానుపూర్ కెనాల్	3.00	12.00
స్వర్ణముఖి లింక్ కెనాల్	10.62	21.50
సిద్దాపురం లిఫ్ట్ ఇరిగేషన్	7.95	08.00
కృష్ణాపురం	0.50	00.15
తుంగభద్ర బోర్డు	162.02	233.94
గాలేరు- నగరి	536.75	430.21
పులివెందుల బ్రాంచ్‌కెనాల్	96.35	29.32
మైలవరం కెనాల్	7.40	4.85
లోయర్ సీలేరు	0.10	0.00
బుగ్గవంక	0.30	00.70
వంశధార ఫేజ్ 1	9.57	250.50
వంశధార ఫేజ్ 2	54.82	13.41
తోటపల్లి	50.72	143.00
తారకరామ తీర్థ	297.74	405.60
వెంగళరాయసాగర్	1.50	1.19
తాటిపూడి	0.10	00.5
వెలిగొండ	200.00	334.05
గుండ్లకమ్మ	10.44	47.00
రామతీర్థం	0.00	0.00
పాలేరు	3.98	2.30
వీరరాఘవునికోట	1.28	0.00
నాగార్జునసాగర్	103.56	108.14
హంద్రీ-నీవా	479.20	524.31
పోలవరం ఇరిగేషన్	7250.66	9,994.22
పుష్కరం (సిఎఎస్‌పి)	72.36	48.89
తాడిపూడి	96.64	70.00
గురురాఘవేంద్ర	4.11	26.00
శ్రీశైలం కుడి కాలువ	46.25	81.60
చింతలపూడి	91.90	378.00
గోదావరి డెల్టా	85.25	182.69
సుబ్బారెడ్డిసాగర్	0.75	--
పులిచింతల	43.41	70.00
కృష్ణాడెల్టా	112.89	01.10
ఉత్తరాంధ్ర సుజల స్రవంతి	2.00	420.10

అంకెల్లోనే సంక్షేమం.. ఖర్చులో నిర్లక్ష్యం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సంక్షేమ శాఖల విషయంలో ప్రభుత్వం చెబుతున్నది ఒకటి చేస్తున్నది మరొకటిలా ఉంది. మాటలకు చేతలకు పొంతన ఉండటం లేదు. నిధుల ఖర్చు విషయంలో ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఏటా భారీగా నిధులు కేటాయిస్తున్నట్టు ప్రకటిస్తున్న ప్రభుత్వం వాటిని పూర్తి స్థాయిలో ఖర్చు పెట్టడంలో వైఫల్యం చెందుతూనే ఉంది. ఏటా 15 నుంచి 20 శాతం నిధులు మిగిలిపోతూనే ఉన్నాయి. రానున్న ఎన్నికల దృష్ట్యా సంక్షేమానికి తాజా బడ్జెట్‌లో పెద్దపీట వేసినా ఏమేరకు వ్యయం చేస్తారనేది ప్రశ్నార్ధకమేననే విమర్శలున్నాయి.

సంక్షేమ విద్యకు నాస్తి

సంక్షేమంలో అత్యంత విలువైన అంశాలలో మొదటిది విద్య. బడ్జెట్ కేటాయింపుల్లో అధిక శాతం విద్యకు కేటాయించాల్సి ఉంది. కానీ ఆదిశగా చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. వివిధ తరగతులకు చెందిన బిసి విద్యార్థులు16 లక్షల మంది ఉన్నారు. వీరి ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు, ఎన్టీఆర్ విద్యోన్నతి, విదేశీ విద్య స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రియంబర్స్‌మెంట్‌ల కోసం రూ. 2,165 కోట్లు కేటాయించినట్టు ప్రకటించింది. గతేడాది కంటే 25 శాతం పెంచుతున్నట్టు ప్రకటించింది. కానీ ఇవి ఏమూలకు సరిపోవని విశ్లేషకులు వ్యాఖ్యానిస్తున్నారు. ఆర్థికంగా వెనుకబడిన తరగతుల (ఇబిసి) విద్యార్థులకు కేవలం గతేడాది కంటే కేవలం రూ. 5 కోట్లే పెంచారు. గతేడాది రూ. 695 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం రూ. 700 కోట్లు కేటాయించారు. ఎస్సీ విద్యార్థులకు సంబంధించిన ఆర్‌టిఎఫ్‌కు గతేడాది రూ. 480 కోట్లు, ప్రస్తుతం రూ. 531 కోట్లు కేటాయించారు. ఎంటిఎఫ్ కింద గతేడాది రూ. 225 కోట్లు కేటాయించగా, ఈ సంవత్సరం రూ. కేవలం 230 కోట్లే కేటాయించడం గమనార్హం.

దళిత వ్యతిరేక బడ్జెట్

దళితుల పై దాడులు, వెలివేతలు పెరుగుతోంటే వారి పునరావాసం కోసం ప్రత్యేక నిధులేమీ కేటాయించకపోవడం దారుణం. రాష్ట్ర జనాభాలో 17 శాతం ఉన్న దళితులకు కేవలం 7.7 శాతం నిధులు మాత్రమే కేటాయించి మోసం చేసింది. ఎస్సీ, ఎస్టీలకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ప్రస్తావనే చేయకపోవడం బాధాకరం. రాష్ట్రంలో లక్ష మందికి పైగా డప్పు కళాకారులుంటే కేవలం రూ. 12 కోట్లే కేటాయించి చేతులు దులుపుకొంది.

పిట్టల దొరల మాటలు

సంక్షేమ శాఖల పై కేటాయింపులు చూస్తుంటే పిట్టల దొరల మాటలు గుర్తుకు వస్తున్నాయి. దళిత, గిరిజనుల భూమి కొనుగోలుకు రూ. 150 కోట్లు కేటాయించామని చెపుతున్నా ఇంత వరకు ఎకరం భూమిని కొనివ్వలేదు. ఇది అంకెల గారడీ తప్ప మరొకటి కాదు.

వి వెంకటేశ్వర్లు
వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

అంతా అతిశయోక్తే

ఇది ఎన్నికల బడ్జెట్. రానున్న ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనారిటీ తరగతులను భ్రమల్లో పెట్టడానికే అతిశయోక్తి పలుకుతున్నారు. కేటాయింపుల అంకెలను అడ్డం పెట్టుకొని ఓట్లు దండుకోడానికే ఎత్తులు వేస్తున్నారు. నిజమైన అభివృద్ధికి కాదు. దళిత, గిరిజన, వెనుకబడిన తరగతుల పట్ల చిత్త శుద్ధి లేదు. పెర్ఫార్మెన్స్ బడ్జెట్‌లను చూస్తే వాస్తవాలు తెలుస్తాయి. గత రెండేళ్ల బడ్జెట్‌లలో కూడా ఇదే విధంగా కేటాయింపులు చేశారు. కానీ వాటిని ఖర్చు చేయడంలో కానీ, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడంలో కానీ నిర్లక్షంగానే వ్యవహరించారు.

డా॥ మిడియం బాబు రావు
గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు

అటు ఇటు గుడ్‌బై

(మొదటి పేజీ తరువాయి)

కేంద్ర మంత్రులు నిర్ణయించుకున్నారు. మంత్రుల రాజీనామాలు సమర్పించేందుకు ముందే సిఎం చంద్రబాబుకు ప్రధాని మోడీ ఫోన్ చేసి మాట్లాడారు. తొలుత సుజనా చౌదరి ఇంటికి వెళ్లిన అశోక్ గజపతిరాజు ఆయనతో కలిసి కల్యాణ్ మార్గ్‌లోని ప్రధాని నరేంద్ర మోడీ నివాసానికి వెళ్లారు. మోడీతో కొద్దిసేపు మాట్లాడి తమ రాజీనామా పత్రాలను సమర్పించారు. రాష్ట్రంలో పరిస్థితు లను, తాము రాజీనామాలు చేసేందుకు దారితీసిన పరిస్థితు లను వివరించినట్లు సమాచారం. "మీ నాయకత్వంలో మంత్రిగా అవకాశం లభించినందుకు ధన్యవాదాలు. మూడేళ్ల నాలుగు నెలల పాటు మంత్రిగా పనిచేయడం నాకెంతో సంతప్తినిచ్చింది. పార్టీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాజీనామాను సమర్పిస్తున్నా" అని సుజనా తన రాజీనామా లేఖలో పేర్కొన్నారు. అలాగే తన మంత్రి పదవికి రాజీనామా చేస్తున్నట్టు అశోక్‌గజపతి రాజు లేఖలో పేర్కొన్నారు. పౌర విమానయాన శాఖ మంత్రిగా అశోక్ గజపతి రాజు 2014 మే 26న , శాస్త్ర, సాంకేతిక శాఖ సహాయ మంత్రిగా సుజనా చౌదరి నవంబర్ 9న బాధ్యతలు స్వీకరించారు.

ఎన్డీఏలో కొనసాగుతాం : అశోక్ గజపతి రాజు

బిజెపి అధిష్ఠానం ఆదేశాల మేరకే కేంద్ర మంత్రి పదవులకు తాము రాజీనామాలు చేశామని అశోక్ గజపతిరాజు తెలిపారు. ఎన్డీఏలో మాత్రం కొనసాగుతున్నట్టు స్పష్టం చేశారు. రాజీనామా పత్రాలను ప్రధాని నరేంద్ర మోడీకి సమర్పించిన అనంతరం సుజనా చౌదరితో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడారు. మంత్రులుగా దేశానికి సేవ చేసే అవకాశం కల్పించినందుకు మోడీకి కతజ్ఞతలు తెలిపినట్టు చెప్పారు. కేంద్రానికి, ప్రధానికి తెలుగు ప్రజల సమస్యలేమిటో తెలుసన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాల్సిన అవసరం ఉందని అశోక్ గజపతిరాజు అన్నారు.

ఏపి తన వంతు సాయం చేస్తానని మోడీ చెప్పారు : సుజనా చౌదరి

విభజన హామీలు ఆయా ప్రభుత్వ శాఖల పరిధిలో ఉన్నాయని సుజనా చౌదరి అన్నారు. విభజన హామీల అమలులో జాప్యం జరిగినందువల్లే రాజీనామా చేసినట్టు చెప్పారు. పార్టీ అధినేత నిర్ణయానికి కట్టుబడి తామీ నిర్ణయం తీసుకున్నట్టు చెప్పారు. ఈ రాజీనామాలతో తమకు మరింత స్వేచ్ఛ వచ్చినట్టయిందని తెలిపారు. ఏపికి తన వంతు సాయం చేస్తానని ప్రధాని చెప్పారని వెల్లడించారు. మంత్రి పదవులకు రాజీనామా చేసినందున ఎంపిలుగా పార్లమెంట్‌లో స్వతంత్రంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు. జాతీయ పార్టీలు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేదన్నారు. రాష్ట్రం విషయంలో రెండు జాతీయ పార్టీలూ దొందూ దొందూలాగే వ్యవహరించాయన్నారు. ఒక జాతీయ పార్టీ నమ్మక ద్రోహం చేసిందని, మరో జాతీయ పార్టీ మోసం చేసిందని సుజనా ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాజీనామా తప్ప తమకు వేరేమార్గం కనిపించలేదన్నారు. 2016 సెప్టెంబర్ 8న ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించినా.. దాన్ని సరిగ్గా అమలు చేయలేదు కాబట్టే నేడీ ఈ పరిస్థితి వచ్చిందని తెలిపారు. ప్రజల్లో నెలకొన్న సెంటిమెంట్‌ను గౌరవించాల్సిన బాధ్యత కేంద్రానికి ఉందన్నారు. చట్టంలో ఉన్నది చేయడానికి ఎవరి దయాదాక్షిణ్యాలు అవసరం లేదని, మిత్రపక్షంగా ఉన్నా, లేకపోయినా అమలు చేయాల్సిందేనని సుజనా అన్నారు. హామీలు నెరవేరే వరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. తమ పార్టీ నాయకుడితో చర్చించి.. ఆయనేం చెబితే అదేచేస్తామని సుజనా స్పష్టం చేశారు.

మోడీ తొందరపడొద్దన్నారు
మంత్రులతో ముఖ్యమంత్రి చంద్రబాబు
మధ్యాహ్నం ప్రధానితో ఫోన్ సంభాషణ

కూర్చుని మాట్లాడుకుందామని, తొందరపడొద్దని మోడీ అన్నారని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంత్రులకు తెలిపారు. రాజీనామాల నేపథ్యంలో ప్రధాని మోడీతో చంద్రబాబు ఫోన్లో మాట్లాడారు. దీనిపై వివరించేందుకు గురువారం మంత్రులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఇద్దరి మధ్య జరిగిన సంభాషణను ప్రధాని వివరించారు. ప్రజల భావోద్వేగాల నేపథ్యంలో రాజీనామా నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని తెలిపానని మంత్రులకు సిఎం వివరించారు. ఈ సమావేశంలో మంత్రులు సోమిరెడ్డి, కాలువ శ్రీనివాసులు, నారాయణ, పుల్లారావు, లోకేష్, యనమల పాల్గొన్నారు.

బిజెపి మంత్రుల రాజీనామాలకు ఆమోదం

గవర్నర్‌కు వెళ్లిన ఫైలు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

ఇద్దరు బిజెపి రాష్ట్ర మంత్రుల రాజీనామాలను ముఖ్య మంత్రి ఆమోదించి, గవర్నర్‌కు పంపించారు. వారు నిర్వహి స్తున్న శాఖలను ముఖ్యమంత్రి తన వద్దనే ఉంచుకున్నారు. వాటిని త్వరలోనే ఇతర మంత్రులకు కేటాయించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య తలెత్తిన వివాదాల నేపథ్యంలో కేంద్రంలో ఉన్న తెలుగుదేశం మంత్రులు రాజీనామాలు చేయడంతో రాష్ట్రంలో బిజెపి మంత్రులు మాణిక్యాలరావు, కామినేని శ్రీనివాస్‌లు కూడా తమ రాజీనామాలను గురువారం ఉదయమే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందించారు. వారి రాజీనామాలను వెంటనే ఆమోదించిన చంద్రబాబు తదుపరి ఆమోదానికి గవర్నర్‌కు పంపించారు. ఇదే విషయాన్ని శాసనసభ లాబీల్లో కామినేని మాట్లాడుతూ వెల్లడించారు. కొంతమంది మంచి పేరుతో మంత్రివర్గంలోకి వచ్చి చివరిలో ఆరోపణలతో నిష్క్రమిస్తా రని, అయితే మంచిగా వచ్చి అదే పేరుతో వెళ్లిపోతుండడం తమకు గౌరవంగా ఉందని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు తనను ఎంతో గౌరవంగా చూసారని, మూడున్నర సంవత్సరాల్లో ఎటువంటి వివాదాలు లేని మంత్రిగా తనను అభినందించారని కామినేని పేర్కొన్నారు. రాజీనామాలు సమర్పించిన సమయంలో మాణిక్యాలరావు వెనువెంటనే బయటకు వచ్చేయగా, కామినేని మాత్రం కొంతసేపు లోపలే ఉండి చంద్రబాబుతో మాట్లాడారు.

విద్యకు పెరగని బడ్జెట్

12.98 శాతమే కేటాయింపు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రప్రభుత్వం పెంచిన బడ్జెట్‌కు అనుగుణంగా విద్యాశాఖకు పెంచలేదు. బడ్జెట్‌లో పెరుగుదల కనిపించినా మొత్తం బడ్జెట్‌లో 12.98శాతం మాత్రమే విద్యాశాఖకు కేటాయించింది. ఇది గత బడ్జెట్ కేటాయింపులతో పోలిస్తే చాలా తక్కువ. మొత్తం విద్యాశాఖకు రూ.24,180 కేటాయించగా, సెకండరీ విద్యకు రూ.21,612కోట్లు ప్రతిపాదించింది. గత నాలుగేళ్లతో పోలిస్తే బడ్జెట్ శాతంలో విద్యకు తక్కువ శాతం కేటాయించింది. 2015-16లో 16.44శాతం, 2016-17లో 14.84శాతం, 2017-18లో 13.65శాతం కేటాయించగా, ఈ ఏడాది రూ.12.98శాతం కేటాయించింది. గత ఏడాది కేటాయించిన విద్యశాఖకు కేటాయించిన బడ్జెట్‌ను కూడా ప్రభుత్వం ఖర్చు చేయలేకపోయింది. గత ఏడాది రూ.17,962కోట్లు కేటాయింపుకు రూ.17,492కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్వహణకు రూ.100కోట్లు కేటాయించింది.

కేటాయింపులు సరే...చిత్తశుద్ధి ఏదీ..?

ఉన్నత విద్యపై ప్రభుత్వాల దృక్పదం మారుతూ వస్తోంది. కేవలం మౌళిక వసతులకే అధిక ప్రాధాన్యం ఇస్తూ...అభివృద్ధిని పక్కనపెట్టేసినట్లు కనిపిస్తోంది. గురువారం అసెంబ్లీలో ఆర్థిక శాఖ మంత్రి యనమల రామకృష్ణుడు ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో యూనివర్సిటీ అభివృద్ధిపై ఏమాత్రం దృష్టి పెట్టకపోవడం విశేషం. కేవలం కేంద్ర ప్రభుత్వ నిధులపై ఆధారపడాలన్నట్లుగా ఆర్థిక మంత్రి చెప్పకనే చెప్పారు. పైగా గత మూడు సంవత్సరాలుగా ఉన్నత విద్యకు కేటాయింపుల్లో భారీగా కోత పెడుతూ వస్తున్నారు. ఈ ఏడాది ఉన్నత విద్య, సాంకేతిక విద్యకు కలిపి రూ. 3,348.60 కోట్లు కేటాయించారు. ఇందులో ఉన్నత విద్యకు రూ.2530.58 కోట్లు, సాంకేతిక విద్యకు రూ. 818.02 కోట్లు కేటాయింపులు జరిపారు. వీటిలో యూనివర్సిటీల్లో మౌళిక వసతుల కల్పన, తాత్కాలిక అవసరాల కోసం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది.

అరకొర కేటాయింపులు:ఎస్ఎఫ్ఐ

బడ్జెట్‌లో విద్యారంగానికి అరకొర నిధులు కేటాయించారని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు కసాపురం రమేష్, వై రాము గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. లక్ష్యాలకు అనుగుణంగా లేవని తెలిపారు. బిసి స్కాలర్‌షిప్, ఫీజురీయింబర్స్‌మెంట్‌కు రూ.4,100కోట్లు అవసరం కాగా, రూ.2,160కోట్లు మాత్రమే కేటాయించారని తెలిపారు. అరకొర నిధుల కేటాయింపులతో 2019 నాటికి సంపూర్ణ అక్షరాస్యత రాష్ట్రంలో ఏవిధంగా అమలవుతుందో చెప్పాలని డిమాండ్ చేశారు. అంకెల్లో పెరిగిందని శాతంలో తగ్గిందని యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు షేక్ సాబ్జీ, పి బాబురెడ్డి మరో ప్రకటనల విమర్శించారు. రాష్ట్ర బడ్జెట్‌లో విద్యశాతం తగ్గుతూ వస్తోందని తెలిపారు.

అంకెలే పెరిగింది

ఎపి బడ్జెట్‌లో పాఠశాల విద్యకు మొత్తం బడ్జెట్‌తో పోల్చితే రూ.24వేల కోట్లే కేటాయించడం పెరుగుదల శాతం లేదు. ఉన్నత విద్యకు కేటాయింపులు ప్రస్తుత అవసరాలతో పోల్చితే ఎంతమాత్రం సరిపోదు. జాతీయ స్థాయి విద్యాసంస్థలకు స్థల సేకరణకు కొంత వ్యయం చేయాల్సి ఉంది. రాష్ట్ర విశ్వవిద్యాలయాలన్నీ ప్రస్తుతం సంక్షోభంలో నడుస్తున్నాయి. వాటికి నిధులు పెంచే మార్గలు బడ్జెట్‌లో ప్రతిపాదించలేదు. ఆదర్శ పాఠశాలలకు కేటాయింపులు సరిపోవు. కస్తూర్బ విద్యాలయాల్లో పోస్టుల మంజూరు,ఎయిడెడ్ కళాశాలల్లో పోస్టుల భర్తీ ప్రతిపాదనలు చేయకపోవడం విచారకరం.

- కెఎస్ లక్ష్మణరావు విద్యావేత్త, శాసనమండలి మాజీ సభ్యులు

వర్సిటీలవారీగా కేటాయింపులు

వర్సిటీ	కేటాయింపులు (కోట్లలో)
1. ఆంధ్ర విశ్వ విద్యాలయం	రూ. 313.16
2. వెంకటేశ్వర	రూ. 171.99
3. నాగార్జన	రూ. 60.89
4. కృష్ణదేవరాయ	రూ. 72.20
5. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ	రూ. 6.04
6. శ్రీ పద్మావతి	రూ. 66.08
7. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ	రూ. 4.28
8. ద్రవిడ విశ్వ విద్యాలయం	రూ. 22.60
9. సిపి బ్రౌన్ మెమోరియల్ లైబ్రరీ	రూ. 0.36
10. ఆదికవి నన్నయ్య	రూ. 55.28
11. యోగి వేమన	రూ. 77.13
13. బి.ఆర్ అంబేద్కర్ (శ్రీకాకుళం)	రూ. 52.22
14. కృష్ణ	రూ. 10.48
15. రాయలసీమ	రూ. 50.14
16. విక్రమ సింహపురి	రూ. 56.58
17. ఉర్దూ విశ్వ విద్యాలయం	రూ. 48.94

వ్యవసాయం సతమతం

- ఆర్థిక సర్వే వెల్లడి

ప్రజాశక్తి -అమరావతి బ్యూరో

రాష్ట్రంలో అరవై శాతానికి పైగా ప్రజలకు జీవనాధారంగా వున్న కీలకమైన ఈ రంగం అననుకూల వాతావరణ పరిస్థితులు, మదుపు భారీగా పెరిగిపోవడం, పంటలకు గిట్టుబాటు ధర లభించకపోవడం వంటి సమస్యలతో సతమతమవుతున్న మాట నిజమేనని ఆర్థిక సర్వే (2017-18) అంగీకరించింది. కానీ, రాష్ట్ర వ్యవసాయ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి తన ప్రసంగంలో వ్యవసాయం బ్రహ్మాండంగా వున్నట్లు చూపించారు. సాగు విస్తీర్ణం తగ్గినా ఆహార ధాన్యాల ఉత్పత్తి గత ఏడాది కన్నా 6 శాతం అధికంగా వున్నట్లు అంకెలు చూపించారు. 2017 ఖరీఫ్‌లో వర్షపాతం 42 శాతం తగ్గినా, సాగు విస్తీర్ణం పడిపోయినా, ఎరువుల వాడకం తగ్గినా ఆహార ధాన్యాల ఉత్పత్తి మాత్రం పెరిగినట్లు మంత్రి చెప్పారు. 40.72 లక్షల హెక్టార్లలో పంటల సాగు చేయగా 157.59 లక్షల టన్నుల ఆహార ధాన్యాల ఉత్పత్తి సాధించామన్నారు. 2016-17లో 39.7 లక్షల హెక్టార్లలో 149.2 లక్షల టన్నుల ఆహార ధాన్యాలు ఉత్పత్తి సాధించారు. ఈ అంకెల గారడీ సంగతి అలా వుంచితే పంటల సాగు విస్తీ ర్ణానికి దిగుబడికి మధ్య నిష్పత్తిలో పెద్ద మార్పు ఏమీ లేదని గత మూడు నాలుగు సంవత్సరాల పంటల పరిస్థితిని విశ్లేషిస్తే స్పష్టమవుతుంది. 2016-17లో పంటల దిగుబడి 1.25 శాతంగా వుంది. ఇది అంతకుముందు సంవత్సరంతో పోల్చితే .01 శాతం ఎక్కువ. నీటి పారుదల సౌకర్యాలను గణనీయంగా మెరుగుపరచనిదే పంటల దిగుబడి పెంపు సాధ్యం కాదని ఆర్థిక సర్వే పేర్కొనడం గమనార్హం.

చివరి బడ్జెట్‌లోనూ చేనేతకు మొండిచేయి

'ప్రతి సంవత్సరం చేనేతకు బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయిస్తానని ఎన్నికలకు ముందు వాగ్దానాలు చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గత నాలుగు బడ్జెట్లతోపాటు చివరి బడ్జెట్‌లోనూ మొండిచేయి చూపారు. చివరి బడ్జెట్‌లో కేవలం రూ.250 కోట్లు మాత్రమే కేటాయించి చేతులు దుపుకున్నారు. ఈ మొత్తంలో వివిధ కేటాయింపులు పోనూ మిగిలిన రూ.64 కోట్లు రాష్ట్రంలో ఉన్న చేనేత కార్మికులకు సమానంగా పంచితే ఒక్కొక్కరికీ రూ.1400 వస్తాయి. ఆ కొద్దిమొత్తంతో చేనేత కార్మికుల జీవన ప్రమాణం ఏవిధంగా మెరుగుపడుతుందో చంద్రబాబు నాయుడు చెప్పాలి. రానున్న ఎన్నికల్లో చేనేతవర్గం చంద్రబాబుకు తగిన గుణపాఠం చెబుతారు'

- పిల్లలమర్రి బాలకృష్ణ, ఏపి చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

డిస్కంల లోటు పూడ్చలేని బడ్జెట్

లోటులో 50 శాతం కూడా లేని కేటాయింపులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రస్తుత బడ్జెట్‌లో విద్యుత్ శాఖను ఆదుకునేందుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు శూన్యంగానే ఉన్నాయి. విద్యుత్ పంపిణీ సంస్థల రెవిన్యూ లోటును 2018-19 బడ్జెట్‌లో ప్రతిపాదించిన రూ.3,183.38 కోట్లు ఏ మాత్రం భర్తీ చేసే అవకాశం కనిపించడం లేదు. డిస్కంలు రూ.7,982.76 కోట్లు లోటును ప్రతిపాదించగా వివిధ కారణాల చేత వాస్తవానికి ఈ లోటు మరింత అధికంగానే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు విద్యుత్ సబ్సిడీల కోసం ట్రాన్స్‌కోకు ప్రభుత్వం 2016-17 బడ్జెట్‌లో 3,300 కోట్లు కేటాయించగా, సవరించిన అంచనాల్లో ఆ మొత్తాన్ని రూ.500 కోట్లకు తగ్గించింది. 2018-19 బడ్జెట్‌లో ఈ మొత్తం మరో రూ.200 తగ్గించి రూ.2,500 మాత్రమే కేటాయించడం విద్యుత్ సంస్థలను మరింత నష్టాల్లోకి నెట్టే విధంగా కనిపిస్తోంది.

వినియగదారుపై ట్రూఅప్ భారం

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులను పరిశీలిస్తే విద్యుత్ వినియోగదారులపై ట్రూప్ ఛార్జీల భారం తప్పేలా కనిపించడం లేదు. ఎన్నికల నేపథ్యంలో ఈ ఏడాది ఛార్జీలు పెంచకపోయినా వచ్చే ఏడాదైనా ట్రూప్ పేరుతో రాష్ట్రంలోని రెండు డిస్కం లోటు భర్తీ చేయక తప్పదు.

వేణుగోపాలరావు (సెంటర్ ఫర్ పవర్ స్టడీస్ కన్వీనర్)

గొర్రెలు మేకలు పెంపకందారులకు ద్రోహం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బడ్జెట్ కేటాయింపుల్లో గొర్రెలు మేకల పెంపకం దారులకు తెలుగుదేశం ప్రభుత్వం ద్రోహం చేసిందని ఆంధ్రప్రదేశ్ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం విమర్శించింది. పశుసంవర్ధక శాఖకు రూ.1743కోట్లు ప్రకటించారని, గతం కంటే రూ.500కోట్లు ఎక్కువగా అంచనాలో చూపించారని తెలిపారు. గత ఖర్చులు ఎంతపెట్టారో వివరణలు లేవని వివరించారు. రాష్ట్రజిడిపిలో 4శాతం ఆదాయం మాంసం ద్వారా వస్తుందని ప్రకటించారని, ఈ మేరకు కేటాయింపులు లేవని తెలిపారు. ఎన్నికల మ్యానిపెస్టోలో గొర్రెలు పెంపకందారులుకు ఒక్కొక్కరికి 100 శాతంతో ఒక లక్ష రూపాయల గొర్రెల యూనిట్ మంజూరు చేస్తానని ప్రకటించారని,ఇంతవరకు అమలు జరగలేదని పేర్కొన్నారు.బడ్జెట్‌లో సవరణలు చేసి గొర్రెగలు మేకల పెంపకం దారులను ఆదుకోవాలని, లేదంటే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిస్తామని తెలిపారు.

అమర్ అక్బర్ ఆంటోనీ



రవితేజ, అనుఇమ్మాన్యుయేల్

రవితేజ, దర్శకుడు శ్రీనువైట్ల కాంబినేషన్‌లో 'దుబాయ్ శీను' తర్వాత మళ్లీ కలిసి చేయబోతున్న చిత్రం 'అమర్ అక్బర్ ఆంటోనీ'. అను ఇమ్మాన్యుయేల్ కథానాయిక. మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌లో ఆరో చిత్రంగా రూపొందుతోంది. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మాతలు. హైదరాబాద్‌లోని మైత్రీ మూవీస్ సంస్థ కార్యాలయంలో షూటింగ్ లాంఛనంగా ప్రారంభమైంది. దేవుని పటాలపై చిత్రీకరించిన ముహూర్తపు సన్నివేశానికి దర్శకుడు శ్రీనువైట్ల పెద్ద కుమార్తె ఆనంది వైట్ల క్లాప్ కొట్టగా రెండో కుమార్తె ఆద్య వైట్ల కెమెరా స్విచ్చాన్ చేసింది. శ్రీనువైట్ల గౌరవ దర్శకత్వం వహించారు. రవితేజ బౌండెడ్ స్క్రిప్ట్‌ను దర్శకుడికి అందించారు.

శ్రీనువైట్ల మాట్లాడుతూ 'నా హీరో రవితేజతో మళ్లీ ఇన్నాళ్ల తర్వాత కలిసి చేయబోతున్న చిత్రమిది. ఈ కథకి బీజం ఏడాది క్రితం పడింది. పది నెలలపాటు కష్టపడి స్క్రిప్ట్ వర్క్ కంప్లీట్ చేశాం. రవితేజతో పాటు మా నిర్మాతలకు కూడా కథ బాగా నచ్చింది. షూటింగ్ మొత్తం యు.ఎస్.లోనే చేస్తాం. న్యూయార్క్, డెట్రాయిట్, సాల్ట్ లేక్ సిటీతోపాటు ఇతర లొకేషన్లలో చిత్రీకరణ జరపనున్నాం. అత్యధిక శాతం అమెరికాలో చిత్రీకరణ జరుపుకోనున్న మొట్టమొదటి చిత్రమిది. కష్టతరమైన ఈ భారీ షెడ్యూల్స్‌ను చాలా జాగ్రత్తగా ప్లాన్ చేసిన మా నిర్మాతలకు ఎప్పటికీ రుణపడి ఉంటాను. హీరో సునీల్ ఈ చిత్రంలో ఫుల్ లెంగ్త్ కామిక్ రోల్ ప్లే చేయనున్నారు. నిన్నటితరం కథానాయకి లయ, ఆమె కుమార్తె శ్లోక కూడా ఈ చిత్రంలో కీలకపాత్ర పోషించనుండడం విశేషం. ఈ చిత్రంలో రవితేజ తనయుడు మహాధన్ మరో ముఖ్యపాత్ర పోషించనుండడం ప్రధాన ఆకర్షణగా నిలవనుంది" అని అన్నారు.

హలో గురు ప్రేమ కోసం

రామ్, అనుపమ పరమేశ్వరన్ హీరో హీరోయిన్లుగా రూపొందనున్న చిత్రం 'హలోగురు ప్రేమకోసం'. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్ నిర్మాణంలో త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించనున్నారు. ఈ చిత్రం చిత్రీకరణ లాంఛనంగా గురువారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఎర్నేని నవీన్, స్రవంతి రవికిషోర్ స్క్రిప్ట్‌ను డైరెక్టర్‌కు అందించారు. ముహూర్తపు సన్నివేశాకి అనిల్ రావిపూడి కెమెరా స్విచ్చాన్ చేయగా, వంశీ పైడిపల్లి క్లాప్ కొట్టారు. హరీశ్ శంకర్ ముహూర్తపు సన్నివేశానికి గౌరవ దర్శకత్వం వహించారు. ఈ చిత్రంలో ప్రకాశ్‌రాజ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈనెల 12 నుండి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభం కానుంది. దేవిశ్రీ ప్రసాద్ బాణీలు సమకూరుస్తున్నారు. రచన సహకారం సాయికృష్ణ అందిస్తున్నారు. త్వరలోనే సినిమాకు సంబంధించిన మిగతా వివరాలను తెలియజేస్తామని చిత్ర యూనిట్ తెలియజేసింది.



అనుపమ పరమేశ్వరన్, రామ్

కలెక్టర్ 'కర్తవ్యం'



నయనతార

నయనతార ప్రధాన పాత్రలో రూపొందిన తమిళ చిత్రం 'ఆరమ్'. గోపి నైనర్ దర్శకత్వంలో ఆర్ రవీంద్రన్, శరత్ మరార్ సంయుక్తంగా నిర్మించారు. తెలుగులో 'కర్తవ్యం' పేరుతో విడుదల చేస్తున్నారు. ఇది ఒక పొలిటికల్ డ్రామా. నయనతార కలెక్టర్ పాత్రలో లీనమై నటించారు. తెలుగులో ఈ చిత్రం అన్ని కార్యక్రమాలు పూర్తిచేసుకుని ఈనెల 16న విడుదల చేస్తున్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా గురువారం చిత్రం ఫస్ట్‌లుక్, టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ 'నయనతార కెరీర్‌లోనే పెద్ద విజయం సాధించిన ఈ సినిమా తెలుగులో కూడా మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం మాకుంది. ఆడుకుంటున్న పిల్లలు బోరు బావిలో పడిపోతే అక్కడ జరిగే ఆపరేషన్ కథా వస్తువుగా తీసుకుని వాస్తవానికి దగ్గరగా ప్రతి ఒక్కరి హృదయం హత్తుకునే స్క్రీన్‌ప్లేతో దర్శకుడు గోపి తెరకెక్కించాడు' అని అన్నారు. ఈ చిత్రానికి జీబ్రాన్ సంగీతం అందిస్తున్నారు. ఓం ప్రకాష్ కెమెరామెన్‌గా వ్యవహరిస్తున్నారు.

'నోటా' ఫస్ట్‌లుక్

విజయ్ దేవరకొండ, మెహరీన్ హీరోహీరోయిన్లుగా కొత్త చిత్రం ఇటీవలే ప్రారంభమైంది. 'ఇంకొక్కడు' ఫేమ్ ఆనంద్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. స్టూడియో గ్రీన్ పతాకంపై కె.ఇ.జ్ఞానవేల్‌రాజా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'నోటా' అనే టైటిల్‌ని ఖరారు చేశారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్‌ను గురువారం విడుదల చేశారు. ఈ చిత్రంలో సత్యరాజ్, నాజర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం : సి.ఎస్. శ్యాం, కెమెరా: శాంత, ఆర్ట్: కిరణ్, కాస్ట్యూమ్ డిజైనర్: శ్రావ్య, దర్శకత్వం: ఆనంద్‌శంకర్, నిర్మాత: కె.ఇ. జ్ఞానవేల్ రాజా.



విజయ్ దేవరకొండ



సమంత, నాగచైతన్య

ఏప్రిల్‌లో మూహూర్తం



శివ నిర్వాణ

నాగ చైతన్య, సమంత ఓ చిత్రంలో త్వరలో నటించబోతున్నట్టు ఎప్పటి నుంచో ప్రచారం జరుగుతోంది. ఆ సినిమా ఏప్రిల్ నుంచి సెట్స్‌పైకి వెళ్లనున్నట్టు ఆ చిత్ర దర్శకుడు శివ నిర్వాణ గురువారం తెలిపారు. ఈ చిత్రాన్ని సాహు గారపాటి–హరీష్ పెద్ది నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో ఇతర నటీనటులు, సాంకేతిక సిబ్బంది వివరాలు మాత్రం త్వరలో వెల్లడిస్తామని చెప్పారు. ఈ ప్రకటనకు ముందు చైతూ కూడా ట్విట్టర్‌లో తన ప్రియమైన సతీమణితో కలిసి సినిమా చేయబోతున్న విషయం నిజమేనని ప్రకటించారు. 'శివ నిర్వాణ దర్శకత్వంలో నేను నటించబోతున్నందుకు సంతోషంగా ఉంది. ఇందులో నా భార్య సమంత అవకాశమిస్తే ఆమెతో కలిసి స్క్రీన్ షేర్ చేసుకుంటాను' అని సరదాగా ట్వీట్ చేశారు చైతూ. దానికి ఎక్సైటెడ్..ఎక్సైటెడ్..ఎక్సైటెడ్' అని సమంత ట్వీట్ చేశారు.

గొడవలేం లేవు

-శ్రీధర్ మర్రి



పెళ్లిచూపులు, అర్జున్ రెడ్డి చిత్రాల కథానాయకుడు విజయ్ దేవరకొండ హీరోగా నటిస్తున్న తాజా చిత్రం 'ఏ మంత్రం వేసావె'. శివానీసింగ్ నాయికగా నటిస్తుంది. గోలీసోడా ఫిలిమ్స్ నిర్మాణంలో సురక్ష్ ఎంటర్‌టైన్‌మెంట్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మల్కాపురం శివకుమార్ సమర్పణలో శ్రీధర్ మర్రి స్వీయ దర్శక నిర్మాణంలో రూపొందిన ఈ చిత్రం శుక్రవారమే విడుదలవుతుంది. ఈ సందర్భంగా దర్శక నిర్మాత శ్రీధర్ మర్రి మాట్లాడుతూ ' మనచుట్టూ ఉన్న పరిస్థితులను ఆధారంగా చేసుకుని కథ తయారు చేయాలని 'ఏ మంత్రం వేసావె' కథను డెవలప్ చేశాను. టెక్నాలజీ మాయలో పడిపోయి అందరికీ మధ్య దూరం పెరిగిపోయింది. మన చుట్టూ ఉన్న వారి కంటే.. ఆన్‌లైన్ ఉన్నవారితో స్నేహాలు, సంబంధాలు ఎక్కువైయ్యాయి. ప్రతి చిన్న విషయాన్నీ సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్నాం. సోషల్ మీడియా అనేది పర్సనల్ టీవీలా తయారైంది. టెక్నాలజీ కంపెనీలనేవి.. జనాల్ని వారికి ఎలా ఆకర్షించుకోవాలనే ఆలోచనతోనే వస్తువులను తయారు చేస్తాయి. నేను టెక్నాలజీ రంగంలో ఉండటం వల్ల నాకు ఆ విషయం బాగా తెలుసు. దీని ఆధారంగానే 2014లో కథను తయారు చేసుకున్నాను. హై కాన్సెప్ట్ మూవీ. నేనే నిర్మాతగా మారి సినిమా చేశాను. విజయ్‌దేవర కొండ చాలా మంచి వ్యక్తి. మా మధ్య ఎటువంటి గొడవలు లేవు. తను ఎంతో సపోర్ట్ చేశారు. బిజీగా ఉండడంతో సినిమా ప్రమోషన్స్‌లో తను సపోర్ట్ చేయలేకపోతున్నాడు' అని అన్నారు.

సీజీ వల్లే 'తొలికిరణం' ఆలస్యం



పి.డి రాజు, జాబ్ బాబు, భాను చందర్

సువర్ణ క్రియేషన్స్ పతాకంపై జాన్ బాబు దర్శకత్వంలో సీనియర్ హీరో భానుచందర్ ముఖ్య పాత్ర చేయగా పి.డి. రాజు యేసు క్రీస్తు పాత్ర పోషిస్తున్న చిత్రం 'తొలికిరణం'. ఈ చిత్రం అన్ని కార్యక్రమాలను పూర్తి చేసుకొని విడుదలకు సిద్ధంగా ఉన్న నేపథ్యాన్ని పురస్కరించుకుని చిత్ర విశేషాలను తెలియజేసింది యూనిట్. ఈ సందర్భంగా భానుచందర్ మాట్లాడుతూ 'యేసు ప్రభుకు సంబంధించిన సినిమాలు చాలానే వచ్చాయి. కానీ అతని జీవిత కథ ఆధారంగా క్రీస్తు పుట్టిన దగ్గరనుంచి చనిపోయే దాకా ఉన్న కథలు మాత్రమే మనకు తెలుసు. తొలికిరణం అలా కాదు. ఆయన చనిపోయి 3 రోజుల తరువాత బ్రతికి వచ్చి ఏం చేశాడు! భక్తులకు ఏం బోధించాడు! అనే కాన్సెప్ట్‌తో వస్తున్న మొదటి సినిమా. ఇజ్రాయిల్ దేశానికి వెళ్లి పరిశోధించి మరీ తీసిన సినిమా ఇది. క్రీస్తు మనిషి కాదు, దేవుడు ఎలా అయ్యాడని తెలుసుకోవడానికి వచ్చిన హనుమంత్ యూసుఫ్ పాత్రను పోషించాను. త్వరలో జాన్ బాబు డైరెక్షన్‌లో మా అబ్బాయి జయంత్‌తో ఓ చిత్రాన్ని తెరకెక్కించనున్నామ'ని తెలిపారు. దర్శకుడు జాన్ బాబు మాట్లాడుతూ 'ఈ చిత్రంలో గ్రాఫిక్స్ 45 నిమిషాలు ఉండటం, అందుకు లండన్‌లో పని జరగటం మూలానే సినిమా విడుదల ఆలస్యం అవుతోంది. అయినా క్వాలిటీ అందించాలనే తపనతో జాప్యం జరిగింది' అని తెలిపారు.



పూజా గాంధీ

16న వస్తున్నాం

బెంగుళూరు సిటీకి ముచ్చెమటలు పట్టించిన ఓ నొటోరియస్ కిల్లర్ గ్యాంగ్‌కి పోలీసులు ఇచ్చిన బిరుదే 'దండుపాళ్యం'. ఆ గ్యాంగ్‌కి సంబంధించిన ఊరు పేరే ఈ దండుపాళ్యం. 1996 నుంచి 2000 మధ్య బెంగుళూరు, చెన్నై పరిసర ప్రాంతాల్లో 80కి పైగా హత్యలు, రేప్‌లు, దోపిడులు చేసిన హంతకులు ముఠా నేపథ్యంలో, యదార్థ సంఘటనలు ఆధారంగా దర్శకుడు శ్రీనివాస రాజు 2012లో 'దండుపాళ్యం' తెరకెక్కించారు. పూజా గాంధీ కీలకపాత్ర పోషించారు. థియేటర్ ఆర్ట్స్ యాక్టర్స్ రవికాలే, మకరందన్ దేశ్ పాండే తదితరులు నటించారు. పూజాగాంధీ, రవికాలే, మకరందన్ దేశ్ పాండే మినహా ఓ తొమ్మిది మంది నూతన నటీనటులతో దండుపాళ్యం చిత్రాన్ని 3 కోట్ల బడ్జెట్‌తో తెరకెక్కించారు. ఉన్నది ఉన్నట్లుగా చూపించే ప్రయత్నంలో భాగంగా కొద్దిగా బోల్డ్‌గా ఈ సినిమాను తెరకెక్కించి అప్పట్లో విమర్శకుల ప్రశంసలు అందుకున్నారు దర్శకుడు. ఈ చిత్రం మూడో భాగంలో కూడా మొదటి రెండు భాగాల్లో నటించిన నటీనటుల్నే తీసుకొని 'దండుపాళ్యం3'ని సిద్ధం చేశారు. ఈ చిత్రం ఈనెల 16వ తేదీన ప్రేక్షకులు ముందుకు తీసుకొచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

తొలి తొలిగా తొలకరి చూసి...

విశాల్ కథానాయకుడిగా పి.ఎస్.మిత్రన్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'అభిమన్యుడు'. ఎం.పురుషోత్తమన్ సమర్పణలో హరి వెంకటేశ్వర పిక్చర్స్ పతాకంపై జి.హరి ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలోని 'తొలి తొలిగా తొలకరి చూసి పిల్లాడ్నై.. విప్పారిన కన్నుల్తో లోకాన్నే చూశా..' అంటూ సాగే ఈ చిత్రంలో మొదట గీతాన్ని నితిన్ విడుదల చేశారు. శ్రేష్ట సాహిత్యం, యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. జితిన్‌రాజ్ ఆలపించారు. ఈ సినిమాకి సంబంధించిన షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రాన్ని విడుదల చేస్తామని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి మాటలు: రాజేష్ ఎ.మూర్తి, సహ నిర్మాత: ఇ.కె.ప్రకాశ్, నిర్మాత: జి.హరి, దర్శకత్వం : పి.ఎస్.మిత్రన్.



విశాల్, సమంత



కొవెర, మహవీర్, దేవిశ్రీప్రసాద్ తదితరులు

'కథే హీరో' మొదటి పాట

కొవెరా క్రియేషన్స్ బ్యానర్‌పై నూతన దర్శకుడు కొవెర దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కథే హీరో'. చిత్రంలోని మొదటి పాటను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ గురువారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 'ఈ పాట చాలా ఆహ్లాదంగా ఉంది. వినగానే చాలా నచ్చేసింది. ఈ పాటతో పాటుగా ఈ సినిమాలోని అన్ని పాటలు మంచి హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని తెలిపారు. దర్శకుడు కొవెరా మాట్లాడుతూ 'సత్య మహావీర్ మంచి సంగీతాన్ని అందించి మా సినిమాని మరో స్థాయికి చేర్చారు. మిగిలిన పాటలని కూడా త్వరలోనే విడుదల చేస్తాం. ఇంతకుముందు విజయేంద్ర ప్రసాద్ దగ్గర పనిచేశాను. కొన్ని సినిమాలకి రచయితగా కూడా చేశాన'ని తెలిపారు.



మామిడిలో సమగ్ర యాజమాన్యం

ప్రస్తుత పరిస్థితుల్లో మామిడి పూత, పిందె రాలడం అనేది తీవ్రమైన సమస్య. పూత నుంచి ఏర్పడిన పిందెల్లో ముప్పాతిక భాగం మొదటి 3-4 వారాల్లో రాలిపోతుంది. ఈ రాలుడుకి ప్రధానకారణాలు వాతావరణంలో వచ్చే మార్పులు, నీటి ఎద్దడి, చీడపీడలు, హార్మోన్లు, ఫలదీకరణ లోపాలు. అవకాశం ఉంటే పూత, పిందె దశలో తేలికపాటి తడులు ఇస్తే రాలుడు తగ్గించవచ్చు. దీనితో పాటు ఈ దశలో తీసుకోవలసిన సమగ్రయాజమాన్యం గురించి మామిడి పరిశోధనాస్థానం శాస్త్రవేత్తలు ఇస్తున్న వివరాలు చూద్దాం.

మామిడి రైతులు సమయానుకూలంగా వ్యవసాయ పద్ధతులను ఆచరించాలి. ఆ క్రమంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని, పర్యవేక్షిస్తూ మామిడితోటల్లో సమగ్ర సస్యరక్షణ పాటించాలి. మామిడి కాయలు అంగుళం సైజు ఏర్పడేంతవరకూ చాలా త్వరగా పెరుగుతాయి. ఆ సమయంలో ముఖ్యంగా నత్రజని, పోటాషియం, పోషకాల అవసరం ఎక్కువగా ఉంటుంది. నీటి వసతి గల తోటల్లో చెట్టుకి కిలో చొప్పున యూరియా, పొటాష్ పిందెలు గోళీకాయ సైజులో ఉన్నప్పుడు వేసి, నీరు కట్టాలి. నీటి వసతి ఉన్న తోటల్లో కాయలు నిమ్మకాయ పరిమాణంలో ఉన్నప్పుడు పొటాషియం నైట్రేట్ 10 గ్రా. కలిపి పిచికారీ చేయాలి. బోరాన్ లోపమున్న తోటల్లో పూత బాగా వచ్చి, ఫలదీకరణ సరిగా జరగకపోవడం వల్ల పిందె కట్టు సరిగా ఉండదు. బోరాన్ లోపాన్ని సవరించి, పిందె కట్టు పెంచడానికి పూమొగ్గలు బయటికి రాకముందు బోరాక్స్ 2 గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. కాయ పగలడం కూడా బోరాన్ లోపానికున్న ముఖ్య లక్షణం.

సస్యరక్షణ.. పురుగులు

తేనమంచు పురుగు: ఇవి రసాన్ని పీల్చడం వల్ల పూత పూర్తిగా మాడిపోయి పిందే కట్టదు. లేత ఆకులు, కొమ్మల నుంచీ రసం పీల్చటంతో ఆకులు ముడతపడి,



అంటుకొని సరిగా పెరగవు. పురుగులు విసర్జించిన తేనెలాంటి బంక ఆకుల మీద కారి, సూర్యరశ్మి వెలుతురులో మెరుస్తుంది. **నివారణ:** లీటరు నీటికి ఫాస్ఫామిడాన్ 0.5 మి.లీ. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ కలిపి పూత మొదలయ్యే సమయం, పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకులపైనే కాకుండా మొదళ్లపైన, కొమ్మలపైన పిచికారీ చేయాలి. పూలు పూర్తిగా విచ్చుకోకముందే పిచికారీ చేయాలి. పూత బాగా ఉన్నప్పుడు పిచికారీ చేయడం వల్ల పుప్పొడి రాలి, పరాగ సంపర్కానికి తోడ్పడే కీటకాలు నశిస్తాయి. మొగ్గ దశలో కనిపిస్తే ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలి. థయామిథాక్సామ్ 0.3గ్రా. లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే పూత, కాపు సమయంలో తేనెమంచు పురుగును సమర్ధవంతంగా నివారించవచ్చు.

కాయతొలుచు పురుగు: ఎండు పుల్లల్లో నిద్రావస్థదశ పూర్తయిన తర్వాత రెక్కల పురుగు వెలువడి కాయల మీద గుడ్లు పెడుతుంది. ఈ పురుగు మామిడిపండ్ల సీజన్లో మూడు తరాలు వృద్ధి చెంది, మే నెలాఖరుకు నాల్గవ తరంలో ఉన్న ఎదిగిన క్రిమి పురుగులు ఎండు పుల్లల్లోకి చేరి, కొన్ని నెలల పాటు నిద్రావస్థలో ఉండి, తర్వాత పంటను ఆశిస్తాయి.

నివారణ:

✧ మామిడి పంట పూర్తయిన తర్వాత ఎండుకొమ్మలను తీసేసి నాశనం చేయాలి.

✧ పురుగు ఆశించిన కాయలను చెట్టు నుంచి కోసి, నాశనం చేసి, పురుగు వ్యాప్తి నివారించాలి.

✧ జనవరి మాసం రెండవ పక్షంలో క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. లేదా డైక్లోరోహిస్ 1.5 మి.లీ. లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలి.



✧ మామిడి పిందెలు గోళీ సైజు లేదా గొంగళి పురుగులు వలసవెళ్లే సమయంలో డైక్లోరోవాస్ 1.5 మి.లీ. లేదా క్లోరిఫైరిఫాస్ 2.5 మి.లీ. లేదా వేపనూనె 3మి.లీ. క్లోరిఫైరిఫాస్ మి.లీ. లీటరు నీరు వంతున కలిపి, పిచికారీ చేయాలి.

రాతిమంగు: ఇది తామర పురుగుల వల్ల కలుగుతుంది. ఈ కీటకాలు మామిడి కాయలను పిందె దశలో ఆశించి, పైచర్మాన్ని గీకడం వల్ల మంగు ఏర్పడుతుంది. ఈ పురుగుల నివారణకు ఫిప్రోనిల్ 2. మి.లీ లేదా డైమిథోయేట్ 1.5 మి.లీ. లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ. లేదా హెలాప్తాథయాన్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి, నల్లపూత దశలో అనగా పిందెలు ఎదిగే దశలో పిచికారీ చేయాలి.



టెంక పురుగులు: ఈ పురుగులు కాయలు చిన్నగా ఉన్నప్పుడే గుడ్లు పెడతాయి. ఫలితంగా క్రిములు లోనికి చొచ్చుకుపోయి, టెంకలోకి ప్రవేశిస్తాయి. ఈ రంధ్రము మూసుకుపోయి, టెంకల లోపల పురుగు ఉన్నట్టు కూడా మనకు తెలియదు. ఆలస్యంగా కోతకు వచ్చే రకాలలో వీటి బెడద ఎక్కువ. **నివారణ:** మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ. లేదా ఫెనిట్రోథియాన్ మి.లీ. మందు లీటరు నీటిలో కలిపి, పిందే కట్టిన తర్వాత ఒకసారి, నెల తర్వాత మరోసారి పిచికారీ చేయాలి. ఇందువల్ల గుడ్లు, వాటి నుంచి వచ్చే పిల్లలు చనిపోతాయి. టెంకలో పురుగు దూరిన తర్వాత మందు చల్లినా ప్రయోజనం ఉండదు. రాలిన కాయలను ఏరి నాశనం చేయాలి.

పండు ఈగ: కాయలు పక్వానికి రాగానే పండు ఈగ ఉధృతి ఎక్కువ. లార్వాలు కాయలోని మెత్తని కండను తినటంవల్ల కాయ మెత్తబడి, కుళ్లి రాలిపోతుంది.

నివారణ: రాలిపోయిన పండ్లను ఏరి, నాశనం చేయాలి. చెట్టు కింద దున్ని కోశస్థ దశను బయట పడేయాలి. క్లోరిఫైరిఫాస్ పొడిని భూమిలో (50-100 గ్రా./ చెట్టుకు కలుపుట) ప్లాస్టిక్ పళ్లెంలో మిథైల్ యూజినాల్ 2 మి.లీ., 3 గ్రా. కార్బోఫ్యూరాన్ 3 జిని/ లీటరు నీటిలో కలిపి, తోటలో వేలాడగట్టాలి. 2 మి.లీ. మలాథియాన్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

తెగుళ్లు

బూడిద తెగులు: ఈ తెగులు ఆకుల మీద, పూరెమ్మల మీద ఆశించినప్పుడు బూడిద లాంటి తెల్లటి పదార్థం వ్యాపించి పూత, పిందె రాలిపోతుంది. ఇది పూత కాలంలో కనబడుతుంది. **నివారణ:** నీటిలో కరిగే గంధకం 2 గ్రా. లేక కెరాథేన్ మి.లీ. లేక మైకోబూటనిల్ గ్రా. లేక బేలటాన్ గ్రా., వీటిలో ఏదైనా ఒక మందును లీటరు నీటికి కలిపి, పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి 13 రోజుల తర్వాత మందును మార్చి పిచికారీ చేయాలి.

మచ్చ తెగులు: ఈ తెగులు ఆశించినప్పుడు గోధుమరంగు మచ్చలు, ఆకులు, పండ్లు, పూరెమ్మలు, పిందెలు రాలిపోతాయి. పూగుచ్ఛమంతా మగ్గిపోతుంది. కాపు ఉండదు. తెగులు, పండ్లను ఆశించనట్లయితే అవి కుళ్లిపోతాయి. చిన్న కొమ్మలు ఎండిపోతాయి. గాలిలో తేమ ఎక్కువైనప్పుడు బాగా వ్యాపిస్తుంది. **నివారణ:** ఎండు కొమ్మలను తీసివేసి, లీటరు నీటికి 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి, పిచికారీ చేయాలి. లీటరు నీటికి గ్రా. కార్బండిజమ్ కలిపి పూత సమయంలో 15 రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి. ఎగుమతి చేసే రకాలను మచ్చతెగులు రాకుండా 15 రోజుల ముందు గ్రా. కార్బండిజమ్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

మసిమంగు (సూటీమోల్డ్): ఈ తెగులు కాప్నోడియం అనే శిలీంధ్రం ద్వారా వస్తుంది. రసం పీల్చే తేనెమంచు పురుగు, పిండినల్లి విసర్జించిన తియ్యని పదార్థంపై, ఆకుల మీద పిందెలు, కాయల మీద నల్లటి మంగులా పెరుగుతుంది. దీనివల్ల కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం ఏర్పడుతుంది. కాయసైజు తగ్గిపోయి, రాలిపోతాయి. కాయలు మార్కెట్‌కి పనికిరాకుండా పోతాయి.

నివారణ:

✧ రసంపీల్చే పురుగులను సమర్థవంతంగా అరికట్టాలి.

✧ నల్లమసి మంగు నివారణకు 3 గ్రా. కాపర్ ఆక్సీక్లోరైడ్ చెట్ల ఆకులు, కొమ్మలు, రెమ్మలు తడిచేటట్లు పిచికారీ చేయాలి.

✧ ఆకులపై మసిని తొలగించుటకు రెండు కిలోల గంజిపొడిని గోరువెచ్చని నీటిలో (3-4 లీటర్లు) కలిపి ఉడికించాలి. ఆ తర్వాత మిగతా నీరుపోసి ,100 లీటర్ల గంజి ద్రావణం తయారుచేయాలి. దీన్ని తెగులు కనిపించిన భాగాలపై ఎండ బాగా ఉన్న రోజుల్లో పిచికారీ చేయాలి. 4-5 రోజుల తర్వాత నీటిని పిచికారీ చేసే, చాలా వరకూ మసిమంగును తొలగించవచ్చు.



డాక్టర్ ఆర్. రాజ్యలక్ష్మీ
సైంటిస్ట్ (హార్టీకల్చర్)
మామిడి పరిశోధనాస్థానం, నూజివీడు

వేసవిలో మినుము, పెసర

వేసవిలో వేసుకోదగిన మినుము, పెసర సాగు గురించి.. వ్యవసాయ విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు ఇస్తున్న వివరాలు.


మినుము, పెసర్లను వేసవిలో ఫిబ్రవరి నుండి మార్చి 15 వరకూ విత్తుకోవచ్చు. వరి మాగాణులలో అయితే (రబీ వరి తరువాత) మార్చి ఆఖరు వరకూ విత్తుకోవచ్చు. అయితే పైరు పూత సమయంలో అధిక ఉష్ణోగ్రతకు గురికాకుండా చూసుకోవాలి. వేసవిలో సాగుచేసే మినుము, పెసర రకాలు తక్కువ కాలంలో కాపునకు వచ్చి బెట్టను, వేడిని తట్టుకునేవిగా ఉండాలి. వేసవిలో రసంపీల్చే పురుగులు, వైరస్ తెగుళ్ళు ఎక్కువగా వస్తాయి. కాబట్టి వీటిని తట్టుకుని, అధిక దిగుబడినిచ్చే రకాలను సాగుకు ఎంచుకోవాలి.

- **మినుము రకాలు :** ఎల్.బి.జి 752, ఎల్.బి.జి 20, పి.యు 31, ఎల్.బి.జి 787, టి.బి.జి 104 రకాలు అనువైనవి.
- **పెసర రకాలు :** ఎల్.జి.జి 460, ఎల్.జి.జి 407, ఐ.పి.యం 2-14, డబ్ల్యూ.జి.జి 42, టి.యం 96-2.

విత్తన మోతాదు

- **మినుము :** వేసవిలో ఆరుతడి పంటగా సాగు చేసినట్లయితే 8-10 కిలోలు/ ఎకరాకు, వరి మాగాణులలో అయితే 16-18 కిలోలు / ఎకరానికి విత్తుకోవలసి ఉంటుంది.
- **పెసర :** 6-7 కిలోలు/ ఎకరాకు (మెట్టలో), 12 కిలోలు/ ఎకరాకు (వరి మాగాణులలో)

విత్తనశుద్ధి : కిలో విత్తనానికి 5 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ 600 ఎఫ్.ఎస్ లేక 5 గ్రా. థయోమిథాక్సమ్ 70 డబ్ల్యూ.ఎస్ మందుతో విత్తనశుద్ధి చేయాలి. ఈ పైరును కొత్తగా పండించేటప్పుడు, రైజోబియం కల్చరును విత్తనంతో కలిపి విత్తితే అధిక దిగుబడి పొందవచ్చు.



కలుపు నివారణ: మెట్ట భూముల్లో సాగు చేసినప్పుడు పెండిమిథాలిన్ 30% ద్రావకం ఎకరాకు 1.3 నుండి 1.6 లీటర్లు చొప్పున విత్తిన వెంటనేగానీ మరుసటిరోజునగానీ పిచికారీ చేయాలి. విత్తిన 20-25 రోజులప్పుడు గొర్రుతో అంతరకృషి చేయాలి. వరి మాగాణులలో గడ్డిజాతి, వెడల్పాటి మొక్కలు ఉన్నప్పుడు ఇమజితాఫిర్ 10% ద్రావకం ఎకరాకు 200 మి.లీ. 15-20 రోజుల మధ్య పిచికారీ చేయాలి. ఊద, చిప్పర, గరికలాంటి గడ్డిజాతి మొక్కల నిర్మూలనకు ఫినాక్సాప్రాప్ ఇథైల్ 9% ద్రావకం ఎకరాకు 250 మి.లీ. లేదా క్విజలాపాప్ ఇథైల్ 5% ద్రావకం ఎకరాకు 400 మి.లీ. చొప్పున ఏదో ఒకదానిని 200 లీటర్ల నీటిలో కలిపి, విత్తిన 15-20 రోజుల మధ్య పిచికారీ చేసి, కలుపు నివారణ చేసుకోవచ్చు. **ఎరువులు:** ఎకరానికి 8 కిలోల నత్రజని, 20 కిలోల భాస్వరం ఇచ్చే ఎరువులు వేయాలి. వరి మాగాణుల్లో ఎరువులు వాడాల్సిన అవసరం లేదు.



డా. కె. రాజారెడ్డి,
విస్తరణ సంచాలకులు,
ఆచార్య ఎన్.జి. రంగా
వ్యవసాయ విశ్వవిద్యాలయం,
లాం, గుంటూరు - 522 034.



పొడుపు కథ

సూర్యుడు ఉండేదెటువైపో,
నే తిరుగుతానటువైపు,
అందమిస్తది పంటచూపు,
గింజలౌను నూనె రూపు.. నేనెవరిని?


జవాబు : పొద్దు తిరుగుడు

జోక్:

చింటు : ఈ పెయింటింగ్ 210 రోజులు కిందటిది కదా!

బంటి : అంత కరెక్టుగా ఎలా చెప్పగలిగావు?

చింటు : పదిరోజుల క్రితం ఈ పెయింటింగ్ కొన్నప్పుడు షాపువాడు ఈ పెయింటింగ్ 200 వందల నాటిదన్నాడు!



నీడ కనిపెట్టండి!

పిల్లలూ..! పక్కనున్న చిత్రంలో కొన్ని కూరగాయలు, వాటి నీడలు ఉన్నాయి. ఏ నీడ దేనిదో కనిపెట్టండి!

నోట్లో నీరెందుకు ఊరుతుంది?



పిల్లలకు ఇష్టమైన తినుబండరాలు చూసినపుడు నోట్లో నీళ్ల ఊరతాయి. ఎందుకో తెలుసా? మనం మంచి ఆకలిమీద ఉన్నపుడు ఇష్టమైన వస్తువులు కళ్ల ముందు కనిపించినా, వాటి పేరు తలచుకున్నా, ఆ పదార్థాల్ని చూసినా నోట్లో నీళ్ల ఎక్కువగా ఊరుతుంటాయి. పులుపు పదార్థాలకు ఆమ్లత్వం ఉండడంవల్ల ఆ ఆమ్లత్వాన్ని తగ్గించేందుకు, సజలీకరణం చేసేందుకు పుల్లని వస్తువులు తిన్నప్పుడు నోరు అధికంగా ఊరుతుంది. ఈ స్థితికి మన శరీరం, జీర్ణవ్యవస్థ అలవాటుపడి ఉంటాయి. కాబట్టి మనం బాగా ఆకలితో ఉన్నప్పుడు చింతపండు, ఊరగాయలు వంటి పదార్థాలను చూసినప్పుడు లేదా విన్నప్పుడు మన మెదడు నోట్లో నీరు ఊరించేలా ప్రేరేపిస్తుంది. అలాంటి జీవభౌతిక ధర్మాన్ని అలవాటువల్ల వచ్చిన ప్రేరణ అంటారు. అలాగని తీపి వస్తువులు చూసినా, వాటి గురించి విన్నా నోట్లో నీరు ఊరదు అనుకోకూడదు. ఆకలితో ఉన్నప్పుడు మనకు రుచిగా అనిపించే ఏ ఆహార పదార్థాన్ని గురించి విన్నా లేదా చూసినా ఎంతో కొంత నోరూరుతుంది. కానీ కడుపునిండా తిన్నాక చింతపండు చూసినా నోట్లో నీరు ఊరుతుంది. ఇది నోట్లో నీరూరడం వెనుకమున్న అసలు సంగతి. ★





సహేస్‌లో నా అనుభవాలు

ఈ మధ్య విజయవాడకు దగ్గరలో ఉన్న కుంచనపల్లి అరవింద స్కూల్‌లో నెలక్రితం జరిగిన సహేస్ స్కూల్స్ ఇంటెన్సివ్‌లో నేను పాల్గొన్నాను. మేం అక్కడ మూడు రోజులున్నాం. ఆ స్కూల్ ఆవరణలో నాకు ఎన్నో మంచి అనుభూతులు కలిగాయి. అక్కడ మాకు చాలా కళలను నేర్పించారు. నాలో అంత టాలెంట్ ఉన్న సంగతి అక్కడికి వచ్చే వరకూ తెలియదు. అక్కడ ఎన్నో విషయాలు నేర్చుకున్నా. మాకు కొత్తకొత్త ఆటలు, కంప్యూటర్‌లో కొత్త విషయాలు, కోలాటంను నేర్పించారు. మన మనసులో ఉన్న భావాల్ని పేపరుమీద పెట్టి, కవిత రాయవచ్చనే విషయాన్ని అక్కడి ఉపాధ్యాయులు చెప్పారు. వారి ప్రోత్సాహంతో నేనూ కవిత రాసా. నాకు చాలా సంతోషం అనిపించింది. అప్పుడప్పుడు ఇలాంటి కార్యక్రమాలకు వెళుతుంటే.. మనలో దాగివున్న కళలు బయటకు వస్తాయి. అన్నింటికంటే.. రాత్రిపూట డప్పు కొడుతుంటే డ్యాన్స్ చేయడం నాకెంతో నచ్చింది.



ఎస్. నిఖిత
10వ తరగతి
శ్రీ విజయవాణి హైస్కూల్,
చిత్తూరు.

పిల్లల్లారా.. రారండి!!

కథలు, కవితలు, మీరు గీసిన బొమ్మలు, చూసిన ప్రదేశాలు, కనిపెట్టిన సైన్సు సంగతుల గురించి రాసి మీపేరు, ఫొటోతో పంపవలసిన మా చిరునామా :

చిన్నారి, జీవన, ప్రజాశక్తి తెలుగు దినపత్రిక,
హౌస్ నెం : 27-30-4, ఆకులవారి వీధి, గవర్నర్ పేట,
విజయవాడ-2.
ఇ మెయిల్ - jeevanapageps@gmail.com



అమరావతికి 623 కోట్లు

పొంతనలేని కేటాయింపులు
పట్టణాభివృద్ధికి రూ.7740 కోట్లు
మెట్రోలకు నిల్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కీలకంగా పేర్కొంటున్న అమరావతికి ప్రభుత్వం నామమాత్రపు కేటాయింపులనే చేసింది. మొత్తం 45 వేల కోట్ల విలువైన పనులు జరుగుతున్నాయని చెబుతున్నా ఆచరణలో మాత్రం రైతులకు చెల్లించే కౌలుతో కూడా కలిపి రూ.623 కోట్లు మాత్రమే కేటాయించింది. దీనిలో కౌలు కింద ఏడాదికి రూ.166 కోట్లు వెచ్చించాల్సి ఉంటుంది. కీలకమైన విశాఖ, విజయవాడ మెట్రోలకు నిధులు కేటాయింపులు చేయలేదు. కేంద్ర బడ్జెట్లోనూ చేయకపోవడంతో వీటిని చేపడతారా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గతేడాది మున్సిపల్ పట్టణాభివృద్ధిశాఖకు రూ.జ5207 కోట్లు



కేటాయిస్తే ఈ ఏడాది రూ.7740 కోట్లు కేటాయించారు. పెంపుదల 49 శాతమని తెలిపారు. ప్రస్తుతం అమరావతి నగరంలో మౌలిక సదుపాయాల కల్పన జరుగుతోంది. దీనికి వేర్వేరు సంస్థల నుండి అప్పులు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. అయితే వాటిని బడ్జెట్లో చూపించకపోయినా, పనులకు వెచ్చించే మొత్తాన్ని చూపించాల్సి ఉంటుంది. ఆ కేటాయింపులు కూడా లేవు. ప్రస్తుతం రాజధాని ప్రాంతంలో జరుగుతున్న పనులకు కేటాయించిన మొత్తానికి ఎక్కడా పొంతన లేదు. 12 అంతర్గత రోడ్ల పనులు జరుగుతున్నాయి. రైతులకు కేటాయించిన ప్లాట్లకు సంబంధించి 15 వేల ఎకరాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఎకరాకు కోటి రూపాయల చొప్పున రూ.15 వేల కోట్లు అవసరం ఉంటుంది. ఈ కోణంలో ఎక్కడా కేటాయింపులు లేవు. మరోవైపు 2017 మార్చి నాటికి రైతులకు ప్లాట్లు ఇస్తామన్నారు. 2018 నాటికి కూడా పూర్తికాలేదు. ఆయా ప్లాట్లలో రోడ్లు, విద్యుత్, మంచినీటి పైపులైను పనులు చేపట్టాల్సి ఉంటుంది. అవన్నీ చేపట్టిన తరువాతే ప్లాట్లను రైతులకు ఇవ్వాలి. ప్రస్తుతం అవేమీ లేకుండానే రైతులకు ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు కంపెనీలకు భూములు కేటాయింపులు చేస్తున్నారు. దీనిపై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. అమరావతిలో సదుపాయాల కల్పనకు రూ.457 కోట్లు కేటాయించినట్లు చూపించారు. జీతాలకే రూ.110 కోట్ల వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. బడ్జెట్ ప్రసంగంలో అమరావతిలో అన్నా క్యాంటీన్లు పెట్టామని చెప్పినా అవి తాత్కాలిక నిర్వహణ తప్ప పూర్తిస్థాయిలో ప్రజలకు ఉపయోగపడుతున్నదేమీ లేదు. విశాఖ, తిరుపతి, కాకినాడ, అమరావతితోపాటు, శ్రీకాకుళం, ఏలూరు, ఒంగోలు, కర్నూలు, అనంతపురం, నెల్లూరులో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులకు రూ.800 కోట్లు కేటాయించారు. మురుగునీటి వ్యవస్థకు రూ.300 కోట్లు కేటాయించారు. విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్‌కే రూ.75 కోట్లు వెచ్చించారు.

అవసరాలకు కేటాయింపులకు పొంతన లేదు

సిపిఎం రాజధాని ప్రాంత సమన్వయ కమిటీ కన్వీనర్ బాబూరావు

రాజధాని అవసరాలకు, కేటాయింపులకు ఏ మాత్రమూ పొంతన లేదని సిపిఎం రాజధాని ప్రాంత సమన్వయ కమిటీ కన్వీనర్ సిహెచ్.బాబూరావు విమర్శించారు. 45 వేల కోట్ల అవసరం ఉందని చెబుతూనే అన్నిటికీ కలిపి రూ.623 కోట్లు కేటాయించడం ఏంతవరకు సమంజసమని ప్రశ్నించారు. మెట్రో ప్రాజెక్టుల ఊసే ఎత్తులేదని తెలిపారు. అలాగే రాజధాని ప్రాంతంలో సదుపాయాల కల్పనకు ప్రత్యేకంగా నిధులు కేటాయించాల్సి ఉన్నా కేటాయించలేదని తెలిపారు. ఇన్నర్‌రింగురోడ్డు, ఔటర్‌రింగురోడ్లంటూ ప్రకటనలు చేస్తున్న ప్రభుత్వం దానికి ఈ బడ్జెట్లో నిధులు కేటాయింపులు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. రోడ్ల పేరుతో భూములను మాత్రం లాక్కుంటోందని అన్నారు. మొత్తంగా పరిశీలిస్తే బడ్జెట్లో పట్టణాభివృద్ధి కంటే ప్రచారానికే ఎక్కువ ప్రాధాన్యత కల్పించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

అంకెల్లోనే నిరుద్యోగ భృతి

బడ్జెట్‌లో వెయ్యి కోట్లు కేటాయింపు



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని నిరుద్యోగులకు సాయంగా ఇచ్చే నిరుద్యోగ భృతి అంకెల్లోనే మిగలనుంది. ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించారు. గతేడాది బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయించినప్పటికీ రూ.50 మాత్రమే ఖర్చు చేశారు. అది కూడా నిరుద్యోగలకు ఏ మాత్రం ఉపయోగపడలేదు. ఇందుకు కారణం యువజన విధానానికి సంబంధించి ఇప్పటి వరకూ విధివిధానాలు ఖరారు చేయలేదు. ప్రభుత్వం అందిచే భృతి కోసం రాష్ట్రంలోని 1.70 కోట్ల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా జనవరి 12న నిరుద్యోగ భృతిని ప్రకటిస్తామని మంత్రులు, అధికారులు ప్రకటించారు. అయితే ఆ తేదీని కూడా దాటవేసి కాలయాపన చేస్తున్నారు. అర్హులైన నిరుద్యోగుల సంఖ్యను తగ్గించుకునే పనిలో ప్రభుత్వం పడినట్లు తెలుస్తోంది. ప్రభుత్వం చేపట్టిన సాధికార సర్వేలో 33.88లక్షల మంది నిరుద్యోగులు ఉన్నారు. ఉపాధి కల్పనా కార్యాలయంలో తొమ్మిది లక్షల మంది నమోదయ్యారు. ఇంటర్మీడియట్ లోపు చదువుకున్న వారు నిరుద్యోగ భృతి పొందేందుకు అర్హులు కారని ముసాయిదాలో యువజన శాఖ పేర్కొంది. దాంతో 12 లక్షల మంది భృతి పొందే అవకాశాన్ని కోల్పోనున్నారు. దీనికి తోడు భృతిని పొందేందుకు ప్రభుత్వం వయో పరిమితిని

2016-2017 కేటాయింపులు రూ. కోట్లలో

విషయం	2017-18 అంచనా	ఖర్చు	2018-19 అంచనా
యువజన పాలసీ	500	50	1000
ఎన్‌సిసి	47	46	51
శాప్	15	35	100
సాంస్కృతిక	72	68	85.99
ఎపిటిఎ	200	175	190
పర్యాటకం	285	251	290

కూడా పెట్టింది. రేషన్ కార్డులో ఉన్న కుటుంబీకుల్లో ఒక్కరు మాత్రమే భృతి పొందేందుకు అర్హులని ముసాయిదాలో పొందుపరిచారు. ఇంటిలో ఒక్కరికే ఇస్తే ప్రభుత్వం ఇచ్చే భృతితో కుటుంబం గడుస్తుందా అన్న సందేహాలు నిరుద్యోగుల మదిలో మెదులుతున్నాయి. భృతి పొందేందుకు అర్హులైన వారు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేయాలని, ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచనప్రాయంగా ఆదేశాలిచ్చారు. ప్రభుత్వ ప్రచారకర్తల్లాగా వాడుకుని భృతి అందించాలని చూస్తున్నారు.

పర్యాటకానికి పెంచలేదు

ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చేలా అభివృద్ధి చేస్తామని గొప్పలు చెబుతున్న పర్యాటక రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులు మాత్రం పెంచలేదు. గతేడాది రూ.285.35 కోట్లు కేటాయించగా ఈ ఏడాది రూ.290 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీకి గతేడాది రూ.200 కోట్లు కేటాయించగా, ఈ ఏడాది ఆ మొత్తాన్ని తగ్గించి రూ.190 కోట్లు మాత్రమే కేటాయించారు. ఆతిథ్య రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలంటున్న ప్రభుత్వం హోటళ్ల, రెసార్ట్‌ల ఏర్పాటుకు ఒక్క రుపాయి కూడా కేటాయించలేదు.

మా ఇంటి మా లక్ష్మికి దక్కని చోటు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఈ ఏడాది రాష్ట్ర బడ్జెట్‌లో మహిళా, శిశు, వయోవృద్ధులు, వికలాంగుల సంక్షేమానికి ప్రభుత్వం రూ 3007.96 కోట్లు కేటాయిం చింది. మొత్తం బడ్జెట్‌లో 1.57 శాతం ఈ శాఖకు కేటాయిం చింది. గతేడాది ఈ శాఖకు దాదాపు రూ 1773 కోట్లు కేటాయించగా రూ 2497 కోట్లకు సవరించారు. వయోవృద్ధుల, వికలాంగుల సంక్షేమానికి ఈ బడ్జెట్‌లో రూ . 139.51 కోట్లు కేటాయించింది. తొలిసారిగా బడ్జెట్‌లో హిజ్రాల సంక్షేమానికి రూ 20 కోట్లు కేటాయిం చింది. మాతా శిశు పోషకాహారంలో ప్రధాన పథకమైన సమగ్ర శిశు అభివృద్ధి పథకానికి (ఐసిడిఎస్) కు ఈ ఏడాది రూ 1182.04 కోట్లు కేటాయించారు. పోషకాహార కార్యక్రమానికి రూ 821.81 కోట్లు, గిరి గోరుముద్దలు కార్యక్రమానికి రూ 22.86 కోట్లు, కిశోర బాలికా వికాస కార్యక్రమం ' సబల ' కు రూ 59.91 కోట్లు కేటాయిం చింది. గర్భిణి, బాలింతలకు ఒక్క పూట పూర్తి భోజనం ద్వారా పోషకాహారాన్ని అందించే ' అన్న అమృత హస్తం' కు గతేడాది సవరించిన అంచనాలు మాదిరిగానే రూ 194.78 కోట్లు కేటాయించారు. ఇక ఆడపిల్లలకు ఆర్థిక భరోసానిచ్చే ' మా ఇంటి మా లక్ష్మి ' కార్యక్రమానికి ఈ సారి కూడా చోటు దక్కలేదు. ఈ పథకానికి ఈ బడ్జెట్‌లో ఎలాంటి కేటాయింపులు లేవు. గతేడాది మా ఇంటి మాలక్ష్మికి రూ 3 కోట్లు కేటాయించినా అది కాగితాల వరకే పరిమితమైంది తప్ప అమలుకు నోచుకోలేదు. ఇక ఈ బడ్జెట్‌లో కనీసం కేటాయింపులు లేకపోవడంతో పథకం కనుమరుగవుతుందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మోసపూరిత బడ్జెట్ : ఐద్వా

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన బడ్జెట్‌ను ప్రజలను మోసపరిచేలా ఉందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి. రమాదేవి విమర్శించారు. మహిళా సంక్షేమంతో పాటు ఇతర రంగాలకు చేసిన కేటాయింపుల్లో ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపించడం లేదని వ్యాఖ్యా నించారు. డ్వాక్రా మహిళలకు శానిటరీ నాపికిన్స్ పేరిట కేటాయించిన 100 కోట్ల రూపా యల నిధులు ఏ మాత్రం చాలవని, ప్రభుత్వ ప్రచారార్భాటానికే ఈ పథకం పరిమితమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. చివరి పూర్తిస్థాయి బడ్జెట్‌లోనూ డ్వాక్రా మహిళల రుణాన్ని పూర్తిగా మాఫీ చేయడానికి ప్రభుత్వం ప్రయత్నిం చకపోవడం విచారకరమని పేర్కొన్నారు. రైతు రుణమాఫీ కూడా ఇదే విధంగా ఉందని తెలిపారు. వడ్డీలేని రుణాల మొత్తం పెంచినట్టు కనిపించినప్ప టికీ, అవసరాలను పరిగణలోకి తీసుకుంటే అదికూడా చాలదని అన్నారు. చంద్రన్న పెళ్లికానుక, ఆదరణ, వివిధ సామాజిక తరగతులకు కేటాయిం పుల పేరుతో ప్రభుత్వం ఎన్నికల మాయాజాలానికి పాల్పడిందని, వీటికి నిధులు ఎక్కడినుండి వస్తాయని ప్రశ్నించారు. కేటాయింపులకు తగినట్టుగా నిధుల సమీకరణ చేయడం అనుమానాస్పదంగా మారిందని పేర్కొన్నారు.

స్టార్టప్‌ల ప్రోత్సాహానికి రూ.100 కోట్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఐటి రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తామంటున్న ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్‌లో ఐటి శాఖకు రూ.1006.89 కోట్లు కేటాయించింది. గతేడాది అత్యల్పంగా రూ.364 కోట్లు కేటాయించి ఈ ఏడాది కేటాయింపులను పెంచినప్పటికీ ఐటి రంగాన్ని బలోపేతం చేసేందుకు ఈ కేటాయింపులు సరిపోయేనా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఐటి రంగంలో అత్యధిక ఆసక్తికరంగా ఉన్న స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు కేవలం రూ.100 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇ-ప్రగతికి రూ.200 కోట్లు, ఎపిఇఐటిఎకు రూ.60 కోట్లు, జహవర్ నాలెడ్జ్ కేంద్రాలకు రూ.4 కోట్లు, ఐటి శాఖకు రూ.424 కోట్లను కేటాయించారు. రాష్ట్రాన్ని ఐటి హబ్‌గా తీర్చిదిద్దడంతో పాటు లక్షల మందికి ఉపాధి కల్పిస్తామని చెబుతున్న ప్రభుత్వం నామ మాత్రపు కేటాయింపులతో సరిపెట్టిందన్న విమర్శలూ వ్యక్తమవుతు న్నాయి. ఐటి రంగంలో చిన్న పాటి స్టార్టప్‌ను ప్రారంభించాలన్నా కనీసం రూ.కోటి అవసరం అవుతుంది. బడ్జెట్‌లో కేటాయించిన నిధుల ప్రకారం ఏడాది మొత్తానికి కలిపి కేవలం వంద చిన్నపాటి స్టార్టప్‌లను మాత్రమే ప్రోత్సహించే అవకాశం కలగనుంది.

భారత్ బోణీ

మళ్ళీ రాణించిన గబ్బర్ - బంగ్లాపై ఆరు వికెట్ల తేడాతో సునాయస విజయం



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజయ్ శంకర్

కొలంబో: నిదహాస్ ట్రోఫీలో భాగంగా గురువారం బంగ్లాదేశ్‌తో తలపడిన టీమిండియా 6 వికెట్ల తేడాతో సునాయాస విజయం సాధించింది. టాస్ ఓడి తొలిగా బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 139 పరుగులు మాత్రమే చేసింది. ఆ లక్ష్యాన్ని టీమిండియా 18.4 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి సాధించింది. శ్రీలంక మ్యాచ్‌లో రాణించిన గబ్బర్ ఈ మ్యాచ్‌లోనూ అర్ధసెంచరీ చేశాడు. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ విజయ్ శంకర్ 32 పరుగులకు 2 ప్రధాన వికెట్లను నేలకూల్చి టీమిండియా విజయంలో ప్రధానపాత్ర పోషించాడు. కేవలం 40 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న భారత్‌ను శిఖర్ ధావన్, సురేశ్ రైనా ముందుండి నడిపించారు. మరోవైపు ఓపెనర్ శిఖర్ ధావన్ 52 పరుగులతో ఈ సిరీస్‌ల రెండో అర్ధ శతకాన్ని నమోదు చేసుకున్నాడు.

రాణించిన భారత బౌలర్లు..

శ్రీలంకతో జరిగిన తొలి టీ20లో రాణించని భారత్ బౌలర్లు.. బంగ్లాతో మ్యాచ్‌లో విజృభించారు. కెప్టెన్ రోహిత్ శర్మ నమ్మకాన్ని బౌలర్లు ఈ మ్యాచ్‌లో నిలబెట్టారు. పేస్ బౌలర్ జయ్‌దేవ్ ఉనద్కత్(3/38), ఆల్‌రౌండర్ విజయ్ శంకర్(2/32) వెంటవెంటనే బంగ్లాదేశ్ బ్యాట్స్‌మెన్‌ను పెవిలియన్‌కు పంపించారు. ఈ క్రమంలో బంగ్లా బ్యాట్స్‌మెన్ భారీ షాట్లు కొట్టే అవకాశం కూడా లేకుండా చేశారు. శార్దూల్ ఠాకూర్, చాహల్ కూడా చక్కగా బౌలింగ్ చేయడంతో బంగ్లాదేశ్ తక్కువ పరుగులకే పరిమితమయింది.

బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 139 పరుగులు
దాస్ 38, షబ్బీర్ రహమాన్ 30
ఉనద్కట్ 3/38, విజయ్ శంకర్ 2/32

భారత్ 18.4 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 140 పరుగులు
శిఖర్ ధావన్ 55, సురేష్ రైనా 28
రూబెల్ హుసైన్ 2/24, తస్కిన్ అహ్మద్ 1/28

శారదాంబ మృతి

- సిపిఎం సంతాపం
- నిర్బంధ కాలంలోనూ పార్టీకి
- అండగా నిలబడ్డారు
  : బివి రాఘవులు



ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

వీర తెలంగాణ సాయుధ పోరాట యోధులు కె.కృష్ణమూర్తి భార్య శారదాంబ (90) గురువారం మృతి చెందారు. ఆమె మృతి పట్ల సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బి.వి.రాఘవులు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. శారదాంబ కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. శారదాంబ భౌతికకాయాన్ని సందర్శించి వారు అరుణ పతాకాన్ని కప్పి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాఘవులు మాట్లాడుతూ.. నిర్బంధకాలంలో సైతం శారదాంబ పార్టీనే అంటిపెట్టుకుని దృఢంగా నిలబడ్డారని తెలిపారు. వారి కుటుంబం మొత్తం పార్టీకి అండగా నిలబడిందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం రోజున ఆమె మరణించటం యాదృచ్ఛికమేనన్నారు. మహిళాలోకమంతా ఆమె స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. తమ్మినేని మాట్లాడుతూ శారదాంబ మరణం ప్రజా ఉద్యమాలకు తీరనిలోటన్నారు. సాయుధ పోరాటకాలం నుంచి నేటి వరకూ ఆమె పార్టీకి అండగా నిలబడ్డారని పేర్కొంటూ నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డిజి నర్సింహారావు, బి.వెంకట్, తెలంగాణ సాయుధ పోరాట యోధులు మల్లు స్వరాజ్యం, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు టి.సాగర్, నగర కార్యదర్శి ఎమ్.శ్రీనివాస్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. శారదాంబ మరణంపట్ల తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పి.జంగారెడ్డి, కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రసాద్, ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు తీవ్ర సంతాపాన్ని ప్రకటించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ఎపి వ్యకాస సంతాపం

శారదమ్మ మృతికి ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దడాల సుబ్బారావు, వి వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘంలో దున్నేవానికే భూమి అనే నినాదంతో పేదల సమస్యలపై పోరాడిన నాయకురాలు శారదమ్మ అని, తెలంగాణా సాయుధ పోరాటంలో రజాకార్లకు వ్యతిరేకంగా ఆమె పోరాడారని వారు పేర్కొన్నారు.

శారదమ్మ మృతి వ్యవసాయ కార్మిక ఉద్యమానికి తీరని లోటని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకులు పాటూరు రామయ్య పేర్కొన్నారు.

కర్ణాటకకు షాక్

దేవధర్ ట్రోఫీ ఇండియా-బి కైవసం



ట్రోఫితో ఇండియా'బి' జట్టు

ధర్మశాల : దేవధర్ ట్రోఫీని ఇండియా-బి గెలుచుకుంది. గురువారం కర్ణాటకతో తలపడి ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించి ట్రోఫీని కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలిగా బ్యాటింగ్ చేసిన కర్ణాటక జట్టు నిర్ణీత 50 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 279 పరుగులు చేసింది. రవికుమార్ సమర్థ్ 107, గౌతమ్ 76 పరుగులు చేయగా... ఖలీల్ అహ్మద్‌కు 3, ఉమేష్ యాదవ్‌కు 2 వికెట్లు పడగొట్టారు. ఇండియా-బి 48.2 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేదించింది. గైక్వాడ్, ఈశ్వరన్, శ్రేయర్ అయ్యర్, మనోజ్ తివారీలు అర్ధసెంచరీలు సాధించి మ్యాచ్‌ను గెలిపించారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ రవికుమార్ సమర్థ్‌కు లభించింది.

Published and Printed by Paturu Ramaiah on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governarpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Paturu Ramaiah, Ph : 2577248, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68